www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 356

బుధవారం | 10-4-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: విదియ సా. 5.33 తదుపరి తదియ; నక్షత్రం: భరణి తె. 3.05 తదుపరి కృత్తిక; వర్జ్యం: మ. 1.53-3.21; దుర్ముహూర్తం: ఉ. 11.51-12.41; అమృతఘడియలు: రా. 10.41-12.09; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.26

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పనికి రాని పట్టా!

కొరగాని ఇళ్ల పత్రాలతో జగన్మాయ..

32 లక్షల మందిని ముంచేశారు

'ఓటీఎస్' డబ్బులు కట్టించుకొని 'ఇంటి పత్రాలు' పేదల చేతికి..

వాటిపై జగన్ ఫొటోలు, డిజైన్లు

ఆ పత్రాలు పనికిరావని తేల్చిన బ్యాంకులు

డబ్బులు కట్టి.. ఇళ్లూ పోయి 7 లక్షల మంది లబోదిబో

25 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలంటూ ఆర్భాటం

వైసీపీ నేతల నుంచి ఎక్కువకు కొని.. కొందరికే అందజేత


మిగతావారికి ఎన్నికల వేళ పంచాలని ఎత్తుగడ!

అయినా, అవి ఇంకా నిషేధిత జాబితాలోనే..

కలెక్టర్లు డీనోటిఫై చేయక పైసాకూ కొరగాని పత్రాలు

వాటికి అప్పులు ఇవ్వలేమంటున్న బ్యాంకులు

పేదలకు బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకొనే, అసలు తనే ఒక నిరుపేదనని చెప్పుకొనే జగన్.. రాష్ట్రంలోని అసలుసిసలు పేదలను నిండా ముంచేశారు 'వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పదివేలు కట్టండి... పట్టా ఇస్తాం. దానిపై పూర్తి హక్కులు మీవే. బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకోవచ్చు' అంటూ గత ప్రభుత్వాలు ఇచ్చిన ఇళ్ల లబ్ధిదారుల నుంచి సొమ్ములు పిండుకున్నారు. జగన్ చెప్పారు కదా అని జనం అమాయకంగా రూ.350 కోట్లు చెల్లించారు. చివరికి చూస్తే... ఆ పట్టాలు ఏమాత్రం పనికిరానివని తేలిపోయింది. ఇప్పుడు వాళ్లంతా మండే ఎండల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 'ఓటీఎస్' కింద పేదల వద్ద నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినా ఇప్పటికీ ఆ ఇళ్ల స్థలాలను నిషేధిత భూముల జాబితాలోనే ఉంచడం జగన్ మోసానికి పరాకాష్ఠ.



పేదలకు ఇళ్లస్థలాల కోసం సేకరించిన భూములన్నీ వైసీపీ నాయకులవే. తక్కువ విలువ గల ఈ భూములను ప్రభుత్వానికి వారు ఎక్కువ ధరకు అంటగట్టారు. రాజీవ్ స్వగృహ ద్వారా బ్యాంకు నుంచి అప్పులు తెచ్చి మరీ వైసీపీ నేతలకు జగన్ ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. కానీ, ఇళ్ల స్థలాల పత్రాలపై జగన్ ఫొటోలు, డిజైన్లు ఉండటంతో 25 లక్షల మంది పేదలకు వాటివల్ల పైసా ఉపయోగం లేని పరిస్థితి!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సొంత ఇళ్లు లేని పేదలకు ఇళ్లు కట్టిస్తానని 2019 ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. 99 శాతం మేనిఫెస్టో హామీలు నెరవేర్చానని బస్సుయాత్రలో చెప్పుకొంటూ తిరుగుతున్న ఆయన, అప్పటి మాట ప్రకారం ఇళ్లు కట్టించిన పాపాన పోలేదు. కానీ, 25 లక్షల మందికి ఇళ్ల స్థలాలంటూ పత్రాలు రెడీ చేయించారు. కొంతమందికి ఇచ్చారు. మరికొంత మందికి ఈ పత్రాలు ఇవ్వలేదు. కానీ, పత్రాలు అందినా, అందకపోయినా ఆ భూమిపై లబ్ధిదారులకు దక్కే పరిస్థితి లేదు. ఎందుకంటే..ఆ భూములన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. పైగా నిషేధిత జాబితాలోని ఆ భూములపై ప్రభుత్వమే వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద డబ్బులు కట్టిన పేదల కోసం ఏడు లక్షల పత్రాలు సృష్టించి

మిగతా 12వ పేజీలో...



పేదలకు ఇచ్చిన పట్టాలపై ఇలా జగన్ బొమ్మలు ఉండడంతో అవి చెల్లనివిగా మారాయి!

మరో వివాదంలో గిరీశ

డీకేటీ భూములపై రైతుల హక్కులకు చెక్

రెండు గ్రామాల భూమి రికార్డులన్నీ బ్లాక్

అన్నమయ్య జిల్లా కలెక్టరుగా వింత చర్య

ఇప్పటికే ఈసీ వేటు.. తాజాగా రైతుల కన్నెర్ర

కేంద్రానికి మదనపల్లె రైతు సంఘం ఫిర్యాదు

12

వలంటీర్లకు రూ.10 వేల పారితోషికం

వారికి మెరుగైన భవిష్యత్ కల్పిస్తాం

జగన్ వైపో.. రాష్ట్రం వైపో తేల్చుకోవాలి

అనవసరంగా రాజకీయాల్లో తిరిగితే కేసులే

ఇక ఏ ఉద్యోగాలూ రావని తెలుసుకోవాలి: బాబు



ఉగాది సందర్భంగా చంద్రబాబుకు వేదాశీర్వచనం

ఐదేళ్లుగా మద్యం, గనులు, ఇసుక, భూములు, సెటిల్మెంట్ల ద్వారా పిచ్చి పట్టినట్లు సంపాదించారు. గనుల నుంచి రాయల్టీ వసూలు కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం మొదటిసారి చూస్తున్నా.

తాను గెలిస్తే వలంటీర్ వ్యవస్థ పునరుద్ధరణ ఫైలుపైనే తొలి సంతకం పెడతానని జగన్ చెబుతున్నారు. అంటే ఇప్పుడు వలంటీర్లు లేనట్లే కదా! వారిపై ఒత్తిడి తెచ్చి రాజీనామాలు చేయిస్తున్నారు.

వలంటీర్లు తమ ఉద్యోగాలు వదిలి అనవసరంగా రాజకీయాల్లో తిరిగితే కేసుల్లో ఇరుక్కుంటారు. అదే జరిగితే వారికి భవిష్యత్‌లో ఏ ఉద్యోగాలూ రావని గుర్తుంచుకోవాలి.

- చంద్రబాబు

జగన్ ధనదాహం!

పిచ్చెక్కినట్లుగా ఆయన సంపాదన

1500 బస్సులు పెట్టి ప్రచార సభలా?

ఒక్కో సభకు రూ.15 కోట్ల ఖర్చు

ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది?

ప్రతి రోజూ వైసీపీ ఫేక్ ప్రచారాలు

విశృంఖలంగా ఫోన్ ట్యాపింగ్

పింఛన్లను జగన్ జేబులో నుంచి ఇవ్వడం లేదు

మేమున్నప్పుడు పది రెట్లు పెంచాం

ఈసారి వచ్చాక 4 వేలు ఇస్తాం

దివ్యాంగులకు రూ.6 వేలు: బాబు

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటికి చూసింది టీజర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. సిట్ కార్యాలయ ఆవరణలో కొన్ని పత్రాలను అధికారులు తగలబెట్టించడంపై స్పందిస్తూ.. ఓడిపోతామన్న భయంతోనే పేపర్లు తగలబెడుతున్నారని ధ్వజమెత్తారు. తమ కూటమి అధికారంలోకి వచ్చాక వలంటీర్లకు ఇప్పుడు ఇస్తున్న

మిగతా 11వ పేజీలో...

ముస్లింలకు న్యాయం చేసేది నేనే!

జగన్ ప్రచారాలను తిప్పికొట్టాలి: బాబు

వైసీపీ అంతం.. మాలల పంతం!

మాలమహానాడు నేతలు

పిఠాపురం నుంచే

విజయ ప్రస్థానం

క్రోధి నామ సంవత్సరంలో కూటమి ప్రభుత్వ స్థాపన: పవన్

బాబుకు అధికార యోగం

కూటమికి 128 అసెంబ్లీ సీట్లు, 24 ఎంపీ సీట్లు: పంచాంగకర్త

అసలేం జరుగుతోంది?

వైసీపీ వక్ర మార్గాలు, వంకర వ్యూహాలపై అటు ఎన్నికల కమిషన్, ఇటు కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించాయి. ఆయా అంశాల్లో ఏం జరుగుతోందని ఆరా తీశాయి. 22 మంది ఐపీఎస్‌లపై నిర్దిష్ట ఆరోపణలు చేస్తూ.. వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాసిన లేఖపై స్పందన తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఇక.. ఎన్నికల వేళ డిపోల నుంచి 'మద్యం' మార్గం మారుతోందనే అనుమానాలూ తలెత్తుతున్నాయి. దీంతో.. డిపోల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఈసీ ఆదేశించింది. అలాగే.. ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుపై తాము అడిగిన వివరాలు ఎందుకు ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.



ఆ ఐపీఎస్‌ల కథేంటి?



పురందేశ్వరి లేఖపై మీ జవాబేంటి?

ప్రభుత్వాన్ని వివరణ కోరిన ఈసీ

జవహర్‌రెడ్డిపైనా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి ఫిర్యాదు!

ఆయన సీఎం జిల్లావాసి.. ఒకే సామాజిక వర్గం

సీనియర్లను పక్కనపెట్టి పోస్టింగ్

ఈసీ రంగంలోకి దిగేదాకా.. దొంగ ఓట్లపై చర్యలు తీసుకోలేదు

వైసీపీకి మద్దతుదారుగా ఉన్నారు

లేఖలో పురందేశ్వరి అభియోగం



అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు అడ్డుగా ఉన్నారంటూ 22 మంది ఐపీఎస్ అధికారులపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని

మిగతా 2వ పేజీలో...

వైసీపీ 'మద్యం' దారి!

డిపోల నుంచి నేరుగా నేతలకు

మద్యం షాపులూ ప్రభుత్వం చేతిలోనే

ఇప్పటికే అధికార పార్టీ మద్యం నిల్వలు

ఎక్సైజ్ అధికారుల తీరుపై ఆరోపణలు

మొత్తం కెమేరాలు పెట్టాలన్న ఈసీ

డిస్టిలరీలు, డిపోల్లో ఏర్పాటు చేయాలని సీఈవో ఆదేశం

ఇంతలోనే.. అధికార పార్టీ అడ్డదారి వ్యూహం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం అధికార పార్టీ వైసీపీ 'మద్య దారి' పట్టింది. వైసీపీ నేతలకు కావాల్సినంత మద్యం అందుబాటులో ఉండేలా, ఇతరులకు ఎవరికీ దొరక్కుండా చేసేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఎలాగూ మద్యం షాపులు కూడా ప్రభుత్వం చేతిలోనే ఉండడంతో ఈ దొంగ దారి వ్యూహం పక్కాగా అమలవుతోంది. తద్వారా నోటిఫికేషన్ వచ్చాక ఓటర్లకు మద్యాన్ని

మిగతా 12వ పేజీలో...

ఏబీవీపై రాష్ట్రం దోబూచులాట

కేంద్రం అడిగిన వివరాలు ఇవ్వకుండా దాటవేత

డిస్మిస్ కుదరదని ఇప్పటికే యూపీఎస్సీ, కేంద్రం స్పష్టీకరణ

ఆలిండియా సర్వీసు నిబంధనల కిందే చర్యలు తీసుకోవాలని సిఫారసు

ఆయనపై తీసుకున్న చర్యల వివరాలు తెలియజేయాలన్న కేంద్ర హోం శాఖ

2 సార్లు సీఎస్‌కు లేఖలు రాసినా జవాబు లేదు

ఆ వివరాలు పంపితే ఏబీవీపై కేసే ఉండదు

ఆయన సస్పెన్షన్ కూడా రద్దు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

డీజీ ర్యాంకు సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ)పై సీఎం జగన్ కక్షసాధింపు కొనసాగిస్తున్నారు. ఆయన్ను డిస్మిస్ చేయడం కుదరదని కేంద్రం, యూపీఎస్సీ తేల్చిచెప్పినా లెక్కచేయడం లేదు. వాటి సిఫారసులను సైతం పెడచెవిన పెడుతున్నారు. కేంద్ర హోం శాఖ అడిగిన వివరాలు ఇవ్వకపోగా.. అది చేసిన సిఫారసులను కూడా అమలు చేయకపోవడం జాతీయ స్థాయిలో

మిగతా 12వ పేజీలో...

ఇంటాబయటా బకాయిల మోత మోగిపోతోంది. పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం కోర్టుకు ఎక్కిన నాలుగు లక్షల మంది బాధితులే కాదు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా జగన్ సర్కారు బకాయిల బారిన చిక్కుకున్నాయి. బకాయిలపై ఈ సంస్థలకు సమాధానం చెప్పుకోలేని రాష్ట్ర అధికారులు ఏకంగా సమావేశాల్నే ఎగ్గొడుతున్నారు. కేంద్ర సంస్థల ఎదుట రాష్ట్రం పరువు తీస్తున్నారు.

పరువు పాయె!

కోల్ ఇండియాకు 2,851 కోట్ల బకాయిలు

కట్టకపోగా మీటింగ్ ఎగ్గొట్టిన అధికారులు.. బొగ్గు ఆపేస్తామన్న కేంద్ర సంస్థ

డుమ్మా అధికారులపై చర్యలు తీసుకోండి..సీఎస్ జవహర్‌రెడ్డికి ఘాటు లేఖ

మా బకాయిలూ కట్టండి.. సీఎస్‌కు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ లేఖ

Coal India

भारतीय विमानपत्तन प्राधिकरण
AIRPORTS AUTHORITY OF INDIA

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కోల్ ఇండియాకు రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థలు రూ.2,851 కోట్లు బాకీ పడ్డాయి. నెలల తరబడి బొగ్గు వాడుకుంటున్నారుగానీ డబ్బులు కట్టడం లేదు. రూ.వేలకోట్ల బకాయి పేరుకుపోవడంతో తక్షణమే కట్టాలంటూ కేంద్ర ప్రభుత్వ కోల్ సెక్రటరీ అమృత్‌లాల్ మీనా... సీఎస్ జవహర్ రెడ్డికి ఇటీవల లేఖ రాశారు. అలాగే, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా తమకు రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలంటూ ఇటీవల సీఎస్‌కు లేఖ రాసింది. మరి ఈ లేఖలపై సీఎస్ ఏమైనా చర్యలు తీసుకున్నారా? కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అస్మదీయులకు దాదాపు రూ.16,000 వేలకోట్ల బిల్లులు చెల్లించారు కానీ, కోల్ ఇండియాకు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి రూపాయైనా

మిగతా 12వ పేజీలో...

సీఎం అయితే.. అరెస్టు చేయొద్దా?



సీఎం అయినంత మాత్రాన కేజ్రీవాల్‌కు ప్రత్యేక హక్కులుండవు

ఎన్నికల బాండ్లు ఎవరు కొంటే మాకేంటి?

ఎవరికి టికెట్ వస్తే మాకు సంబంధమేంటి?

మేము న్యాయ సూత్రాలను పరిశీలిస్తాం

ఈ కేసు మీకు, కేంద్రానికి మధ్య కాదు

ఈడీకి, మీకు మధ్య జరుగుతున్న కేసు

అప్రూవర్‌ను అనుమానిస్తే కోర్టు, జడ్జిపై అనుమానం వ్యక్తంచేసినట్లే

ఈడీ అన్ని ఆధారాలను సమర్పించింది

కేజ్రీ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో తన అరెస్టును సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీనిపై మంగళవారం సుదీర్ఘంగా వాదోపవాదాలు జరిగాయి. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తీరును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీవ్రంగా తప్పుబడుతూ.. ఘాటైన వ్యాఖ్యలు

మిగతా 2వ పేజీలో...

అస్మదీయులకు అడ్డగోలుగా!

జగన్ ముఖ్యమంత్రి కాగానే

బాబు హయాంలో జరిగిన ఒప్పందాలు రద్దు

కేంద్రం అభ్యంతరం చెప్పినా వినని వైనం

ఆ తర్వాత అడ్డగోలుగా 'సొంత' ఒప్పందాలు

అధిక ధరతో 25 ఏళ్లపాటు కొనుగోలుకు

అదానీతో 7 వేల మెగావాట్ల సోలార్ ఒప్పందం

ఇప్పటికీ ఒక యూనిట్ కూడా రాలేదు

సన్నిహితులకు ఎడాపెడా పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు

ఎన్నికల ముందు హడావుడిగా నిర్ణయాలు

మొత్తం 1,62,240 ఎకరాల సమర్పణ

ఇప్పటికే 50 వేల ఎకరాలు ధారాదత్తం

జేఎస్‌డబ్ల్యూ న్యూఎనర్జీకి 20,100 ఎకరాలు

ఇండోసోల్‌కు మొత్తం 21,000 ఎకరాలు

వైసీపీ సర్కారు భారీ భూపందేరం

విద్యుదుత్పత్తి ప్లాంట్ల పేరిట సంతర్పణ

పేదలు ఇల్లు కట్టుకోవడానికి సెంటు భూమి ఇవ్వడమే ఘనకార్యం అన్నట్లుగా సీఎం జగన్ గొప్పలు చెప్పుకొంటున్నారు. సన్నిహితులు, అస్మదీయులు, సొంత జిల్లాకు చెందినవారికి మాత్రం పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ ప్లాంట్ల స్థాపన పేరిట వేల ఎకరాలు భూములు కట్టబెట్టారు.

చంద్రబాబు హయాంలో జరిగిన పాత విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసి మరీ జగన్ సర్కారు కొత్త ఒప్పందాలు చేసుకుంది. దీని వెనుక లోగుట్టు ఏమిటంటే... అస్మదీయ కంపెనీలకు అడ్డగోలుగా దోచిపెట్టడమే! రైతుకు ఉచిత విద్యుత్ సరఫరా పేరిట భారీ భూపందేరం చేయడం.

పంప్డ్ స్టోరేజీ జల విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ప్రైవేటు సంస్థలకు మొత్తం 1,62,240 ఎకరాలు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకుంది. ఇప్పటికే దాదాపు 50 వేల ఎకరాలు ధారాదత్తం చేసింది. మిగిలిన భూములను లీజు విధానంలో ఇచ్చేందుకు సర్కారు సిద్ధమవుతోంది.

3



గతంలో సోలార్, పంప్డ్ స్టోరేజీ జల విద్యుదుత్పత్తి సంస్థల ఏర్పాటుకు మెగావాట్‌కు మూడెకరాలు చొప్పున పారిశ్రామిక విధానంలో కేటాయించేవారు. జగన్ ప్రభుత్వం దీనిని రెండింతలు అంటే.. ఆరెకరాలకు పెంచింది. పైగా భూములను ఏకమొత్తంలో రాయితీ ధరకు కట్టబెట్టే విధానం అమలు చేస్తోంది.

ఇజ్రాయెల్ బందీల్లో 40 మంది మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ కోసం ప్రయత్నాలు చేస్తున్న అమెరికా గూఢచారి సంస్థ సీఐఏకు చేదు వార్త అందింది. తాము బందీలుగా తీసుకున్న వారిలో కనీసం 40 మంది ఇజ్రాయెల్ వాసులు మరణించారని తొలిసారిగా హమాస్ సమాచారం అందించింది. గత ఏడాది అక్టోబరు 7వ తేదీన హమాస్ 253 మంది ఇజ్రాయెల్ వాసులను అపహరించి బందీలుగా ఉంచుకొంది. ప్రస్తుతం 133 మంది బందీలుగా ఉండగా వారిలో మానవత దృక్పథకం కింద తొలివిడతగా 40 మందిని విడిపించాలని సీఐఏ ప్రతిపాదించింది. ప్రతిగా ఇజ్రాయెల్ జైలులో ఉన్న 700 మంది పాలస్తీనా ఖైదీలను విడిపించాలని, ఆరు వారాల పాటు కాల్పుల విరమణ కొనసాగేంచేలా చూసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. సీఐఏ డైరెక్టర్ బిల్ బర్న్స్ ఆదివారం కైరోలో ఇజ్రాయెల్ నిఘా విభాగం మొస్సాద్ అధిపతి, ఈజిప్టు గూఢచారి సంస్థ చీఫ్, కతర్ ప్రధానిలతో భేటీ అయి కాల్పుల విరమణపై చర్చలు జరిపారు. అదే సమయంలో హమాస్ సంస్థ సీనియర్ ప్రతినిధులు ఈజిప్టు, ఖతార్‌లకు చెందిన మధ్యవర్తులతో సంప్రదింపులు జరిపారు.

పన్ను పరిధిలోకొచ్చే ఆదాయం రూ.680!

» కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అఫిడవిట్‌పై దుమారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో 2021-22 సంవత్సరానికి గాను పన్ను పరిధిలోకి వచ్చే తన ఆదాయం రూ.680 మాత్రమేనని ప్రకటించడంపై దుమారం రేగింది. తిరువనంతపురం బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన కేంద్ర మంత్రి తన ఆర్థిక స్థితిగతులపై ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేసింది. దీంతో మంత్రి సమర్పించిన అఫిడవిట్‌లోని వివరాలను సమీక్షించాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ)ను ఈసీ మంగళవారం ఆదేశించింది. ఎన్నికల అఫిడవిట్లలో అభ్యర్థులు తప్పుడు సమాచారాన్ని ఇవ్వడం ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125ఏ ప్రకారం నేరం. దీనికి ఆరు నెలల వరకూ జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చని ఈ చట్టం నిర్దేశిస్తోంది.

అభ్యర్థులు ప్రతి చరాస్తి వివరం చెప్పనక్కర్లేదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రైవసీ హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వ్యక్తిగతంగా కలిగి ఉన్న చిన్నాచితకా ఆస్తుల వివరాలన్నింటినీ వెల్లడించాల్సిన పనిలేదని తెలిపింది. అభ్యర్థి ఆర్థిక స్థితిగతులు ఏమిటో ప్రజలకు తెలిసేలా ముఖ్యమైన ఆస్తుల వివరాలను వెల్లడిస్తే సరిపోతుందని తీర్పు చెప్పింది. 2019లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని 44-తేజు నియోజకవర్గం నుంచి కరిఖో ఇండిపెండెంటుగా గెలిచారు. అయితే, ఆయన తన మూడు వాహనాల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచలేదని ప్రత్యర్థులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఆ మూడు వాహనాలను గతంలోనే అమ్మేశానని ఆయన కోర్టుకు తెలిపారు. కానీ, మొత్తం చరాస్తుల వివరాలను వెల్లడించలేదని గతేడాది జులైలో ఆయన ఎన్నిక చెల్లదంటూ తీర్పు ఇచ్చింది. దీనిపై కరిఖో సుప్రీంకోర్టుకు వెళ్లారు.

సుప్రీంకోర్టుకు 'పతంజలి' బేషరతు క్షమాపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దన్న ఆదేశాలను అమలు చేయనందుకు 'పతంజలి' సంస్థ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఈ మేరకు పతంజలి సంస్థ వ్యవస్థాపకులు యోగా గురు బాబా రామ్‌దేవ్, మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణలు శనివారం తగిన పద్ధతిలో సుప్రీంకోర్టుకు అఫిడవిట్‌లు సమర్పించారు. వీటిని బుధవారం ధర్మాసనం పరిశీలించనుంది. ఈ సందర్భంగా జరిగే విచారణకు వారిద్దరూ హాజరు కానున్నారు.

ఈద్ రేపు.. కేరళ, లద్దాఖ్‌లలో నేడే పండుగ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: షవ్వల్ నెలవెంక దర్శనం కాకపోవడంతో దేశవ్యాప్తంగా ఈదుల్ ఫితర్ వేడుకలు గురువారం జరగనున్నాయి. ఈ మేరకు ఢిల్లీ ఫతేపూర్ మసీద్ ఇమామ్ ముఫ్తీ ముకర్రమ్ అహ్మద్ మంగళవారం వెల్లడించారు. దేశంలో ఎక్కడైనా నెలవంక కనిపించిందా అని తాము వివిధ రాష్ట్రాలను సంప్రదించామని అయితే ఎక్కడా చంద్రుడి జాడ కనిపించకపోవడంతో గురువారం ఈదుల్ ఫితర్ జరిపేందుకు నిశ్చయించామని తెలిపారు. బుధవారం యథావిధిగా 30వ రోజు ఉపవాస దీక్షలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. అయితే కేరళ, లద్దాఖ్‌లలోని ముస్లిం పెద్దలు మంగళవారం నెలవంక కనిపించిందని చెప్పడంతో ఆయా ప్రాంతాల్లో బుధవారమే ఈదుల్ ఫితర్ వేడుకలు జరగనున్నాయి.

మన ఆయువు 8 ఏళ్లు పెరిగింది

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గడచిన మూడు దశాబ్దాల్లో భారతీయుల జీవితకాలం 8 ఏళ్లు పెరిగిందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. 1990తో పోల్చితే 2021 నాటికి ప్రపంచ వ్యాప్తంగా మనుషుల ఆయుర్దాయం సగటున 6.2 ఏళ్లు పెరిగినట్లు పరిశోధనలో బయటపడింది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ చేసిన ఈ పరిశోధన వివరాలను లాన్సెట్ జర్నల్ వెల్లడించింది. డయేరియా, శ్వాసకోశ వ్యాధులు, గుండె పోటుల కారణంగా సంభవించే మరణాలు తగ్గడంతో పాటు కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్త చర్యలు జీవిత కాలం పెరగడానికి కారణమని అధ్యయనంలో తేలింది. కరోనా వల్ల 2019-2021 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా 1.6 ఏళ్ల జీవితకాలం తగ్గినట్లు అధ్యయనం వెల్లడించింది.

ఈ నైరుతిలో సాధారణ వర్షపాతం: స్కైమెట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఈ ఏడాది నైరుతి సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని, సీజన్ ద్వితీయార్థంలో అధిక వర్షపాతం నమోదవుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు దీర్ఘకాలిక సగటు(ఎల్‌పీఏ) 868.6 మిల్లీమీటర్లలో 102% (5 శాతం అటూఇటుగా) వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. దక్షిణ, పశ్చిమ, వాయవ్య ప్రాంతాల్లో మంచి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అయితే తూర్పు రాష్ట్రాలైన బిహార్, జార్ఖండ్, ఒడిసా, పశ్చిమ బెంగాల్‌లో జూలై, ఆగస్టు నెలల్లో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ సీజన్ తొలి అర్థభాగంలో ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్కైమెట్ ఎండీ జతిన్ సింగ్ వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, యూరేసియాలో మంచు కురవడం తగ్గడంతో ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సానుకూలంగా ఉండొచ్చని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) శాస్త్రవేత్తలు కూడా అంచనావేశారు. ఎల్‌నినో సంవత్సరమైన 2023 నైరుతి సీజన్‌లో భారత్‌లో సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లకు గానూ 820 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. అంతకుముందు కూడా వరుసగా నాలుగేళ్లపాటు దేశంలో నైరుతి సీజన్‌లో సాధారణం, సాధారణం కంటే లోటు వర్షపాతమే నమోదైంది.

నేడు మన్యం, ఉత్తరాంధ్రలో తీవ్ర వడగాడ్పులు

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఎండ తీవ్రత తగ్గింది. కొన్ని చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రత 43.5 డిగ్రీలు నమోదైనప్పటికీ, చాలా మండలాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా ఉష్ణోగ్రత నమోదైంది. ద్రోణి కారణంగా వడగాడ్పులు కూడా తగ్గాయి. బుధవారం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని 11 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు 134 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని పేర్కొంది. ఇక నుంచి ఎండ తీవ్రత క్రమేపీ పెరుగుతుందని, పగటి ఉష్ణోగ్రతలు మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఔరా.. బాలికా!

చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు అర్షియా గోస్వామి. వయస్సు 9ఏళ్లు. ఆమె 75 కేజీల బరువును ఎత్తి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 2021లో ఆరేళ్ల వయసులోనే 45 కేజీలు ఎత్తిన అర్షియా... 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. తాజాగా 75 కేజీల బరువును ఎత్తిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకొంది.



సీఎం అయితే.. అరెస్టు చేయొద్దా?

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. "కేజ్రీవాల్ ముఖ్యమంత్రి అయితే.. అరెస్టు చేయొద్దా? ముఖ్యమంత్రికి ప్రత్యేక హక్కులేమీ ఉండవు. లోక్‌సభ ఎన్నికల సమయాన్ని బట్టి.. ఆయన అరెస్టు గురించి కోర్టు పట్టించుకోదు. చట్టం, న్యాయం ప్రకారమే ఆయన రిమాండ్‌ను పరిశీలిస్తాం. న్యాయమూర్తులుగా మేము చట్టానికి కట్టుబడి ఉంటాం. మా తీర్పులు న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఉంటాయి. అంతేతప్ప.. రాజకీయాలతో మాకు పనిలేదు. మా తీర్పులు రాజకీయ అవసరాలకు తగ్గట్లుగా ఉండవు" అని ఆమె వ్యాఖ్యానించారు. కింది కోర్టు కేజ్రీవాల్‌ను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపడం.. ఆ తర్వాత ఈడీ కస్టడీకి ఇవ్వడం.. తిరిగి జైలుకు తరలించడం.. అందుకు సంబంధించిన ఆదేశాలు సరైనవేనని ఆమె స్పష్టం చేశారు. "లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ కుట్రదారుడని ఈడీకి లభించిన సాక్ష్యాధారాలను బట్టి వెల్లడైంది. ఈ కుంభకోణంలో లభించిన మొత్తం(డబ్బు)ను ఉపయోగించడం, దాచడం ద్వారా.. కేజ్రీవాల్ తన నేరాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీని కేజ్రీవాల్ రూపొందించారు. ముడుపులు డిమాండ్ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు" అని ఆమె గుర్తుచేశారు. దర్యాప్తు నుంచి తప్పించుకోవడానికి కేజ్రీవాల్ చేస్తున్న ప్రయత్నాల వల్ల.. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నవారి కేసుల విచారణపైనా ప్రభావం పడుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడొస్తాయో కేజ్రీవాల్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. ఈ కేసులో అప్రూవర్లు బీజేపీకి ఎన్నికల బాండ్లు సమర్పించడం, ఒకరికి టికెట్ దక్కడాన్ని కేజ్రీవాల్ తన పిటిషన్‌లో ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కేంద్రంలోని అధికార పార్టీ ఢిల్లీలో లబ్ధి పొందేందుకే తనను అరెస్టు చేయించిందని పేర్కొన్నారు. దీనిపైనా జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీవ్రంగా స్పందించారు. "రాఘవ్ మాగుంట, శరత్ చంద్రారెడ్డి అప్రూవర్లుగా మారి.. మనీలాండరింగ్ చట్టం, సీఆర్పీసీలోని సెక్షన్ 164 కింద ప్రకటనలు చేశారు. అప్రూవర్లకు సంబంధించిన చట్టం వందేళ్లనాటిది. కేవలం కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు చేసిన చట్టం కాదు. అప్రూవర్ల ప్రకటనలను అనుమానించడం అంటే.. న్యాయస్థానం, న్యాయమూర్తిపై అనుమానాలు వ్యక్తం చేసినట్లే. ఎన్నికల బాండ్లు ఎవరు కొన్నారు? ఎవరికి టికెట్ లభించింది? అన్నదానితో మాకు ప్రమేయం లేదు. చట్టం, న్యాయసూత్రాల మేరకే మేం పని చేస్తాం. రాజకీయాలతో మాకు సంబంధం లేదు. దర్యాప్తు ఎలా జరగాలనేదాన్ని నిర్ణయించాల్సింది నిందితుడు కాదు. ఆయన(కేజ్రీవాల్) సౌకర్యాలకు అనుగుణంగా దర్యాప్తు జరగదు. అప్రూవర్లపై అపనమ్మకం ఉంటే.. క్రాస్ ఎగ్జామినేషన్ చేసుకోవచ్చు. ఈ కేసు కేజ్రీవాల్‌కు-కేంద్రానికి మధ్య కాదు. కేజ్రీవాల్‌కు-ఈడీకి మధ్య సాగుతోంది" అని ఆమె స్పష్టం చేశారు.



'జైలుకు సమాధానం ఓటుతో ఇవ్వండి' అంటూ ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆప్ నేతలు

సుప్రీం కోర్టుకు వెళ్తాం

హైకోర్టులో తమకు న్యాయం జరగలేదని, కేజ్రీవాల్ విడుదల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సంజయ్ సింగ్ వెల్లడించారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌కు కూడా సుప్రీంకోర్టులో బెయిల్ లభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఎక్సైజ్ పాలసీపైన కేంద్రం 'అతిపెద్ద రాజకీయ కుట్ర'కు పాల్పడిందని ఆయన విమర్శించారు.

అంతకు ముందు ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు, కేజ్రీవాల్ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. ఎస్.వి. రాజు తన వాదనలను వినిపిస్తూ.. "సామాన్యుడు నేరం చేస్తే జైలుకు వెళ్లక తప్పదు. సీఎం అయినంత మాత్రాన కేజ్రీవాల్‌ను అరెస్టు చేయకూడదా? మీరు(కేజ్రీవాల్) దేశాన్ని లూటీ చేస్తారు. అయితే.. ఎన్నికలు జరుగుతున్నప్పుడు వియ్యమ్మల్ని ముట్టుకోవద్దా? ఒక ఉగ్రవాది రాజకీయ నాయకుడైతే.. అతను సైనిక వాహనాన్ని పేల్చివేసినా.. ఎన్నికలున్నాయన్న కారణంతో అతణ్ని అరెస్టు చేయకూడదా?" అని ప్రశ్నించారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్షులు/అప్రూవర్లు చేసిన ప్రకటనలు దర్యాప్తులో తేలుతాయని, మద్యం విధానాన్ని రూపొందించడంలో బయటి వ్యక్తుల పాత్ర ఉన్నదనేది స్పష్టంగా తేలిందని వ్యాఖ్యానించారు. ఆప్ కార్యకలాపాలకు ఆ పార్టీ కన్వీనర్‌గా కేజ్రీవాల్ బాధ్యుడని, మనీలాండరింగ్ ద్వారా లబ్ధిపొందినందుకే ఆయనను ఈడీ అరెస్టు చేసిందని చెప్పారు. "ఈ స్కామ్‌లో డబ్బును చూపించనప్పుడు ఎలా అరెస్టు చేస్తారనే వాదనలో పసలేదు. డబ్బు ఎవరి నుంచి.. ఎక్కడి నుంచి.. ఎలా వచ్చిందో కనిపెట్టాం. డబ్బు ఖర్చయిపోయింది. అందుకే స్వాధీనం చేసుకోలేకపోయాం" అని ఆయన కోర్టుకు వివరించారు. కేజ్రీవాల్‌ను ఈడీ న్యాయవాది 'ఉగ్రవాది'తో పోల్చడాన్ని అభిషేక్ మనూ సింఘ్వీ తీవ్రంగా ఖండించారు. "సైనిక వాహనాన్ని పేల్చిన ఉగ్రవాదితో ముఖ్యమంత్రిని ఎలా పోలుస్తారు? డబ్బే లేనప్పుడు నేరం ఎక్కడ జరిగింది?" అని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ముడుపులు ఇచ్చారనే ఆరోపణలే ఉంటే.. అవినీతి నిరోధక చట్టం కిందో.. ఆదాయపన్ను చట్టం కిందో దర్యాప్తు చేయాలని.. మనీలాండరింగ్‌ను ఈ కేసులో దూర్చారని విమర్శించారు. ఇరువర్గాల వాదనలను నమోదు చేసుకున్న జస్టిస్ స్వర్ణకాంత శర్మ.. జ్యుడీషియల్ రిమాండ్ సబబేనని కేజ్రీవాల్ పిటిషన్‌ను కొట్టివేశారు.

కేజ్రీవాల్‌తో సునీత, వైభవ్ ములాఖత్

తిహాడ్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌తో.. ఆయన భార్య సునీత కేజ్రీవాల్, వ్యక్తిగత కార్యదర్శి వైభవ్‌కుమార్ మంగళవారం ములాఖత్ అయ్యారు. జైలు నిబంధనల ప్రకారం.. అండర్ ట్రయల్ ఖైదీలకు వారంలో నేరుగా గానీ, టెలికాన్ఫరెన్స్ ద్వారాగానీ రెండుసార్లు ములాఖత్‌కు అవకాశం ఉంటుంది. కేజ్రీవాల్ అరెస్టయ్యాక.. ఆయన తన భార్యతో నేరుగా మాట్లాడడం ఇదే మొదటిసారి. ములాఖత్ జంగ్లా(ఇనుప జాలీలు అడ్డుగా ఉంటాయి) పద్ధతిలో కేజ్రీవాల్‌తో వీరిద్దరూ అరగంట పాటు మాట్లాడారని తిహాడ్ జైలు అధికారులు తెలిపారు.

మనీలాండరింగ్ కేసులో సోరెన్ అనుచరుని అరెస్టు

రాంచీ, ఏప్రిల్ 9: భూమి ఆక్రమణకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరేన్ అనుచరుడు ఒకర్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. సోరేన్‌కు సన్నిహితుడైన మహమ్మద్ సద్దాం హుస్సేన్ (48)ను అరెస్టు చేసినట్టు మంగళవారం ఈడీ అధికారులు తెలిపారు. ఇంకో మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే సద్దాం హుస్సేన్ జైలులో ఉన్నాడు. ఈ కేసులో ఇది మూడో అరెస్టు కావడం గమనార్హం. మాజీ ముఖ్యమంత్రి సోరేన్‌తో పాటు రెవెన్యూ శాఖ సబ్‌ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్ ఇప్పటికే జైలులో ఉన్నారు. ఫోర్జరీ పత్రాలు సృష్టించి 8.86 ఎకరాలను ఆక్రమించినట్టు ఈడీ కేసు నమోదు చేసింది. కోర్టు అనుమతి తీసుకొని కస్టడీలో ఉన్న సద్దాం హుస్సేన్‌ను మళ్లీ అదుపులోకి తీసుకొంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	40.0	27.0
గుంటూరు	39.0	25.0
ఏలూరు	39.0	24.0
తిరుపతి	38.6	24.4
విజయవాడ	37.8	26.8
ఒంగోలు	36.3	27.5

హెపటైటిస్ వైరస్‌తో రోజూ 3500 మంది మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హెపటైటిస్ వైరస్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ 3500 మంది చనిపోతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. దీని బారిన పడి 2019లో 11లక్షల మంది మృతి చెందగా 2022నాటికి ఆసంఖ్య 13 లక్షలకు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వారం పోర్చుగల్‌లో వరల్డ్ హెపటైటిస్ సమ్మిట్‌ను నిర్వహిస్తోన్న నేపథ్యంలో మొత్తం 187 దేశాలకు చెందిన హెపటైటిస్ గణాంకాలను డబ్ల్యూహెచ్‌వో మంగళవారం విడుదల చేసింది. రోజువారీ హెపటైటిస్ వైరస్ మరణాల్లో హెపటైటిస్ బీతో 83 శాతం మంది, హెపటైటిస్ సీతో 17శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం మరణాలకు కారణమయ్యే రెండో అతిపెద్ద అంటువ్యాధి ఇదేనని పేర్కొంది. తక్షణమే దీనిపై దృష్టిసారించాలని ప్రపంచ దేశాలను కోరింది. 2022 చివరి నాటికి దీర్ఘకాలిక హెపటైటిస్ బీ తో బాధపడే రోగుల్లో 3% మందే యాంటీవైరల్ చికిత్సను తీసుకుంటున్నారని, 20% మంది హెపటైటిస్ సీ కి చికిత్స తీసుకుంటున్నట్లు డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. హెపటైటిస్ బీ కేసుల్లో 63% ఒక్క ఆఫ్రికా దేశాల్లోనే వస్తున్నాయని వెల్లడించింది.

రాముడిని కొలిస్తే బహిష్కరిస్తారా?

'శక్తి'ని నాశనం చేస్తామంటారా?

» కాంగ్రెస్, విపక్షాలపై మోదీ ఫైర్

» యూపీ, మధ్యప్రదేశ్‌లలో ప్రచారం



ఫిలిభిత్/భోపాల్, ఏప్రిల్ 9: శ్రీరాముడిని కొలిచేవారిని కాంగ్రెస్ బహిష్కరిస్తోందని ప్రధాని మోదీ ఆక్షేపించారు. ప్రజలంతా ఆరాధించే 'శక్తి'ని కూకటివేళ్లతో పెకలిస్తానంటోందని విమర్శించారు. మనసులో ఇంత విషం ఎందుకు పెట్టుకుందో తనకు అర్థం కావడం లేదన్నారు. మంగళవారం ఆయన మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్, యూపీలోని ఫిలిభిత్ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల సభల్లో ప్రసంగించారు. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి కాంగ్రెస్ అనేక అడ్డంకులు సృష్టించిందని.. తీరా ప్రజలు సొంత సొమ్ముతో దానిని నిర్మించాక ఆలయ ప్రతిష్ఠకు ఆహ్వానిస్తే తిరస్కరించి శ్రీరాముడిని అవమానించిందని అన్నారు. పైగా రామ్‌లల్లా ప్రతిష్ఠాపనకు హాజరైన వారిని ఆరేళ్లు పార్టీ నుంచి బహిష్కరించిందని, ఇదేం పార్టీ అని ప్రశ్నించారు. బుజ్జగింపు రాజకీయాల బురదలో కాంగ్రెస్ కూరుకుపోయిందన్నారు. 'యావద్దేశం శక్తిని ఆరాధిస్తోంది. దాని ముందు అందరూ తలొంచుతారు. అలాంటి శక్తిని కూడా కాంగ్రెస్ అవమానించింది. దానిని కూకటివేళ్లతో పెకిలిస్తామని అంటున్నారు. శక్తి ఉపాసకులెవరూ ఈ అవమానానికి ఇండీ కూటమిని క్షమించరు' అని స్పష్టం చేశారు. ఇండీ కూటమిలోని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) కూడా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. విదేశాల్లో తమపై జరుగుతున్న అత్యాచారాలను భరించలేక హిందువులు, సిక్కులు అక్కడి నుంచి పారిపోయి వచ్చారని.. వారికి పౌరసత్వాన్ని భారత్ ఇవ్వకపోతే ఇంకెవరు ఇస్తారని నిలదీశారు. ఈ పార్టీలు అవినీతిపరులను రక్షించాలని చూస్తున్నాయని.. దేశాభివృద్ధికి కృషిచేస్తున్న తనను దూషిస్తున్నాయని అన్నారు. అభివృద్ధిని ఆపాలని తనను బెదిరిస్తున్నాయని చెప్పారు. 'దేశ భద్రతకు మోదీ గ్యారెంటీ ఇస్తే నన్ను తిడుతున్నారు. 370 అధికరణను రద్దు చేస్తే పాకిస్థాన్ భాషలో మాట్లాడుతున్నారు. నేను మహాకాళుడి భక్తుడిని. ఎవరికీ భయపడను. మహాకాళుడికి, ప్రజలకు మాత్రమే శిరసు వంచుతాను. దేశాభివృద్ధి కోసం, దానికి సేవ చేయడం కోసం తిట్లు కూడా భరించడం నేర్చుకున్నాను' అని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

చెన్నైలో మోదీ రోడ్‌షో

చెన్నై, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'మోదీ.. మోదీ' నినాదాలతో మంగళవారం చెన్నై నగరం మార్మోగింది. బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు తమిళిసై(దక్షిణ చెన్నై), వినోజ్ పి.సెల్వం(సెంట్రల్ చెన్నై), పాల్ కనకరాజ్(ఉత్తర చెన్నై)లకు మద్దతుగా మోదీ మంగళవారం సాయంత్రం చెన్నైలో రోడ్ షో నిర్వహించారు. కాషాయరంగు ఓపెన్‌టాప్ వాహనంపై మోదీతోపాటు తమిళిసై, వినోజ్ పి.సెల్వం, పాల్ కనకరాజ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రదర్శనగా వెళ్లారు. తర్వాత రాజ్‌భవన్‌లో మోదీ బస చేశారు. బుధవారం వేలూరులో జరగనున్న సభలో ఆయన పాల్గొననున్నారు.



మహారాష్ట్రలో కుదిరిన ఒప్పందం

» కాంగ్రెస్‌కు 17, శివసేనకు 21, ఎన్‌సీపీకి 10 సీట్లు

ముంబయి, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికలకు మహారాష్ట్రలో ప్రతిపక్ష పార్టీల కూటమి(మహా వికాస్ అఘాడీ)లో సీట్ల పంపకానికి ఒప్పందం కుదిరింది. శివసేనకు అత్యధికంగా 21 సీట్లు కేటాయించగా... కాంగ్రెస్‌కు 17, ఎన్‌సీపీ(ఎస్‌పీ)కి 10 సీట్లు కేటాయించారు. సాంగ్లి, భివాండి సీట్ల కోసం మూడు పార్టీల మధ్య పోటీ నెలకొనగా చివరకు కాంగ్రెస్ పట్టువీడింది. సాంగ్లి నుంచి శివసేన(యూబీటీ), భివాండి నుంచి ఎన్‌సీపీ(ఎస్‌పీ) పోటీ చేయనున్నాయి. ఎన్‌సీపీ(ఎస్‌పీ) చీఫ్ శరద్ పవార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీట్ల పంపకంపై కూటమిలో ఎలాంటి విభేదాలు లేవన్నారు. మొత్తం 48 సీట్ల పంపకం ఏకగ్రీవంగా జరిగిందన్నారు. శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాకరే మాట్లాడుతూ... బీజేపీని ఓడించడమే కూటమి ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే మాట్లాడుతూ... బీజేపీని ఓడించేందుకు మూడు పార్టీలు విశాల హృదయంతో ముందుకుపోవాలని నిర్ణయించినట్లు చెప్పారు.

తమిళనాడి విభిన్నం

అధికారంలో ఉన్న పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో చుక్కెదురు

» 1977 నుంచి నేటి వరకు ఇంతే

(చెన్నై-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా రాజకీయాలు ఒక విధంగా నడిస్తే.. తమిళనాడులో రాజకీయాలు దీనికి భిన్నంగా ఉంటాయి. ముఖ్యంగా ఎన్నికల వేళ ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. గత ఐదు దశాబ్దాల చరిత్రను పరిశీలిస్తే ఇక్కడ ఏ ఎన్నిక జరిగినా ఏకపక్షంగా ఉండేది. అయితే గత కొన్నేళ్లుగా మాత్రం తమిళనాడులో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ఇందుకు కాస్త భిన్నంగా ఉంటున్నాయి. కానీ, లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే మాత్రం ఏకపక్షంగానే ఫలితాలు వెల్లడవుతున్నాయి. 39 లోక్‌సభ స్థానాలున్న ఈ రాష్ట్రంలో గత 2019లో జరిగిన ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. 1977లో అన్నాడీఎంకే, కాంగ్రెస్‌ల నేతృత్వంలోని కూటమి పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా 36 స్థానాలను కైవసం చేసుకుంది. 1980లో జరిగిన ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్, ఐయూఎంఎల్‌లతో కూడిన కూటమి 37 స్థానాలను, 1984, 1989 ఎన్నికల్లో అన్నాడీఎంకే-కాంగ్రెస్‌ల కూటమి 38 స్థానాలను, 1991లో డీఎంకే-కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి 39 స్థానాలను, 1996లో జరిగిన ఎన్నికల్లో డీఎంకే-టీఎంసీ నేతృత్వంలోని కూటమి 38, 1998లో అన్నాడీఎంకే, పీఎంకే, బీజేపీ, ఎండీఎంకే, టీఆర్‌సీ పార్టీలతో కూడిన కూటమి 35 స్థానాలను సాధించింది. 1999 ఎన్నికల్లో మాత్రం పరిస్థితి దీనికి భిన్నంగా మారింది. డీఎంకే, పీఎంకే, బీజేపీ, ఎండీఎంకే నేతృత్వంలోని కూటమి 26 స్థానాలు గెలుచుకోగా, అన్నాడీంకే, కాంగ్రెస్, సీపీఎం నేతృత్వంలోని కూటమికి 13 సీట్లు వచ్చాయి. కానీ, తర్వాత దాదాపు అన్ని లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ తమిళ ఓటర్లు ఏదో ఒక పార్టీ వైపే మొగ్గు చూపారు.

అధికారం లేకుంటే..

తమిళనాట ఎంజీఆర్, కరుణానిధి హయాంలలో పాలకపక్షానికి పార్లమెంటు స్థానాలు తక్కువ రావడం ఆనవాయితీగా మారింది. 2008, 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికలు మినహా ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఆ విషయం స్పష్టమవుతుంది. తమిళనాట అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుంటాయి. ఈ రెండు ఎన్నికలకు కనీసం రెండేళ్ల వ్యవధి ఉంటోంది. దీంతో ఈ రెండేళ్లలో ప్రభుత్వం అనుసరించిన విధానాలకు అనుగుణంగా ఓటర్లు తీర్పు చెబుతున్నారు. తమిళనాట 2001లో అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చింది. 2004 జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి పార్లమెంటు ఎన్నికల్లో భారీ విజయం సాధించింది. 2006లో డీఎంకే అధికారం చేపట్టింది. కానీ, 2009లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే-కాంగ్రెస్ కూటమికి 28 స్థానాలను సాధించుకోగలిగింది. 2011లో అన్నాడీఎంకే తమిళపీఠాన్ని కైవసం చేసుకుంది. అయినా.. 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ ఏకంగా 37 స్థానాలను సాధించుకుంది. మళ్లీ 2016లో అన్నాడీఎంకే వరుసగా రెండోమారు అధికారం చేపట్టగా, 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో విపక్ష డీఎంకే-కాంగ్రెస్ కూటమి 38 స్థానాలను సాధించడం విశేషం. ఆ తరువాత 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో తమిళ ఓటరు ఎలాంటి తీర్పునిస్తాడోననే ఆసక్తి పెరిగింది. అన్నాడీఎంకే, బీజేపీ సైతం సంప్రదాయంపైనే గంపెడాశలు పెట్టుకున్నాయి. స్టాలిన్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు కావస్తున్నందున ఓటర్లు తమకే పట్టం కడతారని ఆ రెండు పార్టీలు భావిస్తున్నాయి.



ఆ ఐపీఎస్‌ల కథేంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. ఈ నెల 1న ఆమె ఈసీకి రాసిన లేఖపై తక్షణం వివరణ ఇవ్వాలని 4వ తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి ఆదేశాలు జారీచేసింది. అధికార వైసీపీకి అనుకూలంగా ప్రతిపక్షాలకు నష్టం కలిగించేలా ఈ ఐపీఎస్‌లు అధికార దుర్వినియోగానికి పాల్పడిన సందర్భాలు, అందుకు సంబంధించిన ఆధారాలను తన లేఖకు పురందేశ్వరి జత చేశారు. రాష్ట్రంలో డీజీపీ పోస్టుకు అరడజను మంది అర్హులైన సీనియర్లు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సొంత జిల్లా, ఆయన సామాజిక వర్గానికి చెందిన జూనియర్ అధికారి కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని డీజీపీగా రెండేళ్లకు పైగా అదనపు పూర్తి బాధ్యతల్లో కొనసాగించడానికి ప్రధాన కారణం ఆయన వైసీపీ సానుభూతిపరుడు అవడమేనని పేర్కొన్నారు. గత రెండేళ్లలో వైసీపీకి ఆయన ఏ విధంగా సహకరించారో కొన్ని ఆధారాలు పొందుపరిచారు. ముఖ్యమంత్రి పర్యటనకు భారీ భద్రత కల్పిస్తూ దేశ ప్రధాని మోదీ సభకు కనీస రక్షణ చర్యలు చేపట్టలేదన్నారు. సీఎం కడప పర్యటనకు ప్రధాని సభకన్నా ఎక్కువ మంది పోలీసులను మోహరించారని.. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన వైఎస్ అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయకుండా సీబీఐ అధికారులకే అడ్డుపడ్డారని, ప్రజల తరఫున పోరాటం చేసే ప్రతిపక్షాలపై అధికార పార్టీ దాడులు, దౌర్జన్యాలకు దిగితే బాధిత ప్రతిపక్షాలపైనే కేసులు పెట్టే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆమె వివరించారు. వైసీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్న డీజీపీని తక్షణమే మార్చేయాలని కోరారు.

సీఎస్‌పైనా ఆరోపణలు..: 22 మంది ఐపీఎస్‌లతో పాటు సీఎస్ జవహర్‌రెడ్డిపైనా పురందేశ్వరి తన లేఖలో ఈసీకి ఫిర్యాదు చేశారు. ఆయన కూడా సీఎం జిల్లాకు చెందినవారని.. అదే సామాజిక వర్గమని, ఎన్నికల కమిషన్ రంగంలోకి దిగేవరకూ రాష్ట్రంలో దొంగ ఓట్లపై చర్యలు తీసుకోలేదని తెలిపారు. సీనియర్లను పక్కన బెట్టి స్వప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి ఆయన్ను సీఎస్‌గా నియమిస్తే బహిరంగంగానే వైసీపీకి మద్దతిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం పంచాయతీలకు ఇచ్చిన నిధులను దారి మళ్లించారని.. వైసీపీ ఓటుబ్యాంకు పెంచారని.. స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగాలంటే ఈ ఇద్దరితోపాటు ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పలువురు ఐపీఎస్ అధికారులను మార్చాలని కోరారు. అలాగే టీటీడీ ఈవో ధర్మారెడ్డి, విజిలెన్స్ అధిపతి కొల్లి రఘురామిరెడ్డి, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి తదితరుల వ్యవహార శైలిపైనా ఆధారాలు జతచేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి ఎన్నికలను ఫలితాలను తారుమారు చేసేందుకు ఈ అధికారులు ప్రణాళికతో ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

తిరుమలేశుడి సేవలో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్


తిరుమల ఆలయంలో జనరల్ మనోజ్ పాండే దంపతులు

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆయన మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జనరల్ మనోజ్ పాండేను రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ధర్మాన్ని రక్షించడమంటే సమాజాన్ని రక్షించడమే: జస్టిస్ బి.శివశంకరరావు


పంచాంగ శ్రవణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ శివశంకరరావు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9: భారతీయ ఖగోళ శాస్త్రం శాస్త్రీయమైనదని మిడిమిడి జ్ఞానంతో ధర్మాన్ని తప్పుపట్టే కాలం నడుస్తున్నదని, ధర్మాన్ని రక్షించడం అంటే మొత్తం సమాజాన్ని రక్షించడమేనన్న తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని హైకోర్టు జ్యుడీషియల్ ప్రివ్యూ న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు పేర్కొన్నారు. గుంటూరులో మంగళవారం జరిగిన ఉగాది వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ శివశంకరరావు మాట్లాడుతూ బహుముఖ సేవలకు వ్యవస్థీకరించిన దర్శనికుడు ఏకాదండయ్య పంతులు అని ప్రశంసించారు. రాళ్లబండి వి.ఎస్.ఆర్.శర్మ రచించిన వేద పారాయణం, పంచాంగ శ్రవణం పుస్తకాలను ఆవిష్కరించారు.

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కృషి అభినందనీయం

- జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్


భారతీయ విద్యాభవన్‌లో ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9: భారతీయ సాంస్కృతిక, విద్యా మూలాల పునరుజ్జీవం కోసం డాక్టర్ కేఎం మున్షీ దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన భారతీయ విద్యాభవన్‌లలో ఒకటైన గుంటూరు భారతీయ విద్యాభవన్ సమావేశ మందిరం పునరుద్ధరణ కోసం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్ పేర్కొన్నారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో పునఃనిర్మించిన బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన సామాజిక పునాదులు పాఠశాలల నుంచే వేయాలని సూచించారు.

శ్రీబగళాముఖి సన్నిధిలో జస్టిస్ మల్లికార్జునరావు


జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులను సత్కరిస్తున్న ఆలయ ఈవో జి.నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం/పొన్నూరు టౌన్, ఏప్రిల్ 9: భక్తులు, దాతల ప్రభుత్వ సహాయ సహకారాలతో ఆలయాలు అభివృద్ధి చెందడమేగాక ఆధ్యాత్మిక చింతన, భక్తి భావన పెంపొందుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు అన్నారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసిన శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానాన్ని మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి న్యాయమూర్తి దంపతులను సత్కరించారు. గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వీరాంజనేయస్వామి, శ్రీ సహస్రలింగేశ్వరస్వామి ఆలయాల్లోనూ జస్టిస్ మల్లికార్జునరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో నంద్యాల టీడీపీ అభ్యర్థికి గాయాలు

- తమ్మరాజుపల్లె వద్ద గేదెలను ఢీకొన్న కారు
- బెలూన్‌లు తెరుచుకోవడంతో ఫరూక్‌కు తప్పిన ప్రాణాపాయం

పాణ్యం, ఏప్రిల్ 9: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. రంజాన్ వేడుకల్లో పాల్గొనేందుకు మంగళవారం హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆయన కారు గేదెలను ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటన జరిగిన వెంటనే కారు బెలూన్లు తెరుచుకోవడంతో ఫరూక్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో కారు దెబ్బతినగా అడ్డువచ్చిన గేదెలు మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత ప్రమాద స్థలానికి చేరుకుని ఫరూక్‌ను పరామర్శించారు. అనంతరం హైవే సిబ్బంది ఫరూక్‌కు ప్రథమ చికిత్స చేసి నంద్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.





ప్రమాదంలో ధ్వంసమైన కారు, గాయపడిన ఫరూక్

అస్మదీయులకు అడ్డగోలుగా..!

- వైసీపీ సర్కారు భారీ భూపందేరం.. విద్యుదుత్పత్తి ప్లాంట్ల పేరిట సంతర్పణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ పాలనలో రాష్ట్రంలో వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ డిమాండ్ పెరగలేదు. గత ఐదేళ్లలో కొత్తగా ఒక్క పెద్ద పరిశ్రమ కూడా రాకపోగా.. సర్కారు విధానాలతో విసిగి ఎన్నో పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయి. అయినా అస్మదీయ కంపెనీలతో ఎడాపెడా విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నారు. జగన్ అధికారంలోకి రాగానే గత చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేశారు. దీనిపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం కూడా తప్పుపట్టింది. అయితే రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా దీర్ఘకాలిక ఒప్పందాలు మంచివికావని సమర్థించుకున్నారు. అప్పుడు దీర్ఘకాలిక ఒప్పందాలు వద్దన్నవారే ఆ తర్వాత అదే తరహాలో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. జగన్ సర్కారు అసలు ఉద్దేశం ఏంటంటే... చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న కంపెనీలను తరిమేసి, అస్మదీయ కంపెనీలకు లబ్ధిచేకూర్చడం! అడ్డగోలుగా భూపందేరం చేయడం! దీనికి రాష్ట్ర, రైతుల ప్రయోజనాలు అనే ముసుగు వేశారు. అదానీకి మేలు చేయడం కోసం ఉన్నపళంగా 7000 మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అలాగే అస్మదీయ కంపెనీలకు వేలాది ఎకరాలు కట్టబెట్టేందుకు పంప్డ్ స్టోరేజీ జల విద్యుదుత్పత్తి సంస్థలను కట్టబెట్టారు.

వినియోగదారులపై భారం

గతంలో చంద్రబాబు ప్రభుత్వం 4000 మెగావాట్ల సోలార్, విండ్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోగా, ప్రతిపక్షనేత హోదాలో జగన్ తప్పుపట్టారు. ఏటా రూ.4000 కోట్ల ఆర్థిక భారం పడుతుందంటూ విష ప్రచారం చేశారు. వేల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే నాయకుడెవరూ దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను చేసుకోరంటూ చంద్రబాబును విమర్శించారు. అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన ఒప్పందాలను రద్దు చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యుదుత్పత్తి సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని అమలు చేయాల్సిందేనని న్యాయస్థానం ఆదేశించింది. రెండేళ్ల పాటు సోలార్, విండ్ విద్యుదుత్పత్తి సంస్థల నుంచి కరెంటు తీసుకోకుండానే ఒప్పందం మేరకు రూ.6,500 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. మరోవైపు వేసవిలో యూనిట్‌కు రూ.22 దాకా చెల్లించి బయట నుంచి కొనుగోలు చేశారు. ఈ అదనపు భారాన్ని వినియోగదారుల నుంచి ట్రూఅప్ చార్జీల పేరిట వసూలు చేశారు. జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల వినియోగదారులపై భారం పడింది. ఐదేళ్లలో ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలను పెంచారు.

అదానీతో అధిక ధరకు...

అదానీ నుంచి 7000 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను రాజస్థాన్ నుంచి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ద్వారా కొనుగోలుకు 2020 డిసెంబరులో జగన్ సర్కారు ఒప్పందం చేసుకుంది. గతంలో చేసిన విమర్శలను మరచిపోయి 25 ఏళ్ల పాటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందాన్ని చేసుకున్నారు. యూనిట్‌కు రూ.2.49 చొప్పున కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. కానీ 2020లో గుజరాత్ ప్రభుత్వం పిలిచిన సోలార్ టెండర్లలో యూనిట్ రూ.1.99కే సోలార్ విద్యుత్‌ను అందించేందుకు సెకీ ముందుకొచ్చి ఒప్పందం చేసుకుంది. అదే ఏడాది పలు రాష్ట్రాలు పిలిచిన టెండర్లలో కూడా యూనిట్ విద్యుత్ రూ.2కే ఇచ్చేందుకు సోలార్ సంస్థలు ముందుకొచ్చాయి. అయితే జగన్ సర్కారు వీటి కంటే అత్యధిక ధరకు ఒప్పందం చేసుకుంది. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం కోసమే ఒప్పందం చేసుకున్నామంటూ ఊరూవాడా ప్రచారం చేసుకున్నారు. తొలిదశలో ఈ ఏడాది సెప్టెంబరులో 3000 మెగావాట్లు, 2025 సెప్టెంబరులో మరో 3000 మెగావాట్ల విద్యుత్ వస్తుందని ఒప్పందంలో పేర్కొన్నారు. మరో వెయ్యి మెగావాట్ల విద్యుత్‌ను వచ్చే ఏడాది చివరికి ఇస్తామని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ పేర్కొంది. అంటే.. అదానీతో ఒప్పందం వల్ల జగన్ పాలనలో ఒక్క యూనిట్ విద్యుత్ కూడా రాష్ట్రానికి రాదు. ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు సరఫరా చేయలేరు.

అస్మదీయులకు పందేరం

ఇంధన రంగంలో పెట్టుబడులు పెడతామంటూ జగన్ సన్నిహితులు దరఖాస్తులు చేయడమే ఆలస్యమన్నట్లుగా అనుమతులు, భూముల కేటాయింపులు చకచకా జరిగిపోయాయి. సార్వత్రిక ఎన్నికల ముందు భారీ భూపందేరానికి తెరతీసింది. 3350 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి చేస్తానంటూ ప్రతిపాదించిన జేఎస్‌డబ్ల్యూ న్యూఎనర్జీ సంస్థకు ఇటీవల జగన్ సర్కారు 20,100 ఎకరాలు కేటాయించింది. ఆక్వాగ్రీన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్‌కు వెయ్యి మెగావాట్లకు గాను 6000 ఎకరాలను కేటాయించింది. జగన్ సన్నిహితుడు విశ్వేశ్వరరెడ్డికి చెందిన ఇండోసోల్ పవర్‌కు గతంలో కేటాయించిన భూములకు అదనంగా మరో 10,500 ఎకరాలు కేటాయించింది. మొత్తంగా ఇండోసోల్‌కు 21,000 ఎకరాలు ధారాదత్తం చేసింది. ఈ ఏడాదిలోనే 27,040 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ సంస్థలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టింది. రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) నిర్ణయం మేరకు.. ఒక మెగావాట్‌కు ఆరు ఎకరాల చొప్పున 27,040 మెగావాట్ల సామర్థ్యానికి 1,62,240 ఎకరాలను కట్టబెట్టాలి. గత నెలలో 52,250 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మిగిలిన భూములను సమీకరించలేక లీజు విధానంలో భూములు ఇచ్చేందుకు సర్కారు సిద్ధమవుతోంది. కాగా ఎన్టీపీసీతో కడప, ప్రకాశం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో మొత్తం 13,900 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ప్లాంట స్థాపనకు ప్రతిపాదిత ఒప్పందాలు ఉన్నాయి.

ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజీ జల విద్యుదుత్పత్తి సంస్థలు

సంస్థ	జిల్లా	ప్రదేశం	సామర్థ్యం
అదానీ	కడప	గండికోట రిజర్వాయరు	1000
అదానీ	శ్రీ సత్యసాయి	చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు	500
అదానీ	పార్వతీపురం మన్యం	కురుకుర్తి రిజర్వాయరు	1200
అదానీ	పార్వతీపురం మన్యం	కర్రివలస రిజర్వాయరు	1000
అదానీ	అనకాపల్లి	పెదకోట రిజర్వాయరు	1500
అదానీ	విజయనగరం	రైవాడ రిజర్వాయరు	1000
ఇండోసోల్	కడప	పైడిపాలెం ఈస్ట్	1200
ఇండోసోల్	కడప	పైడిపాలెం నార్త్	1000
అరబిందో	నంద్యాల	అవుకు	800
అరబిందో	అనంతపురం	శింగనమల	800
షిరిడిసాయిఎలక్ట్రికల్స్	కడప	సోమశిల	900
షిరిడిసాయి	అల్లూరి సీతారామరాజు	ఎర్రవరం	1200
జేఎస్‌డబ్ల్యూ నియో	కడప	వేంపల్లి	1500
గ్రీన్‌కో	నంద్యాల	పిన్నాపురం	1680
ఆస్ట్రా గ్రీన్‌ఎనర్జీ	అన్నమయ్య	వొంగిమాల	180
ఏపీ జెన్కో	అనంతపురం	కమలపాడు	950
ఏపీ జెన్కో	నంద్యాల	యాగంటి	1000
ఏపీ జెన్కో	నంద్యాల	బేతంచర్ల	500
ఏపీ జెన్కో	అన్నమయ్య	గడికోట	800
ఏపీ జెన్కో	కడప	దీనపల్లి	750
	పార్వతీపురం మన్యం	కిరుకట్టి -2	600
	అల్లూరి సీతారామరాజు	చిట్టంవల్ల	800
	విజయనగరం	గుజ్జిలి	1400
	కడప	రాజుపాలెం	800
	అన్నమయ్య	యెవవల్లి	1000
	అన్నమయ్య	రాయవరం	1000
	కడప	కొప్పోలు	360
మొత్తం			27040

జగన్ రాజకీయ స్వార్థానికి
పెన్షనర్లు బలి

- 33 మంది మృతికి రాష్ట్రప్రభుత్వానిదే బాధ్యత
- సీఎస్‌పై చర్యలు తీసుకోవాలి.. టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల డిమాండ్
- ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు.. ఈ సీఎంది శవ రాజకీయం
- ఆయనపై హత్య కేసు నమోదు చేయాలి: జనసేన, బీజేపీ నేతల డిమాండ్


ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ అరుణ్ మిశ్రాకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న కనకమేడల, కూటమి నేతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వార్థంతో ముఖ్యమంత్రి జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని తెలుగుదేశం మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో 33 మంది పింఛనుదారుల మృతికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ వ్యవహారంపై మంగళవారమిక్కడ జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి బృందం ఫిర్యాదు చేసింది. ఈ అంశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని కమిషన్ చైర్మన్ జస్టిస్ అరుణ్ మిశ్రాను కోరింది. పింఛన్ల పంపిణీలో వలంటీర్లను పక్కన పెట్టి, పంచాయతీ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేయాని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదేశించగా.. వాటిని రాష్ట్రప్రభుత్వం, సీఎస్ పక్కదారి పట్టించినట్లు ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ సీఎస్ అధికార పార్టీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అనంతరం కూటమి నేతలు మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కులు ఉల్లంఘన, రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని కనకమేడల ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్రప్రభుత్వం వలంటీర్ల ద్వారా ప్రచారం చేస్తోందని.. అందుకే ఈసీ పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాలని ఆదేశించిందని గుర్తుచేశారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేసే అవకాశం ఉన్నప్పటికీ.. రాజకీయ స్వార్థం కోసమే పింఛన్‌దారులను సచివాలయాల వద్ద పడిగాపులు కాసేలా చేశారని మండిపడ్డారు. అక్కడ కనీస సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. వృద్ధులు, వికలాంగులనే కనికరం కూడా లేకుండా మండుటెండలో నిలబెట్టారని, నీళ్లివ్వకుండా వేధించారని, ఆ నిర్లక్ష్యంతోనే 33 మంది మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

వలంటీర్ల వ్యవస్థ దుర్వినియోగం: షేక్ బాజీ

వలంటీర్ల వ్యవస్థను జగన్ దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ ఆరోపించారు. వృద్ధులు, వికలాంగులను రోడ్లపై ఎండల్లో గంటల తరబడి నిలబెట్టి ఎవరైనా చనిపోతే, వాళ్ల మరణాలపై మరమరాలు ఏరుకోవాలని ముందే కుట్ర చేశారని అన్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో పింఛన్ల పంపిణీ జరుగుతోందని, వలంటీర్ వ్యవస్థ లేకపోయినా అక్కడ సజావుగా సాగుతుంటే, ఏపీలో మాత్రమే 33 మంది ఎలా చనిపోతారని ప్రశ్నించారు. జగన్ కుట్రపూరితంగా చేశారని చెప్పడానికి ఇదే రుజువని.. ఆయనపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన 33 మంది కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, అది కూడా జగన్ సొంత సొమ్ము చెల్లించాలన్నారు. మరణాలకు సీఎస్ జవహర్ రెడ్డి బాధ్యత వహించాలని చెప్పారు.

శవ రాజకీయాలు జగన్‌కు కొత్తేం కాదు: శ్రీధర్

ఎన్నికల ముందు శవరాజకీయాలు చేయడం జగన్‌కు కొత్తేమీ కాదని జనసేన నేత డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. 2014లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, 2019లో వైఎస్ వివేకానందరెడ్డి మరణాలతో ఆయన శవ రాజకీయాలు చేశారని.. ఇప్పుడు ఈ 33 మంది మరణాలతో మరోసారి శవ రాజకీయానికి తెరలేపాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. కుట్రలో భాగంగానే సచివాలయాల వద్దకు రప్పించారని.. గంటల తరబడి ఎండలో నిలబెట్టి చనిపోయేలా చేశారని అన్నారు.


అశేష భక్త జనసందోహం మధ్య శ్రీశైల మల్లన్న రథోత్సవం, (ఇన్‌సెట్)ఉత్సవమూర్తులు

శ్రీశైలంలో వైభవంగా ఆదిదంపతుల రథోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 9: ఉగాది మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో రథోత్సవం వైభవంగా సాగింది. రథంపై మల్లికార్జున స్వామి, భ్రమరాంబదేవి విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కాగా.. భ్రమరాంబదేవి రమావాణిసేవిత రాజరాజేశ్వరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీవారి ఆలయంలో వేడుకగా ఉగాది ఆస్థానం

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. సర్వభూపాల వాహనంపై శ్రీవారి ఉత్సవర్లను బంగారు వాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా తీసుకొచ్చి నూతన వస్త్రాలను ధరింపజేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. అలాగే బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు.

దర్గాలో పంచాంగ పఠనం!


దర్గాలో పంచాంగ పఠనం చేస్తున్న బద్రీనాథ్ స్వామి, పక్కన పెద్ద మున్నా పాషా

కౌతాళం, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా కర్నూలు జిల్లాలోని ఓ దర్గాలో పంచాంగ పఠనం నిర్వహించారు. కౌతాళం మండలంలోని శ్రీజగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మంగళవారం పురోహితులు పంచాంగ పఠనం చేశారు. తమ వంశస్థుల ఆచారం ప్రకారం హిందూముస్లింల ఐక్యతకు నిదర్శనంగా ఏటా ఉగాది నాడు దర్గాలో పంచాంగ పఠనం నిర్వహిస్తున్నామని దర్గా ధర్మకర్త పెద్ద మున్నా పాషా, పురోహితుడు బద్రీనాథ్ స్వామి తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చైనాతో జాగ్రత్త!

అరుణాచల్ ప్రదేశ్ పర్యటనలో కేంద్రరక్షణమంత్రి రాజనాథ్‌సింగ్ మంగళవారం చైనాను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యధికులకు అంతగా ఆనలేదు. ఇటీవల అరుణాచల్‌లోని ముప్పై ప్రాంతాలకు చైనా తన పేర్లు పెట్టుకున్న విషయం తెలిసిందే. 11నివాసప్రాంతాలు, 12పర్వతాలు, నాలుగు నదులు, ఒక మార్గం, కొంత భూభాగానికి చైనా క్యాబినెట్ నిర్ణయం మేరకు నామకరణం జరిగిందని, మే 1వతేదీనుంచి కొత్తపేర్లు అమల్లోకి వస్తాయని గ్లోబల్ టైమ్స్ పదిరోజుల క్రితం ప్రకటించింది. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో ఉన్న రాజ్‌నాథ్ సింగ్ దీనిమీద స్పందించారు. 'ఇటీవల చైనా మన భూభాగంలోని కొన్ని ప్రాంతాలకు తన పేర్లు పెట్టుకుంది. ఒకవేళ మనం కూడా ఆ దేశంలోని ప్రాంతాలకు మన పేర్లు పెడితే, కేవలం పేరుమార్చినంతనే ఆ ప్రాంతాలు మనవైపోతాయా? అని ఆయన ప్రశ్నించారు. బహిరంగసభ కాబట్టి ఆయన జాగ్రత్తగా మాట్లాడి ఉండవచ్చును కానీ, పాకిస్థాన్ విషయంలో ఇటీవల ఎంతో ఘాటుగా, తీవ్రంగా మాట్లాడిన ఆయన చైనావరకూ వచ్చేసరికి మరీ మెత్తగా స్పందించినట్టు చాలామందికి అనిపించింది.

అరుణాచల్ ప్రదేశ్ తనదని ఎప్పటినుంచో అంటున్న చైనా, దానిని జాంగ్‌నన్ అని పిలుచుకుంటూ, భారత్ మీద అలిగినప్పుడో, ఆగ్రహం కలిగినప్పుడో అక్కడి కొండలూ కోనలకు తన భాషలో పేర్లు ప్రకటిస్తుండటం తెలిసిన విషయమే. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ళలోనే ఈ నామకరణోత్సవాన్ని ఆరంభించి, ఇప్పటికి నాలుగుసార్లు ఆ పని చేసింది. చైనా ఇలా కొత్తగా పేర్లుపెడుతున్నప్పుడల్లా, పేర్లుమార్చినంత మాత్రాన నిజాలు మారిపోవని భారతదేశం అంటూ వస్తున్నది. మనలను ఎవరైనా అవమానించినా, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా సహించేది లేదన్న రాజ్‌నాథ్ వ్యాఖ్య బాగున్నది కానీ, నిజానికి చైనా చర్యలు ఎప్పటినుంచో అదేరీతిలో ఉంటున్నాయి. 2014వరకూ ఒక్కబుల్లెట్ కూడా పేలని ఉభయదేశాల సరిహద్దులు అనంతరకాలంలో నిత్య ఉద్రిక్త ప్రాంతాలుగా మారిపోవడం తెలిసిందే. చొరబాట్లు, దురాక్రమణలు, దాడులతో అది మనని ప్రశాంతంగా ఉండనివ్వడం లేదు. అరుణాచల్‌లో మన నాయకులు కాలూనగానే చైనా ఖండిస్తుంది, కొన్ని ప్రాంతాలకు కొత్తగా పేర్లుపెడుతుంది. ఇందుకు ప్రతిగా అరుణాచల్ ఎప్పటికీ భారత్ అంతర్భాగమేనని మన నాయకులు ప్రకటిస్తారు, ట్వీట్లు చేస్తారు. తన అసమర్థతతో కాంగ్రెస్ దేశభద్రతకు ఎంత నష్టాన్ని తెచ్చిపెట్టిందో, మోదీ ప్రభుత్వం ఆ తప్పుల్ని చక్కదిద్ది దేశాన్ని ఎంత భద్రంగా ఉంచుతోందో ఎన్నికల సభల్లో పాలకులు చెప్పుకొస్తుంటారు.

కానీ, చైనా పేర్లమార్పు వెనుక అంతర్జాతీయస్థాయి ఎత్తుగడలు, న్యాయపరమైన వ్యూహాలున్నాయని కొందరి వాదన. దీనికి తోడు ఇప్పుడు చైనా అరుణాచల్‌ప్రదేశ్‌కు ఎదురుగా, వాస్తవాధీనరేఖ (ఎల్‌ఏసీ) వెంట తనవైపున 175గ్రామాలను నిర్మిస్తోందట. ఇప్పటికే ఎల్‌ఏసీగుండా చైనా నిర్మించిన ఆరువందల గ్రామాలకు ఇవి అదనం. అరుణాచల్ నుంచి లద్దాఖ్‌వరకూ చైనా గ్రామాలకుగ్రామాలు కడుతూపోతున్నందున రాబోయే రోజుల్లో సరిహద్దులు మరింత ప్రమాదకరం కాకతప్పదు. సరిగ్గా నిర్వచించని, సరిహద్దులుగా భావిస్తున్న ప్రాంతాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి చైనాకు ఈ చర్య ఉపకరిస్తుంది. సరిహద్దుల్లో కడుతున్న ఈ గ్రామాలన్నీ ఇకపై గస్తీకి, ఒకవేళ ఘర్షణతలెత్తితే సైనికస్థావరాలుగా ఉపయోగపడతాయి. భవిష్యత్తులో ఎల్‌ఏసీని కచ్చితంగా నిర్ణయించే సందర్భంలో ఈ గ్రామాల ఉనికి చైనాకు తోడ్పడుతుంది. వాస్తవాధీనరేఖకు అత్యంత సమీపంలో రహదారులు, రైల్వేలైన్లు ఇత్యాది మౌలిక సదుపాయాల విస్తరణతో చైనా మనకు చెక్‌పెడుతున్నది. లద్దాఖ్‌కు అతిసమీపంలో, సరిహద్దులకు ఆవల హోతాన్ ఎయిర్‌బేస్‌లో ఇటీవల రెండవ రన్‌వే కూడా సిద్ధమైంది. చైనా మన భూభాగాల్లోకి చొరబడుతూ క్రమపద్ధతిలో గస్తీలేని ప్రాంతాలను సృష్టిస్తున్నదని, అలా ఇప్పటికే చాలా భూభాగాన్ని తన వశం చేసుకున్నదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మోదీ అధికారంలో ఉన్నంతకాలం ఒక్క అంగుళం కూడా ఎక్కడికీ పోదని బీజేపీ నాయకులు మరోపక్క హామీ ఇస్తున్నారు. సరిహద్దులు, దురాక్రమణలకు సంబంధించిన వాస్తవాలను ఇప్పటికైనా ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉన్నది.

కాంగ్రెస్ మేనిఫెస్టో మేజిక్ చేయగలదా?

"పదేళ్ల బీజేపీ పాలనలో ఊకదంపుడు ప్రచారమే తప్ప జరిగిందేమీ లేదు. అంతటా నిరుద్యోగం, అధిక ధరలు, పడిపోతున్న వినియోగం వల్ల అభివృద్ధి కుంటుపడింది. పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అంతటా విద్వేషపూరిత విచ్ఛిన్న వాతావరణం కొనసాగుతోంది. రాజ్యాంగ విలువలను పక్కనపెట్టి మెజారిటీవాదాన్ని ముందుకు తీసుకువచ్చారు. అసమానతలు పెరిగిపోయాయి. సమాజంలో ప్రతి వర్గం భయంతో జీవిస్తోంది. అన్ని రంగాల్లో అభివృద్ధి, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం సాధించగల సామర్థ్యం కాంగ్రెస్ పార్టీకే ఉన్నది. 1965, 1971 యుద్ధాల్లో విజయం సాధించి దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉన్నది. 1991లో కాంగ్రెస్ ప్రభుత్వమే దేశంలో చెప్పుకోదగ్గ మార్పులను తీసుకువచ్చింది. "కాంగ్రెస్‌పై మరోసారి విశ్వాసం చూపండి" అంటూ గత వారం కాంగ్రెస్ పార్టీ 'న్యాయపత్రం' పేరుతో విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో పిలుపునిచ్చింది.



కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా సామాజిక న్యాయం విషయంలో బీజేపీకి భిన్నంగా తాను ఏ విధంగా ఆలోచిస్తుందో చెప్పేందుకే తన మేనిఫెస్టో డాక్యుమెంట్‌ను రూపొందించింది. కాని ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకువెళ్లగలుగుతుందా? దేశ ప్రజలు ఈ మేనిఫెస్టోను సీరియస్‌గా తీసుకుంటారా? కాంగ్రెస్ మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధిని, సమానత్వాన్ని, స్వేచ్ఛను, న్యాయాన్ని సాధించగలదని ప్రజలు విశ్వసిస్తారా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న

ఒకరకంగా ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు. రెండుసార్లు పార్టీకి సారథ్యం వహించి విఫలమైన రాహుల్ గాంధీ ఇప్పుడు పార్టీ అధ్యక్షుడు కానప్పటికీ ఆయనే రథసారథి. అందువల్ల ఈ ఎన్నికల తర్వాత ఆయన పాత్ర ఎలా ఉంటుంది, కాంగ్రెస్ నాయకత్వం తీరుతెన్నులు, సంస్థ స్వరూపం ఎలా మారుతాయి అన్న వాటిపై అంతర్గత చర్చ జరుగుతోంది. ఈ విషయాలు తెలిసినప్పటికీ ఇదే ఆఖరి పోరాటం లాగా కాంగ్రెస్ నేతలు పోరాడుతున్నారు. వందలాది సభలు, సమావేశాలు, వార్ రూమ్ సమాలోచనలు, రాష్ట్ర నేతలతో చర్చలు, యాత్రలు నిర్వహిస్తున్నారు. అక్బర్ రోడ్‌లో ఏఐసీసీ కార్యాలయం ఎప్పుడు చూసినా కిటకిటలాడుతూ కనిపిస్తోంది.

"మా పార్టీ ఒక థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్ లాంటిది. పోయేవారు పోతున్నా, వచ్చేవారు వస్తూనే ఉంటారు. జాగా లేదని చెప్పినా తోసుకుని వచ్చేవారు ఉండనే ఉంటారు" అని ఒకప్పటి ఏఐసీసీ అధికార ప్రతినిధి వి.ఎన్. గాడ్గిల్ చాలా కాలం క్రితమే వ్యాఖ్యానించారు. స్పష్టంగా చెప్పాలంటే ఒక రాజకీయ పార్టీ వాతావరణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తప్ప మరెక్కడా కనపడదు. ముఖ్యమంత్రులైనా, బడా నేతలైనా ఢిల్లీ వచ్చేసరికి పార్టీ ప్రధాన కార్యదర్శులను కలుసుకునేందుకు వేచి చూడాల్సిందే. పార్టీ కార్యాలయంలో పనిచేసే పీఏలను, ప్యూన్‌లను ప్రసన్నం చేసుకునే నేతలు కూడా కనపడతారు. ఒక రకంగా అక్బర్ రోడ్ కార్యాలయం మినీ ఇండియాను తలపిస్తుంది. పార్టీకి మూల కేంద్రాలైన సోనియా, రాహుల్ ఒక కుటుంబానికి చెందిన వారైనా ఒక పార్టీగా కాంగ్రెస్ సంస్కృతి భిన్నమైంది. వ్యక్తి కంటే పార్టీ ముఖ్యమైనదనే భావన ఆ పార్టీ కార్యాలయంలోకి వచ్చాక కలుగుతుంది.

"కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబం ఆధిపత్యం కొనసాగడం లేదా?" అని టైమ్స్ ఆఫ్ ఇండియా సంపాదకుడు దిలీప్ పడగాంకర్ 1991 జూన్ 9న అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావును చేసిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. ఇందుకు పి.వి. సమాధానమిస్తూ "కుటుంబం అనే ఈ అంశంపై నాకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. నేను రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు నాకు జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలతో వ్యక్తిగత పరిచయం లేదు. కాని కాంగ్రెస్ పార్టీయే ఒక సైద్ధాంతిక కుటుంబంగా నాకు అనిపించింది. మీరంటున్న ఒకరిద్దరు కుటుంబ సభ్యులు కూడా ఒక పెద్ద కుటుంబంలో భాగం. వారూ ఈ దేశ ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు తగినట్లుండాల్సిన వారే. అందువల్ల కాంగ్రెస్‌ను ఒకరిద్దరి వారసత్వానికి పరిమితం చేయవద్దు" అని చెప్పారు. అందువల్ల వారసత్వానికి చెందిన కుటుంబ నేతలే కాంగ్రెస్ పార్టీ అనుకోవడానికి వీల్లేదు. పార్టీ గతిశీలతకు వారు ఇరుసులా పనిచేస్తున్నప్పటికీ ఆ గతిశీలతకు వారే కారణాలు కానేకాదు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్ రెడ్డి 33 లోక్‌సభ సీట్లు సాధించినా; కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ విజయాలు సాధించినా అక్కడి సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో తలెత్తిన నేతలు ప్రజల్లో పార్టీ బలంగా ఉన్నదనే విశ్వాసం కలిగించారు. స్థానికంగా బలోపేతమైన నాయకులే కాంగ్రెస్ పార్టీకి బలం. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీలో ఒక మేధో వలయం స్పష్టంగా కనిపిస్తుంది. పివి నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, శంకర్ రావు చవాన్, జగజీవన్ రామ్, కమలాపతి త్రిపాఠీ, శివశంకర్, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, గాడ్గిల్, జైపాల్ రెడ్డి, హెచ్.ఆర్. భరద్వాజ నుంచి మన్మోహన్ సింగ్, వీరప్ప మొయిలీ, చిదంబరం, సల్మాన్ ఖుర్షీద్, జైరాం రమేశ్, కె.రాజు, శశిథరూర్, అభిషేక్ సింఘ్వీ తదితరుల వరకు కాంగ్రెస్‌లో మేధో సంపద కనిపిస్తూనే ఉంటుంది. వీరు కాక మాజీ అధ్యాపకులు, వైస్ చాన్స్‌లర్లు, జర్నలిస్టులు, న్యాయవేత్తలు, శాస్త్రవేత్తలు కాంగ్రెస్‌కు భావజాలపరంగా మద్దతునిస్తూనే కనపడతారు. వీరంతా ఒక టీమ్‌గా పనిచేస్తూ కాంగ్రెస్‌కు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్గదర్శకత్వం అందించేందుకు ప్రయత్నిస్తారు.

ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోకు ప్రాధాన్యత ఉన్నది. ఇది ఒక్కరు రూపొందించిన పత్రం కానే కాదని, ఎంతో మథనం తర్వాత రూపొందించిన పత్రమని చదివిన వారికి అర్థమవుతుంది. ఈ మేనిఫెస్టో ఓబీసీ, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, రైతులకు సామాజిక న్యాయం అందించే దిశగా తమ ఆలోచనలను, కార్యాచరణను ప్రకటించింది. నిరుద్యోగులకు, మహిళలకు, రైతులకు పెద్ద ఎత్తున నిధులను ప్రకటించింది. తమ హయాంలోనే గ్రామీణ ఉపాధి పథకం, ఆహార భద్రత వంటివి ప్రవేశపెట్టిన విషయాలను గుర్తు చేసింది. రైతుల గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించడం, నిరుద్యోగ యువకులకు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపకార వేతనం, ప్రతి పేద కుటుంబానికి రూ. లక్ష నగదు, లక్షలాది ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వోద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయడం, పేదలకు అదనపు భూమిని బదిలీ చేయడం, అగ్నిపథ్‌ను రద్దు చేయడం వంటి అనేక హామీలను కాంగ్రెస్ గుప్పించింది. ఒక రకంగా ఇది పేదలకు అనుకూలంగా, వివిధ అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించే దిశగా రూపొందించిన పత్రం. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా సామాజిక న్యాయం విషయంలో బీజేపీకి భిన్నంగా తాను ఏ విధంగా ఆలోచిస్తుందో చెప్పేందుకే తన మేనిఫెస్టో డాక్యుమెంట్‌ను రూపొందించింది.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

కాని ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకువెళ్లగలుగుతుందా? దేశ ప్రజలు ఈ మేనిఫెస్టోను సీరియస్‌గా తీసుకుంటారా? కాంగ్రెస్ మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధిని, సమానత్వాన్ని, స్వేచ్ఛను, న్యాయాన్ని సాధించగలదని ప్రజలు విశ్వసిస్తారా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. బీజేపీకి భిన్నమైన ఆలోచనా విధానం గల పార్టీగా కాంగ్రెస్ తనను తాను ఎంత రూపుదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ జనాన్ని ఆ దిశగా ఎంత మేరకు ఆలోచింప చేయగలదనేది చర్చనీయాంశం. కాంగ్రెస్ పార్టీని ఎప్పుడూ గతంలో చేసిన తప్పులు వెంటాడుతుంటాయి. బీజేపీపై ఇప్పుడు చేసే ప్రతి విమర్శా ఎప్పుడో ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొన్నదే. ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిరస్కరించినట్లే బీజేపీని కూడా తిరస్కరించే క్రమం రాకపోదు కాని కాంగ్రెస్‌లో మార్పు వచ్చిందని, అది తమ కోసం నిలబడుతుందని ప్రజలు గ్రహించే వరకూ మళ్లీ ఆ పార్టీ జనాదరణ కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

విచిత్రమేమంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అంశాల గురించి చర్చించి అవి ఎలా ఆచరణసాధ్యం కావో వివరించేందుకు బీజేపీ నేతలు పూనుకోవడం లేదు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ముస్లింలీగ్ మేనిఫెస్టో గానో, పాకిస్థాన్ మేనిఫెస్టో గానో చిత్రించి కొట్టి పారేస్తున్నారు. నిజానికి కాంగ్రెస్ మేనిఫెస్టోను ఎండగట్టి తాము ఏ విధంగా సామాజిక న్యాయం చేస్తున్నామో, అభివృద్ధిపై తమ దృక్కోణం ఏమిటో ప్రజలకు వివరించే అవకాశం బీజేపీకి ఉంది. కాని బీజేపీ నేతల దారి వేరు. కాంగ్రెస్‌ను హిందూ వ్యతిరేక పార్టీగా చిత్రిస్తే మిగతా అంశాలను ప్రజలు విస్మరిస్తారనేదే ఆ పార్టీ నేతల అభిప్రాయం.

మరో పది రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలు తీసుకునే నిర్ణయం అత్యంత కీలకమైనది. ఈ రెండు పార్టీల భావజాలాలకు, వ్యవహార శైలికి, మేనిఫెస్టోలకూ వారెంత ప్రాధాన్యతనిస్తారో చెప్పలేము. బీజేపీయే మళ్లీ గెలుస్తుంది అన్న అభిప్రాయాన్ని మధ్యతరగతి వర్గాల్లో మానసికంగా కల్పించడంలో ఆ పార్టీ ఇప్పటికే విజయం సాధించింది. గుజరాత్, కర్ణాటక, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్, హర్యానా, అస్సాం తదితర రాష్ట్రాల్లోని దాదాపు 180 సీట్లలో బీజేపీని కాంగ్రెస్ ముఖాముఖి ఎంతమేరకు ఢీకొనగలదన్న ప్రశ్నపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సీట్లలో కనీసం సగం సీట్లు కాంగ్రెస్ గెలుచుకున్నా ఆ పార్టీ వంద సీట్లను సులభంగా సాధించే అవకాశం ఉన్నది. అప్పుడు రాజకీయ సమీకరణలు భిన్నంగా ఉంటాయి. కాని ఈ మేనిఫెస్టో కాంగ్రెస్ పార్టీకి ఎంతవరకు ఉపయోగపడుతుందో చెప్పలేము.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



కలవరపెట్టిన మొరార్జీ భద్రాచల యాత్ర

మారుమూల గిరిజన ప్రాంతమైన భద్రాచలంలో కొలువైన రాముణ్ణి దర్శించుకోవడానికి 1968లో అప్పటి ఉపప్రధానమంత్రి మొరార్జీ దేశాయి ఒక ప్రత్యేక సందర్భంలో విచ్చేశారు. అప్పటికి ఆయన వయస్సు 72 సంవత్సరాలు. నేనప్పుడు ఆలయంలో సైటు ఇంజనీరుగా పని చేస్తున్నాను. దేవాలయ పునర్నిర్మాణం, గోవిందరాజుల గుట్టమీద రామదాసు ధ్యానమందిరం, దేవునితోటలో సత్రాల నిర్మాణం పనులు 400 మంది శిల్పులతో చాలా హడావిడిగా సాగుతున్నాయి. అప్పటికింకా దేవాలయ సంప్రోక్షణ జరగలేదు. ఆ దశలో మొరార్జీ దేశాయి వస్తున్నారని, ఆయన వెంట అప్పటి ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానందరెడ్డి, ఆయన సతీమణి రాఘవమ్మ, మంత్రులు మర్రి చెన్నారెడ్డి, రుద్రంరాజు రామలింగరాజు, దేవాదాయశాఖ కమిషనర్ నారాయణ చెట్టి కూడ వస్తున్నట్లు సమాచారం అందింది.

కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని చిట్టిగూడూరుకు చెందిన ఉద్దండ సంస్కృత పండితుడైన వరదాచారి భద్రాచల దేవాలయ పునరుద్ధరణ సంఘానికి ఉపాధ్యక్షుడు. ఆయనకు స్వస్థలంలో సంస్కృత కళాశాల ఉండేది. మన రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణకు ఆయన బాల్యంలో సహాధ్యాయి. ఆవిధంగా వరదాచారికి మొరార్జీ దేశాయితో పరిచయం ఏర్పడింది. భద్రాచల రాముడి ఆలయ ప్రాంగణంలో చిత్రకూట మంటపం నిర్మించాలని వరదాచారి సంకల్పం, అవసరమైన ఆర్థిక వనరులను కూడా సమకూర్చుకున్నారు. మొరార్జీ దేశాయితో ఆ మంటపానికి శంకుస్థాపన చేయించాలన్న లక్ష్యంతో ఢిల్లీ వెళ్ళి ఆయనకు భద్రాచల ప్రాశస్త్యాన్ని వివరించి ఆహ్వానించారు, మొరార్జీ ఒప్పుకున్నారు.

వచ్చేవ్యక్తి సామాన్యుడు కానందున భద్రాచలంకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమంతా కదలివచ్చింది. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి, హేమాహేమీలతో పాటు గణపతి స్థపతి, కాంగ్రెసు నాయకులు నీలంరాజు వేంకటశేషయ్య దేవాలయ ఉద్ధరణ సంఘం అధ్యక్షుడు అక్కినేని నర్సయ్య దేవాలయ అధికారి మాదిరెడ్డి మాధవరావు, అనేకమంది పురప్రముఖులతో ఆలయ ప్రాంగణమంతా సందడి నెలకొంది. ఇక వరదాచారి హడావిడి చెప్పనలవికాదు. మొరార్జీని ఆలయమర్యాదలతో, అర్చకుల మంత్రోచ్ఛరణలతో రాజగోపురం నుంచి, సాదరంగా గర్భగుడిలోకి తీసుకెళ్లి సీతారామచంద్ర లక్ష్మణ సమేత మూలవిరాట్టు దగ్గర పూజలు చేయించారు. తర్వాత గణపతి స్థపతి ఉపప్రధానిని దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తూ, శిల్పకళ గురించి వివరిస్తుంటే మర్రి చెన్నారెడ్డి దానిని హిందీలోకి తర్జుమాచేసి చెప్పారు.

భద్రాచల రామాలయం శిఖరాన ప్రతిష్ఠించిన సుదర్శనచక్రం సుమారు 8 అడుగుల ఎత్తు ఉంటుంది. ఆలయ రికార్డుల ప్రకారం, భక్తరామదాసు గోదావరిలో స్నానం చేస్తుండగా ఈ సుదర్శనచక్రం ఆయన పాదాలకు తగిలింది. దానిని బయటకు తీసి పూజలు చేయించి ఆలయ శిఖరాన ఆయన అమర్చారు. ఇప్పటికీ అదే సుదర్శనచక్రాన్ని శిఖరభాగాన చూడవచ్చు. మొరార్జీ దేశాయిని ఆ సుదర్శనచక్రం వరకు ఎక్కించే బాధ్యత నాపైన పడింది. రామాలయం ఎత్తు 32 అడుగులు. అప్పటికింకా ఆలయ సంప్రోక్షణ పూర్తికాకపోవడంతో కిందనుంచి పైకి తాటిమట్టలతో మెట్లు ఏర్పాటు చేశాం. మొరార్జీని నేను, గణపతి స్థపతి అతిజాగ్రత్తగా శిఖరంపైకి ఎక్కించాం. అక్కడ వేదపండితులు ఆయనతో సుదర్శనచక్రం మీద మంత్రజలం చల్లించి వేదోక్తంగా పూజ చేయించారు. తర్వాత మళ్లీ అంతే జాగ్రత్తగా ఆయనను కిందికి దించాం. అప్పటికిగాని పెద్దగండం గడిచినట్లు ఊపిరి పీల్చుకోలేకపోయాం. ఎంతైనా ఆయన దేశ ఉపప్రధానమంత్రి. ఏమాత్రం తేడా జరిగినా మేం ఏమైపోయి ఉండేవాళ్లమో.

మొరార్జీ దేశాయిని రామాలయం పైనున్న సుదర్శనచక్రం వరకు ఎక్కించే బాధ్యత నాపైన పడింది. ఆలయం ఎత్తు 32 అడుగులు. అప్పటికింకా ఆలయ సంప్రోక్షణ పూర్తికాకపోవడంతో కిందనుంచి పైకి తాటిమట్టలతో మెట్లు ఏర్పాటు చేశాం. మొరార్జీని నేను, గణపతి స్థపతి అతిజాగ్రత్తగా శిఖరంపైకి ఎక్కించాం. అక్కడ వేదపండితులు ఆయనతో సుదర్శనచక్రం మీద మంత్రజలం చల్లించి వేదోక్తంగా పూజ చేయించారు. తర్వాత మళ్లీ అంతే జాగ్రత్తగా ఆయనను కిందికి దించాం. అప్పటికిగాని గట్టిగా ఊపిరి పీల్చుకోలేకపోయాం. ఎంతైనా ఆయన దేశ ఉపప్రధానమంత్రి. ఏమాత్రం తేడా జరిగినా మేం ఏమైపోయి ఉండేవాళ్లమో!

తదుపరి మొరార్జీ కళ్యాణమంటపాన్ని సందర్శించారు. 1961లో గణపతి స్థపతి ఆధ్వర్యంలో మొదలైన దీని నిర్మాణం 1965లో పూర్తయింది. ఆరోజుల్లోనే దీనికి 40 లక్షలు ఖర్చయ్యాయని అంచనా. మంటప నిర్మాణానికి ఉపయోగించిన శిలలను మద్రాసు సమీపంలోని తిండివనం క్వారీనుంచి తెప్పించారు. ఈ శిలలు మైనంలాగా శిల్పుల చేతుల్లో కరిగిపోయి అద్భుతమైన శిల్పశోభను సంతరించుకున్నాయి. చుట్టూ రామాయణఘట్టాలు, వాటిపైన నాలుగు మూలల్లో నాలుగు స్తంభాలు. మధ్యలో అతిరమ్యంగా చెక్కిన కళ్యాణ పీఠం. ఈ పీఠంపైనే ప్రతి సంవత్సరం శ్రీసీతారాముల కళ్యాణం అతివైభవంగా జరుగుతుంది. పీఠం పైభాగంలో అందమైన కప్పు, ఆపై విమానం. మహత్తరమైన శిల్పకళతో విరాజిల్లే ఇంత అందమైన కళ్యాణమంటపం దేశంలోనే ఎక్కడా లేదంటే అతిశయోక్తి కాదు. మొరార్జీదేశాయి కళ్యాణమంటపంలో నిక్షిప్తమైన శిల్పకళను చూసి చాలా అబ్బురపడి గణపతి స్థపతిని అభినందించారు. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి కోరికపైన, ఆ మంటపం వద్ద అంతా గ్రూపు ఫొటో దిగారు (చిత్రంలో రాఘవమ్మగారి తలపైన కన్పడుతున్నది ఈ రచయిత).

ఆ సందర్భంగా మొరార్జీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే చిన్న సంఘటన జరిగింది. భద్రాచల గ్రామ పంచాయతీ అధ్యక్షుడి కుమార్తె శైలజ పదకొండేళ్ల బాలిక. ఏడవ తరగతి చదువుతోంది. నేతలందరూ గ్రూపు ఫొటో దిగుతున్న చోటకు ఆ బాలిక పాఠశాల యూనిఫాంలో వచ్చి మొరార్జీని ఆటోగ్రాఫ్ అడిగింది. కానీ ఆయన ఖద్దరు ధరించిన వాళ్లకు తప్ప ఇంకెవరికీ ఆటోగ్రాఫ్ ఇవ్వరట. శైలజ వేసుకున్న స్కూలుడ్రెస్సును చూసి ఆటోగ్రాఫ్ ఇవ్వడానికి నిరాకరించారు. దాంతో అక్కడే ఉన్న ఆ బాలిక తండ్రి వెంటనే ఇవతలకు వచ్చి, 'అయ్యా ఈ అమ్మాయి నా కూతురు. నేను కాంగ్రెసు కార్యకర్తను. ఖాదీ చొక్కా వేసుకున్నాను కదా. మా అమ్మాయికి ఆటోగ్రాఫ్ ఇవ్వండ'ని అభ్యర్థించాడు. అతడిని తేరిపార చూసిన మొరార్జీ, 'నీ చొక్కా ఖాదీయే, కాని ప్యాంటు ఖాదీ కాదు. అందుకే ఆటోగ్రాఫ్ ఇవ్వను' అని నిర్మొహమాటంగా చెప్పేశారు. ముఖ్యమంత్రి, మంత్రులతో సహా అక్కడున్న అందరూ ఆ నిక్కచ్చితనానికి నివ్వెరపోయారు. అదీ మొరార్జీ దేశాయి! నాటి నేతలు నమ్మిన సిద్ధాంతానికి ఏవిధంగా కట్టుబడి ఉండేవాళ్లో చెప్పడానికి ఇదో మచ్చుతునక. ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తికాని దశలో జరిగిన మొరార్జీ దేశాయి భద్రాచల యాత్ర ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా సాగిపోయినందుకు అందరం తేలికగా ఊపిరి పీల్చుకున్నాం.

■ కొప్పుల ప్రకాశం (రిటైర్డు ఇంజనీరు, హైదరాబాద్)

(నేడు మొరార్జీ దేశాయ్ వర్ధంతి)

సామాజిక సంస్కర్తల దార్శనికుడు

మహాత్మా జ్యోతీరావ్ గోవింద్ పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర లోని సతారా గ్రామంలో ఒక మాలి కుటుంబంలో గోవిందరావు, చిన్నూబాయి దంపతులకు జన్మించాడు. వీరి వృత్తి ఆనాటి పీష్వా కుటుంబానికి పువ్వులు సరఫరా చేయడం. ఆ కాలం నాటి సమాజంలోని అసమానతలు, అవిద్య, అజ్ఞానాలకు కులవైషమ్యాలు కారణమని, ముఖ్యంగా ఆనాటి సమాజంలో స్త్రీ వెనుకబాటుతనానికి, అణచివేతకు విద్యా జ్ఞానం లేకపోవడం ప్రధాన కారణం అని గ్రహించి స్త్రీ విద్య కోసం కృషి చేశారు జ్యోతీరావు పూలే. సమాజంలోని అసమానతలను పోగొట్టడానికి, అలాగే స్త్రీ, పురుషుల మధ్య లింగ వివక్షతను తొలగించడానికి ఆయన విశేషంగా కృషి చేశారు.



అమెరికాకు చెందిన థామస్ పైన్ రచించిన "ద రైట్స్ ఆఫ్ మ్యాన్" అనే గ్రంథం వల్ల ప్రభావితుడైన పూలే, ప్రపంచాన్ని మార్చగల సాధనం విద్య ఒక్కటే అని, సమాజంలోని రుగ్మతలను తొలగించడానికి ప్రజలు జ్ఞానవంతులు కావాలని ప్రగాఢంగా నమ్మాడు. మొదటగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గానూ బాల, బాలికలకు పాఠశాలలను ప్రారంభించాడు. ఆనాటి బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం పూలేని పూనా మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యుడిగా నియమించడంతో అణగారిన వర్గాల వారి హక్కుల కోసం, స్త్రీల సమానత్వం కోసం, అలాగే రైతుల సమస్యల కోసం ప్రభుత్వ పెద్దలతో రాజీలేని పోరాటం జరిపి, రాజకీయ పాలనా సమావేశాలలో ప్రజా సమస్యలపై గళమెత్తాడు.

జ్యోతీబా పూలే సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలలో అక్షర చైతన్యం నింపడానికి చేస్తున్న కృషిని గౌరవిస్తూ 1888లో ముంబాయికి చెందిన సామాజిక సంస్కర్త రావ్ బహదూర్ విఠల్ రావు కృష్ణాజీ వాండేకార్, కొంతమంది ప్రజలు కలసి 'మహాత్మా' అను బిరుదును జ్యోతీబా పూలేకి ప్రదానం చేశారు. 19వ శతాబ్దంలో జ్యోతిబా పూలే ప్రారంభించిన "అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం" అనే మహోన్నత ఆశయాన్ని 20వ శతాబ్దంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సైతం స్ఫూర్తిగా తీసుకొని కొనసాగించారు. ఆశాజనకమైన సమసమాజ నిర్మాణం జరగాలంటే ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కల్పించాలి అని పూలే విశ్వసించాడు. బానిసత్వాన్ని, కుల వివక్షతను నిశితంగా విమర్శిస్తూ పూలే రాసిన 'గులాంగిరి', 'సేద్యగాడిపై ఛర్నాకోలా' వంటి రచనల అధ్యయనం బడుగు, బలహీన వర్గాల సమాజాన్ని చైతన్యపరచి వారి ఆలోచనా విధానాన్ని ఈనాటికీ ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

విశాల మానవ ధర్మానికి సంబంధించిన అవగాహనను ఆనాటి సమాజంలో కలిగించడానికి 'సత్య శోధక్ సమాజం' అనే సంస్థను ఏర్పాటు చేసి "మనమంతా దేవుని సంతానం, దేవుని దృష్టిలో మనందరం సమానం. ఈ భేద భావాలు మనం సృష్టించుకొన్నవే" అని పేర్కొంటూ నిర్బంధ విద్య, స్వదేశీ భావన, నిరాడంబరతని అలవర్చేందుకు సత్యశోధక సమాజం ఎంతో అవసరమని... ఇవే ఈ సంస్థ లక్ష్యాలు అని పూలే ప్రకటించాడు. ధనుంజయ్ కీర్ రచించిన పూలే జీవితచరిత్రలో "సామాజిక విప్లవాల పితామహుడిగా" మహాత్మా జ్యోతీరావ్ పూలేను అభివర్ణించాడు. పూలే ప్రజాస్వామిక వ్యవస్థను అభిలషించాడు. మూఢవిశ్వాసాలను వ్యతిరేకించాడు. వైదిక హిందూ ఆధిక్యతావాదాన్ని విమర్శించాడు. పూలేయిజం లోని ప్రాథమిక అంశం మానవతావాదం. పూలే ప్రపంచ పౌరహక్కుల, మానవ హక్కుల ఉద్యమ నిర్మాతల్లో, సిద్ధాంతకర్తల్లో ఒకరు. తన జీవితాన్నే ప్రజాసేవకై అర్పించిన యోధుడు మహాత్మా జ్యోతీబా పూలే... 1890 నవంబర్ 28న పూణేలో మరణించాడు. సామాజిక సమానత్వం, సమరసత కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతీబా పూలే ఆలోచనలను ఆచరిస్తూ, ఆయన ఆశయాలను సాధించడమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి.

– గోవిందు సురేంద్ర
చరిత్ర అధ్యాపకులు

(రేపు జ్యోతీబా పూలే జయంతి)

రాజకీయం పేరుతో మతోన్మాద శక్తులకు సహకరించాలా?

'ఈ దానవ పాలన అంతానికి సహకరిద్దాం కామ్రేడ్స్' అనే వ్యాసాన్ని సి. మేఘనాథ రెడ్డి మార్చి 27న ఆంధ్రజ్యోతిలో రాశారు. స్థూలంగా ఆయన చెప్పదల్చుకున్నది ఏమిటంటే రాష్ట్రం లోని జగన్మోహన్ రెడ్డి పాలనను అంతం చేయడానికి కమ్యూనిస్టులు కూడా ఎన్డీయేతో జత కట్టాలని. ఆయన తాను చెప్పదలుచుకున్న విషయాన్ని స్పష్టంగానే అందులో పేర్కొన్నారు. కానీ ఆయన మొత్తం వ్యాసంలో ఉద్దేశపూర్వకంగానో లేదా పొరపాటునో ఒక ప్రధానమైన విషయాన్ని కనీసంగా కూడా ప్రస్తావించలేదు. అదేమిటంటే ఈరోజు బీజేపీ వలన భారతదేశం ఎదుర్కొంటున్న మతోన్మాద ప్రమాదం.

ఈ ప్రమాదాన్ని ఎదుర్కోగలిగే శక్తి మన దేశంలో కమ్యూనిస్టులకు మినహా మిగిలిన ఏ పార్టీలకూ లేదు. ఈరోజు దేశంలో ఒకపక్క నరేంద్ర మోదీ ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతూ మరోపక్క కార్పొరేట్ సేవలో మునిగి తేలుతోంది. ఈ కలయిక దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారింది. దేశ సంపదలు లూటీ అవుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతున్నారు. ప్రకృతి వనరులన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారు. మోదీ ప్రభుత్వ ఈ విధానాల వల్ల దేశంలో గతంలో ఎన్నడూ లేనంతగా ఆర్థిక అసమానతలు పెరిగాయి. నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. కార్పొరేట్ వ్యవసాయాన్ని మోదీ ప్రభుత్వం పెంచి పోషిస్తోంది. మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి మోదీ ప్రభుత్వం జైళ్ళల్లో కుక్కుతోంది. ఈడీ, సీబీఐ, ఇన్‌కం టాక్స్ వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరుస్తూ పెద్ద ఎత్తున రాజకీయ ప్రత్యర్థుల మీద దాడి చేయడం, ఇతర రాజకీయ పార్టీల్లో ఉన్నవారిని లొంగ తీసుకోవడం, ఎన్నికల బాండ్ల రూపంలో భారీగా నిధులు వసూలు చేసుకోవడం వంటి చర్యలను తాజాగా చూసాం. భారీగా సేకరించిన ఈ నిధులతో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూలుస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది.

75 సంవత్సరాల క్రితం రూపొందించుకున్న రాజ్యాంగం సైతం నేడు మోదీ–షా ప్రభుత్వానికి కంటగింపుగా ఉంది. రాజ్యాంగం పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, సౌభ్రాతృత్వం, లౌకికతత్వం... వీటన్నిటికీ తూట్లు పొడుస్తూ రాజ్యాంగ మౌలిక సూత్రాలనే అపహాస్యం చేస్తోంది. రాష్ట్రాల హక్కులను కుదిస్తూ ఫెడరల్ వ్యవస్థనే సవాలు చేస్తోంది. గవర్నర్ల వ్యవస్థను ఉపయోగించుకొని రాష్ట్రాల హక్కులను అణగదొక్కాలని చూస్తున్నది. కార్మిక హక్కులు హరించేలా చట్టాలను సవరించింది. రైతుల నడ్డి విరిచేలా మూడు నల్ల చట్టాలను చేసింది. పెద్ద ఉద్యమం దరిమిలా మొక్కుబడిగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించినా ఆచరణలో వాటినే అమలు చేస్తోంది. చివరికి మనం తినే తిండి, మన వేష భాషలు, పండుగలు సైతం ఎలా ఉండాలో శాసిస్తున్నది. వినకుంటే అమాయకులపై దాడులు జరుగుతున్నాయి. మహిళల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బకొట్టే విధంగా వారు అణిగి మణిగి ఉండాలన్న వ్యాఖ్యలు ఎక్కువవుతున్నాయి.

మణిపూర్‌లో మారణ హోమాన్ని పెంచి పోషిస్తోంది ఈ ప్రభుత్వం. సభ్య సమాజం తలదించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగించినా దేశ ప్రధానికి కనీసం ఖండించడానికి కూడా సమయం దొరకలేదు. మహిళా మల్లయోధులు తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ పార్టీ ఎంపీపై చర్య తీసుకోమని ఎంత పోరాడినా, దాన్ని అణచివేసింది కానీ ఆ ప్రబుద్ధుడిపై మాత్రం ఏ చర్యా తీసుకోలేదు. నారీ శక్తి, బేటి బడావో వంటి మోసపూరిత నినాదాల మాటున మహిళలపై అత్యాచారాలు పెరుగుతూనే ఉన్నాయి.

స్వతంత్ర భారతదేశంలో ఎన్నడూ లేనంత ప్రమాదాన్ని మోదీ ప్రభుత్వ పదేళ్ల కాలంలో దేశం ఎదుర్కొంటున్నది. ఇంతటి ప్రమాదం కమ్మేస్తున్నా సి. మేఘనాధరెడ్డికి ఇదేమీ కనపడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పైగా ఆయన కమ్యూనిస్టులు ఎన్డీయే కూటమికి సహకరించాలనడం ఇంకా విడ్డూరం.




మరో పక్క అయోధ్య తోనే ఆపకుండా మసీదులు కూల్చడం, దేవాలయాలు నిర్మించడమే తన ప్రధాన ఎజెండాగా, ఎన్నికల అస్త్రాలుగా ఎంచుకుంది. ఒక్క మాటలో చెప్పాలంటే స్వతంత్ర భారత దేశంలో ఎన్నడూ లేనంత ప్రమాదాన్ని మోదీ ప్రభుత్వ పదేళ్ల కాలంలో దేశం ఎదుర్కొంటున్నది. ఇంతటి ప్రమాదం కమ్మేస్తున్నా సి. మేఘనాధరెడ్డికి ఇదేమీ కనపడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పైగా ఆయన కమ్యూనిస్టులు ఎన్డీయే కూటమికి సహకరించాలనడం ఇంకా విడ్డూరం.

మన రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంతా కాదు. ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ – ఇవన్నీ పార్లమెంటు సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చిన హామీలు. వీటిలో ఏ ఒక్కదానినీ అమలు చేయలేదు. పైగా రాష్ట్రానికి ఆయువుపట్టు లాంటి విశాఖ ఉక్కును అదానీకో, జిందాల్‌కో, మరో కార్పొరేట్ రాబందుకో కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర చేస్తున్నది. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీ ప్రభుత్వంతో పొత్తు పెట్టుకోవడం ద్వారా తెలుగుదేశం, జనసేనలు ఆ ద్రోహంలో భాగస్వాములైనట్లే! ఏ రకంగా చూసినా ఇది ఇది దగా కూటమే. ఆ ఊబిలో కమ్యూనిస్టులను కూడా దిగమనడం హాస్యాస్పదం. అలాంటి తప్పు కమ్యూనిస్టులు ఎన్నడూ చేయరు. మతోన్మాదం, కార్పొరేట్ ఉమ్మడి ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో అసలైన దేశ భక్తులుగా కమ్యూనిస్టులు అగ్ర భాగాన ఉంటారు.

కమ్యూనిస్టులు కేరళలో ముస్లిం లీగ్‌తో కలిశారని సి. మేఘనాధరెడ్డి ఒక అవాస్తవాన్ని రాశారు. కేరళ ఎల్‌డిఎఫ్‌లో ముస్లిం లీగ్‌ను ఎన్నడూ చేర్చుకోలేదు. బహుశా ఆయనకు ఈ విషయం తెలియదేమో! అలాగే కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఒకరిపై మరొకరు పోటీ చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇది వాస్తవమే. అయితే ఇలా చేయడం ద్వారానే బీజేపీకి అక్కడ అడుగుపెట్టడానికి అవకాశం ఏర్పడదు. దీనిపై సీపీఎం ప్రధాన కార్యదర్శి పత్రికా ముఖంగానే మంచి వివరణ ఇచ్చారు. ఒకసారి చదవడం మంచిది. సీపీఎం వ్యూహం, ఎత్తుగడలు గురించి కూడా మేఘనాధరెడ్డి ప్రస్తావించారు. కమ్యూనిస్టుల లక్ష్య సాధనకు దేశంలో ప్రజాస్వామ్యం కాపాడుకోవడం అవసరం. ఇదే వ్యూహం. దీనికనుగుణంగానే ఎత్తుగడలూ ఉంటాయి. నాడు ఇందిరా గాంధీ ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాటంలో సీపీఎం అగ్రభాగాన ఉండి, అనేక త్యాగాలు చేసింది. నేడు మోదీ నియంతృత్వ పోకడలను నియంత్రించడానికి కూడా అవే ఎత్తుగడలు. అగ్ర భాగానే కమ్యూనిస్టులు ఉంటారు.

దీనర్థం నిరంకుశ వైసీపీకి మద్దతు ఇస్తున్నట్లు కాదు. ఎన్డీయేను, వైసీపీని ఓడించాలని, ఇండియా కూటమికి అండగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు కమ్యూనిస్టు పార్టీలు సీపీఎం, సీపీఐ ఇప్పటికే పిలుపునిచ్చాయి. బహుశా మేఘనాధరెడ్డికి ఇది తెలియదేమో! వాస్తవంగా జగన్ ప్రభుత్వ విధానాలపై రోడ్లపైకి వచ్చి పోరాడింది కమ్యూనిస్టులు మాత్రమే. విభజన చట్టంలో పొందుపర్చిన ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని, పోలవరం నిర్వాసితులకు చట్టం ప్రకారం హక్కులు కల్పించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, విశాఖలో పేదల నుండి భూములు ల్యాండ్ పూలింగ్ పేరుతో లాక్కోవాలని చూస్తే బాధితులకు అండగా నిలబడి కోర్టుకు వెళ్ళి వారి పక్షాన నిలిచింది. చివరికి ముఖ్యమంత్రి ఏ జిల్లా పర్యటనకు వెళ్ళిన ముందుగా సీపీఎం నాయకులను, కార్యకర్తలనే లక్ష్యంగా చేసుకుని నిర్బంధించి అరెస్టులు చేస్తున్నారు. సీపీఎస్, పీఆర్సీ, కార్మిక హక్కులు వంటి అనేక సమస్యలపై జగన్ ప్రభుత్వంతో ఢీకొన్నది కమ్యూనిస్టులే అన్నది వ్యాస రచయితకు తెలిసే ఉంటుంది. బీజేపీ ధృతరాష్ట్ర కౌగిలి నుంచి టీడీపీ, జనసేన ఇప్పటికైనా బయట పడడం రాష్ట్రానికి, దేశానికి శ్రేయస్కరం.

● కె. లోకనాథం
సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
బుధవారం 10 ఏప్రిల్ 2024



వంగవీటితో చిన్ని తెలుగుదేశం కూటమి నుంచి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, టీడీపీ స్టార్ క్యాంపెయినర్ వంగవీటి రాధను ఆయన నివాసంలో మంగళవారం భేటీ అయ్యారు. స్టార్ క్యాంపెయినర్‌గా రాష్ట్రమంతా సేవలు అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

వసంతం.. వైభవం


రథోత్సవం

దుర్గమ్మ దేవస్థానంలో నవ వసంతం మొదలైంది. తొమ్మిది రోజులపాటు జరిగే పుష్పార్చనలు మంగళవారం ఉగాది పర్వదినాన మొదలయ్యాయి. వేదపండితులు అమ్మవారికి తొలిరోజు మల్లెలు, మరువంతో అర్చించారు. పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను వన్‌టౌన్‌లో వెండి రథంపై ఊరేగించారు. వాయిద్యాలు, కళాకారుల విన్యాసాలు, భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం వైభవంగా సాగింది.


పుష్పార్చన

ఆ ఇద్దరినీ మార్చేస్తారా?

మైలవరం, విజయవాడ పశ్చిమ వైసీపీ అభ్యర్థులను మార్చేందుకు రంగం సిద్ధమవుతుందా? వారి స్థానంలో సామాజికంగా ఆర్థికంగా బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు వైసీపీ పెద్దలు మంతనాలు చేస్తున్నారా? జరుగుతున్న పరిణామాలను చూస్తే ఔననే సమాధానం వస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులు బరిలో నిలవకుండా వెనకడుగు వేయడం.. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల బలం ముందు వైసీపీ అభ్యర్థుల బలం సరిపోకపోవడంతో 15 నుంచి 20 మంది అభ్యర్థులను మార్చాలని వైసీపీ పెద్దలు భావిస్తున్నారు. అందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం, విజయవాడ పశ్చిమ అభ్యర్థులనూ మార్చాలని వారు భావిస్తున్నట్లు సమాచారం.


షేక్ ఆసిఫ్


సర్నాల తిరుపతిరావు

మైలవరం, విజయవాడ పశ్చిమ వైసీపీ అభ్యర్థులపై డైలమా

- ప్రత్యర్థులను ఎదుర్కోలేరని భావిస్తున్న వైసీపీ పెద్దలు
- దీటైన అభ్యర్థుల కోసం అన్వేషణ

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో చివరి వరకు ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరన్న అంశంపై వైసీపీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. విజయవాడ పశ్చిమానికి షేక్ ఆసిఫ్‌ను ప్రకటించారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో ప్రచారం కూడా చేసుకుంటున్నారు. జనసేన నుంచి పోతిన మహేశ్ ఆశించిన ఈ స్థానాన్ని పొత్తుల చర్చల్లో భాగంగా బీజేపీకి కేటాయించడంతో సీను మారిపోయింది. కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా సుజనాచౌదరి రంగంలోకి దిగారు. సుజనా ముందు ఆసిఫ్ సరిపోడని వైసీపీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు పోతిన మహేశ్ వైసీపీ పంచన చేరేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో చివరి నిమిషంలో ఆసిఫ్ స్థానంలో మరొకరు బరిలో నిలిచే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

మైలవరందీ అదే దారి..

మైలవరానికి వైసీపీ అభ్యర్థిగా సర్నాల తిరుపతిరావును ప్రకటించారు. ఈయన చివరి వరకు బరిలో ఉండటం అనుమానమేనని సొంత పార్టీ శ్రేణులే అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న వసంత కృష్ణ ప్రసాద్‌ను తిరుపతిరావు ఎంత వరకు ఎదుర్కోగలడనే చర్చ జరుగుతోంది. సర్నాల జెడ్పీటీసీకే ఎక్కువన్న భావనలో వైసీపీ శ్రేణులే ఉన్నాయి. రాజకీయంగా కూడా సర్నాలకు ఎమ్మెల్యే స్థాయి లేదన్నది స్థానిక నాయకుల భావన. అందుకే ఇక్కడ సర్నాల కన్నా నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన వారే ప్రస్తుతానికి చక్రం తిప్పుతుండటం గమనార్హం. కొద్ది రోజుల క్రితం నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న వ్యక్తి చేతివాటం ప్రదర్శించడంతో ఆయన్ను మార్చేసి వేరే వారిని నియమించారు. మైలవరం నియోజకవర్గానికి తొలి విడతగా రూ.12 కోట్ల నగదును పంపగా ఆ మొత్తంలో రూ.6 కోట్ల వరకు వలంటీర్లు, మహిళా సంఘాలు ఇతరులకు కానుకలు, కాసుల పంపిణీకి వినియోగించామంటూ లెక్కలు రాసి సుమారు రూ.2 కోట్లు వరకు గోల్‌మాల్ చేయడంతో ఆ పరిశీలకుడిపై వేటు వేసి కొత్త పరిశీలకుడిని తెచ్చారు. పరిశీలకులు ఏం చేస్తున్నారన్న అవగాహన కూడా లేకుండా సర్నాల వ్యవహరిస్తున్నారని అప్పట్లోనే వైసీపీ పెద్దలు సీరియస్ అయ్యారు. తనపై నిఘా కోసం నియమించిన వారిని తాను ఎలా పర్యవేక్షించగలనని సర్నాల సన్నిహితుల వద్ద వాపోయారు. ఏదేమైనా వసంతను ఎదుర్కొనే స్థాయి, రాజకీయ చతురత సర్నాలకు లేదని వైసీపీ పెద్దలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారిని బరిలోకి దించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.


ప్రజాసంకల్ప యాత్రలో బాలశౌరి, బుద్ధప్రసాద్

అట్టహాసంగా...

- కూటమి అభ్యర్థులు ప్రజా సంకల్పయాత్ర
- చల్లపల్లిలో బాలశౌరి, బుద్ధప్రసాద్‌కు స్వాగతం

- 6లో..


చల్లపల్లిలో నేతలపై పూల వర్షం

సామాజిక మాధ్యమాలపై నిఘా ఏది?

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) డిజిటల్ మీడియా విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. వాట్సాప్ గ్రూపులు, ఈ గ్రూపుల సమూహంతో కలగలిసిన కమ్యూనిటీ గ్రూపుల వేదికగా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరుగుతున్నాయి. పలు సోషల్ మీడియా, డిజిటల్ మీడియా మాధ్యమాల్లోనూ ఇలాంటి ఉల్లంఘనలు జరుగుతున్నాయి. వీటిని వైసీపీ నేతలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇప్పటికైనా వాట్సాప్, సోషల్ మీడియాలో జరుగుతున్న అనధికారిక ప్రచారాలపై జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వాట్సాప్ గ్రూపులలో విద్వేషపూరిత పోస్టులు

- కోడ్‌కు విరుద్ధంగా దురుద్దేశాలతో పోస్టులు
- వలంటీర్ల వ్యక్తిగత గ్రూప్‌లతో నియోజకవర్గ కమ్యూనిటీ గ్రూపులు
- ఈ గ్రూపులలో వైసీపీ సోషల్ మీడియా నిర్వాహకులే అడ్మిన్లు
- ఫేక్ న్యూస్‌ను వ్యాప్తిచేస్తున్న అడ్మిన్లు..
- ఎంసీఎంసీ దృష్టి సారించాలి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా ప్రైవేటుగా తమ క్లస్టర్ల పరిధిలోని వారితో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయించారు.

- మిగతా 6లో

ఆర్టీసీ ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చాన్స్

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 5500 మంది ఉద్యోగులకు అవకాశం
- గుర్తింపు సంఘం ఎన్ఎంయూ లేఖతో స్పందించిన ఎన్నికల సంఘం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు ఆదేశాలు జారీ చేసిన ఈసీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆర్టీసీ ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం నుంచి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు వచ్చాయి. కృష్ణాజిల్లాతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. విలీనమైనప్పటి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో అంతర్భాగం. ఆర్టీసీ ఉద్యోగులు చాలా స్వల్ప సంఖ్యలోనే ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. పోలింగ్ కేంద్రాలకు బస్సులు నడిపే సిబ్బంది తప్ప మిగిలిన వారికి ఎన్నికల డ్యూటీలు ఉండవు. కానీ, ఆపరేషనల్ విభాగం కాబట్టి డ్రైవర్లు, కండక్టర్లు దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో డ్యూటీలు చేస్తుంటారు. వీరితో పాటు అవసరాలను బట్టి మెకానిక్ సిబ్బంది, ఆఫీసు సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉంటుంది. ఆపరేషనల్ విభాగం కాబట్టి సొంత ప్రాంతాలకు దూరంగా ఉంటారు. ఎన్నికలకు ముందుగానే వీరంతా డ్యూటీలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూర్ యూనిటీ (ఎన్ఎంయూ) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వైశ్రీనివాసరావు రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఎన్ఎంయూ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఎన్నికల సంఘం ఈ అంశాలన్నింటినీ పరిశీలించి ఆర్టీసీ ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించింది. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపుగా 5500 మందికిపైగా ఆర్టీసీ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే అవకాశం ఉంది.

గ్లాసుకు బాసెవరు?

జనసేన నగర అధ్యక్షుడి నియామకంపై కసరత్తు

జనసేన

- పోతిన వ్యవహారశైలితో వెళ్లిపోయిన పలువురు నేతలు
- తిరిగి జనసేనలోకి వచ్చేందుకు నిర్ణయం
- పోతిన వన్‌మన్ షో చేశారంటున్న పార్టీ నేతలు
- అధినాయకులపై వ్యతిరేక పోస్టులు చేసిన వారికి పదవులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : జనసేన నగర అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారు? ప్రస్తుతం ఉన్న వారిలో సమర్థులను ఎంపిక చేస్తారా? కొత్త వారికి అవకాశం ఇస్తారా? జనసేనలో ప్రస్తుతం నడుస్తున్న చర్చ ఇది. నగర అధ్యక్షుడిగా ఉన్న పోతిన మహేశ్ ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మహేష్ రాజీనామా వల్ల పార్టీకి వచ్చిన నష్టం ఏమీ లేదని పలువురు నేతలు చెబుతున్నారు. మహేశ్ నిర్ణయాలు, విధానాల కారణంగా బయటకు వెళ్లిపోయిన నేతలు ఇప్పుడు తిరిగి పార్టీలోకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గం నుంచి ఒక ప్రముఖ నాయకుడిని పార్టీలోకి ఆహ్వానించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రయత్నాలు మొదలైనట్టు తెలుస్తోంది. ఆయనను పవన్ కల్యాణ్ వద్దకు త్వరలో తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఆయనకు నగర అధ్యక్షుడి పదవిని కట్టబెడితే బాగుంటుందన్న అభిప్రాయాన్ని కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. ఇక పార్టీ కార్యాలయాన్ని మూడు నియోజకవర్గాలకు మధ్యలో ఉండేలా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

వన్‌మన్ షో

పోతిన మహేశ్ పార్టీలో చేరినప్పటి నుంచి వన్‌మన్ షో ప్రదర్శిస్తూ వచ్చారు. నగర కమిటీ అధ్యక్షుడిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పదవులను నిర్వహించారు. పార్టీ కార్యాలయాన్ని తన ఇంట్లో ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు అన్నీ అక్కడే నిర్వహించేవాడని, ఇతర నాయకులకు ఎలాంటి సమాచారం ఇచ్చేవాడు కాదని పార్టీలో ఉన్న నేతలు చెబుతున్నారు. పోతిన మహేశ్ వ్యవహారశైలి దారుణంగా ఉండడంతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కంకణం కట్టుకున్న నేతలు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోయారు. వాస్తవానికి రాష్ట్ర అధికార ప్రతినిధి పదవిని పశ్చిమ నియోజకవర్గంలో ఆకుల కిరణ్‌కు ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మహేశ్ ఆ పదవిని తనకు దక్కేలా చేసుకున్నాడు. ఈ విషయంలో పార్టీలో ఉండే ఒక కీలక నేత పోతినకు బాగా సహకరించాడని చెబుతున్నారు. పార్టీలో ఎలాంటి ప్రాధాన్యం లేకపోవడంతో కిరణ్ తర్వాత బీజేపీలోకి వెళ్లిపోయారు. పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నేతకు జిల్లా అధికార ప్రతినిధి పదవిని ఇచ్చారు. తర్వాత ఆ పదవిని మహేశ్ రద్దు చేసి, డివిజన్ పదవిని ఇచ్చినట్టు తెలిసింది. విజయవాడ నగరంలో మొత్తం మూడు నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, ఎదుగుదలపై మహేష్ ఏనాడు పట్టించుకోలేదు. రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర కమిటీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ తన కార్యాలయం దగ్గరే నిరసనలు, సమావేశాలు నిర్వహించేవాడు. నగరంలో ఉన్న 64 డివిజన్లకు కమిటీలను ఏర్పాటు చేసినా, ఆ కమిటీలతో ఇప్పటి వరకు ఎలాంటి సమీక్షలు చేయలేదని చెబుతున్నారు. నగరంలో ఉన్న ఇతర నేతలతో ఎలాంటి సంప్రదింపులూ లేకుండానే అన్నీ సొంతంగా నిర్ణయాలు తీసుకునేవాడని పార్టీ నేతలు ఇప్పుడు స్పష్టం చేస్తున్నారు. ఇతర నేతలకు ఎలాంటి గుర్తింపు రాకుండా చేసి తానే పార్టీ అన్న బిల్డప్‌ను మహేశ్ చేసుకున్నాడని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. జనసేనలో ఉంటూనే మహేశ్ వైసీపీకి కోవర్టుగా వ్యవహరించాడని ఆరోపిస్తున్నారు.

పోస్టింగ్ పెడితే పదవి

పశ్చిమ నియోజకవర్గ సీటు కోసం మహేశ్ మొదటి నుంచి ఆశపడ్డారు. చివరికి కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి సుజనాచౌదరి రంగంలోకి దిగారు. అయినా సీటు కోసం విశ్వప్రయత్నాలు చేశారు. మహేశ్ అనుచరులుగా ఉన్న కొందరు సామాజిక మాధ్యమాల్లో జనసేన పార్టీ అధినాయకులను దూషిస్తూ పోస్టులు పెట్టారు. అటువంటి వారికి డివిజన్ అధ్యక్షుడి బాధ్యతలను అప్పగించినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో ఈ తరహా పదవులు బాగా ఇచ్చినట్టు నేతలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పోస్టింగ్‌లు ఏంటని అడిగిన ఒక నాయకుడుపై కొద్దిరోజుల క్రితం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్టు సమాచారం.

వైసీపీ హైడ్రామా!

బందరు తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద నేతల ఓవరాక్షన్

- పార్టీ కార్యకర్తలను కొట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఆందోళన
- స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులను బెదిరించిన పేర్ని నాని



తాలూకా పోలీస్ స్టేషన్‌వద్ద ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు పోలీస్ వ్యవస్థను జేబు సంస్థగా మార్చుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అధికారపార్టీ కార్యకర్తలు దాడులు చేసినా కేసులు కట్టకుండా పక్కదారి పట్టించేలా పోలీస్ అధికారులను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. ఏ కేసు నమోదు చేయాలో, ఏ కేసును నీరుగార్చాలో తెర వెనుకుండి కథ నడిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక పోలీసుల వద్ద తమ ప్రాభల్యం తగ్గడంతో దానిని నిలబెట్టుకునేందుకు వైసీపీ నాయకులు ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్నారు. బందరు మండలం పోతేపల్లి పంచాయతీ శివారు ఉల్లిపాలెంలో తరచూ జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉల్లిపాలెంలో తరచూ గొడవలకు పాల్పడుతున్న వైసీపీ కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు పిలి పించి పోలీసులు తమదైన శైలిలో విచారణ చేస్తే తమ కార్యకర్తలనే కొడతారా? అంటూ మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని వైసీపీ కార్యకర్తలతో కలిసి మంగళవారం తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. వైసీపీ కార్యకర్తలను కొట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేయించారు. ఇంతకాలంగా తమను అన్నివిధాలుగా వాడుకున్న అధికారపార్టీ నాయకులు ఇంతలోనే తమ ధోరణిని మార్చేయడంతో పోలీసులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని రోజులుగా గొడవలు

బందరు మండలం పోతేపల్లి పంచాయతీ పరిధిలోని ఉల్లిపాలెంలో కొంతకాలంగా వైసీపీ కార్యకర్తలు తరచూ టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారు. ఇటీవల కాలంలో వైసీపీ మచిలీపట్నం నియోజకవర్గం అభ్యర్థి పేర్ని కిట్టుకు చెందిన ఫ్లెక్సీని చించివేశారనే కారణంతో రెండు రెండు కార్లలో వెళ్లిన వైసీపీ కార్యకర్తలు యశ్వంత్ అనే యువకుడిని ఇంటి నుంచి బయటకు పిలిపించి మరీ దాడి చేశారు. అంతటితో ఆగకుండా తమ కారులో ఎక్కించుకుని గ్రామం బయటకు తీసుకువెళ్లి దాడి చేశారు. అనంతరం చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో యువకుడిని అప్పగించారు.

- మిగతా 6లో

స్వగ్రామానికి తల్లీకూతుళ్ల పార్థివదేహాలు

- కొణకంచిలో విషాదచాయలు

- 6లో..



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-24 (బుధ)



మరువంతో అర్చనలు అందుకున్న దుర్గమ్మ ఉత్సవ మూర్తి



పూల బుట్టలు తీసుకువస్తున్న ఈవో దంపతులు



హైకోర్టు న్యాయమూర్తులకు అమ్మవారి చిత్రపటాలు అందజేస్తున్న ఈవో



పంచాంగ పఠనం చేస్తున్న కప్పగంతు సుబ్బరామసోమయాజి



ధర్మపథం వేదికపై ఉగాది కవి సమ్మేళనం

వసంతం.. వైభవం

» దుర్గగుడిలో చైత్రమాస వసంత నవరాత్రులు ప్రారంభం

» తొలిరోజు మల్లెపూలు, మరువంతో అర్చన

» పంచాంగ పఠనం చేసిన కప్పగంతు సుబ్బరామ సోమయాజి



వన్‌టౌన్, ఏప్రిల్ 9 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం దుర్గమ్మకు ప్రత్యేక పుష్పార్చనలు ప్రారంభమయ్యాయి. చైత్రమాస వసంత నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి తొలిరోజున మల్లెలు, మరువంతో అర్చన చేశారు. వేకువజామున పుష్పాలతో మేళతాళాలు, వేదమంత్రాల మధ్య ఈవో రామారావు దంపతులు, అధికారులు, అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తి వద్దకు తరలివచ్చి సర్వ మానవాళికి క్షేమ, స్థైర్య ఆయురారోగ్యం కలగాలని సంకల్పం చెప్పారు. దుర్గమ్మవారికి, ఉపాలయాలలో కొలువై ఉన్న దేవతామూర్తులకు ఉగాది సందర్భంగా స్నపనాది కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి దుర్గమ్మ సర్వదర్శనానికి అనుమతించారు. ధర్మపథం వేదికపై కప్పగంతు సుబ్బరామ సోమయాజి పంచాంగ శ్రవణం గావించారు. క్రోధి నామ సంవత్సర ఫలితాలను సోదాహరణగా వివరించారు. ఈ సందర్భంగా దేవస్థానం పంచాంగాన్ని దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావులు ఆవిష్కరించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తులు సుజాత, జ్యోతిర్మయిలు దర్శించుకున్నారు. జస్టిస్ సుజాత అమ్మవారి పుష్పార్చనలో పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రామారావు వారికి సాదర స్వాగతం పలుకగా.. వేదపండితులు అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

వెండి రథోత్సవం

ఉగాది సందర్భంగా గంగాపార్వతి, మల్లేశ్వరుల ఉత్సవ మూర్తులను వెండి రథంపై ఊరేగించారు. వన్‌టౌన్ వీధుల్లో తప్పెట వాయిద్యకారుల విన్యాసాలు, భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం సాగింది.

దుర్గగుడిలో ఉగాది కవి సమ్మేళనం

దుర్గగుడిలో ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం కవిసమ్మేళనం జరిగింది. ప్రకృతి, పరమేశ్వరి, వసంతం, కాలశక్తి అంశాలపై కవులు తమదైన శైలిలో కవితా పుష్పాలను పూయించారు. డాక్టర్ కప్పగంతు రామకృష్ణ సారథ్యంలో పింగళి వెంకటకృష్ణారావు, జేవీ చలపతిరావు, కానుకొల్లు బాలకృష్ణ, వలివేటి శివరామకృష్ణ, పంచాగ్నుల కృష్ణవేణి, యూవీ రమణమూర్తి, దండిభొట్ల దత్తాత్రేయశర్మ, పి సత్యశైలజ పాల్గొన్నారు. అనంతరం కవిపండితులను సత్కరించారు.



పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితుడు వెంకటేశ్వరరావు

'కృష్ణా మిల్క్'లో ఉగాది వేడుకలు

చిట్టినగర్, ఏప్రిల్ 9 : కృష్ణా మిల్క్ యూనియన్ (విజయడెయిరీ)లో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గజల్ శ్రీనివాస్, చైర్మన్ చలసాని ఆంజనేయులు, వెంకటేశ్వరరావులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, భవిష్యత్‌లో యూనియన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, పాడిరైతులు, వినియోగదారులు, ఏజెంట్‌లు, సమితి అధికారులకు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భగవంతుని కోరినట్టు చెప్పారు. అనంతరం పురోహితులు వెంకటేశ్వరావు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, చలసాని చక్రపాణి, దాసరి వెంకట బాలవర్ధనరావు, ఉయ్యూరు అంజిరెడ్డి, ఆర్గా వెంకట నగేష్, పల్లగాని కొండలరావు, పాలడుగు వెంకటరామ వరప్రసాద్, ట్రస్టు సభ్యులు, సమితి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



సిపూడిలో ప్రచార కార్యక్రమంలో వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తా

» టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, ఏప్రిల్ 9 : భవిష్యత్‌లో తెలుగుదేశం పార్టీ రాజ్యాధికారం చేపట్టబోతుందని గుడివాడ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం సిపూడి, కాశిపూడి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి చేపట్టగానే గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. బీసీ, ఎస్సీ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీసీల అభ్యున్నతికి పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతీ ఓటరు తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, సిపూడి, కాశిపూడి నాయకులు గొర్రిపర్తి సుబ్బారావు, నీలపాల శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై నిఘా ఏది?

(5వ పేజీ తరువాయి)

ఈ గ్రూపుల్లో వలంటీర్‌కు నిర్దేశించిన 50 కుటుంబాలకు చెందిన సభ్యుల నెంబర్లు యాడ్ అయి ఉంటాయి. స్మార్ట్ ఫోన్ కలిగిన వారందరి నెంబర్లు ఈ గ్రూపులలో యాడ్ అయి ఉంటాయి. ఇలా ఆ గ్రామం, వార్డుల పరిధిలోని వలంటీర్ల కాంటాక్ట్‌లతో కలిపి ఒక మెయిన్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఇలా ఆయా గ్రామాలు, వార్డులతో కూడిన మెయిన్ గ్రూపులన్నింటినీ కూడా నియోజకవర్గ స్థాయిలో కమ్యూనిటీ గ్రూప్ పరిధిలోకి తీసుకువచ్చారు. కమ్యూనిటీ గ్రూపులో ఒక నోటిఫికేషన్ ఇస్తే.. వలంటీర్ల క్లస్టర్ పరిధిలోని ప్రతి ఒక్కరికీ మెసేజ్ వెళుతుంది. ఈ గ్రూపులను వైసీపీ సోషల్ మీడియా విభాగం నిర్వహిస్తోంది. ఈ గ్రూపుల్లో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వైసీపీ తరఫున అనుకూల ప్రచారం నిర్వహిస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ముందు వరకు ఇలాంటి ప్రచారాలకు ఆయా పార్టీలు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే వీటన్నింటినీ అడ్వర్టయిజ్‌మెంట్లుగా భావించి ఆయా రాజకీయ పార్టీల ఖర్చులో చూపించాల్సి ఉంటుంది. నామినేషన్ల తర్వాత కూడా ఇలాగే ఉంటే.. అభ్యర్థుల ఖర్చులో చూపాల్సి ఉంటుంది. వైసీపీ కనుసన్నల్లో నడుస్తున్న ఈ గ్రూపులలో ప్రవర్తనా నియమావళి కింద వివాదాస్పద పోస్టులు, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు వస్తున్నాయి.

గ్రూపు అడ్మిన్లదే బాధ్యత

ఫేక్ న్యూస్ కూడా ప్రబలుతోంది. వ్యక్తిగతంగా వివిధ రాజకీయ పక్షాల నేతలు, వారి కుటుంబసభ్యులపై దాడి జరుగుతోంది. కాబట్టి ఇలాంటి ప్రవర్తనా నియమావళి అంశాలకు సంబంధించి ఆయా గ్రూప్ అడ్మిన్లను బాధ్యులను చేసి విచారణ జరిపితేనే వీటికి అడ్డుకట్ట పడుతుంది. ఒక గ్రూపులో పదిమంది వరకు కూడా అడ్మిన్లు ఉంటున్నారు. అలాంటపుడు అడ్మిన్లందరినీ విచారించాల్సిన అవసరం ఉంది. గ్రూపులలో ఏ పోస్టులు ఎవరు పెట్టినా అడ్మిన్లదే బాధ్యత అవుతుంది. తమ గ్రూపులలో ఎలాంటి పోస్టులను పోస్ట్ చేస్తున్నారో అడ్మిన్లే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. వివాదాస్పద పోస్టులు పెడితే చట్టరీత్యా శిక్షార్హులు కాబట్టి.. అడ్మిన్లు చాలా బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. అనుచిత వ్యవహారాలకు సంబంధించి ఐపీసీ సెక్షన్ 153 ప్రకారం 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష కూడా గురి కావాల్సి ఉంటుంది. కానీ వైసీపీ కనుసన్నల్లో పనిచేస్తున్న వలంటీర్ల ప్రైవేటు గ్రూపులు, కమ్యూనిటీ గ్రూపులలో జోరుగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలే జరుగుతున్నాయి.

విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు

వలంటీర్ల వాట్సాప్ గ్రూపులలో విద్వేషాలను రెచ్చగొట్టడం, వర్గ పోరుకు తావిచ్చే పోస్టులను చేయటం, ఫేక్ న్యూస్‌ను వ్యాప్తి చేయటం, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు వంటివి పోస్టు చేయటం చేస్తున్నారు. వీటిపై అడ్మిన్లు ఎలాంటి చర్యలూ తీసుకోవటం లేదు. కాబట్టి జిల్లా ఎన్నికల యంత్రాంగం వాట్సాప్ గ్రూపులు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలలో వచ్చే వాటిపై కూడా గట్టి నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారాలో ఎంసీఎంసీ దృష్టి సారించేలా జిల్లా ఎన్నికల అధికారి సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది.

సకలం శుభం జరగాలి

» అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి » రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉగాది వేడుకలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది.. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి.. అన్ని విధాల పురోగతి సాధించి అంతా శుభమే జరగాలి.. అని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఆకాంక్షించారు. మంగళవారం ఎన్టీఆర్





కూచిపూడి నృత్య కళాకారిణులకు ఉగాది పచ్చడి పెడుతున్న రజత్ భార్గవ, పక్కన దిల్లీరావు

జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, దేవదాయ శాఖ, జిల్లా యంత్రాంగాల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు రజత్ భార్గవ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, కలెక్టర్ ఎస్.దిల్లీరావు, దుర్గగుడి ఈవో రామారావు, తదితరులు హాజరయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థాన, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పంచాగాన్ని ఆవిష్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించిన అనంతరం పండితులు కప్పగంతు సుబ్బరామ సోమయాజి సిద్ధాంతి పంచాగ శ్రవణం చేశారు. క్రోధి నామ సంవత్సరంలో సకలం శుభప్రదమేనని, అన్ని రంగాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రజిత్ భార్గవ మాట్లాడుతూ, షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడికి ఓ ప్రత్యేకత ఉందని, షడ్రుచుల ఉగాది పచ్చడి మనిషి జీవితానికి సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ, ఉగాది మనిషి జీవితంలో నూతన శకానికి నాంది అని పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో అందరు సంతోషంగా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఉగాది తెలుగు వారు గొప్పగా చేసుకునే పండుగ అని కలెక్టర్ దిల్లీరావు అన్నారు. కొత్త సంవత్సరంలో రైతులు, పాడి పంటలతో ఆనందంగా ఉండాలని, పశు సంపద బాగుండాలని కోరుకున్నట్టు చెప్పారు. వేడుకల్లో భాగంగా రాష్ట్రంలో వివిధ దేవాలయాలకు చెందిన వేద పండితులను సత్కరించారు. ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భగవంతుడు శక్తినివ్వాలి

» జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలి » ఉగాది వేడుకల్లో కృష్ణా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9 : ఎన్నికల సమయంలో సవాళ్లను ఎదుర్కొనే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని, క్రోధి నామ సంవత్సరంలో ఎవరూ కోపానికి గురికాకుండా ప్రశాంతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆకాంక్షించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ స్పందన హాలులో జరిగిన ఉగాది వేడుకలకు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. వేదపండితులు వేదపఠనం చేయగా కలెక్టర్ ఉగాది పచ్చడిని సేవించారు. సీనియర్ అర్చకులు, వేదపండితులు, కార్యనిర్వహణాధికారులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. వేదపండితులు ముక్తేవి శ్రీనివాస శశికాంత పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ,



ఉగాది వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ..

ఉగాది పచ్చడి తింటూ..

జిల్లా ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్‌వో చంద్రశేఖర్, ఆర్డీవో పద్మ, జడ్పీ సీఈవో ఆనంద్‌కుమార్, విద్యుత్‌శాఖ ఈఈ భాస్కరరావు, సర్వేశాఖ ఏడీ త్రిపాఠీ, వికలాంగుల శాఖ ఏడీ కామరాజు, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసరు ఝాన్సీ, ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సీనియర్ అర్చకులు ఘంటశాల సుబ్రహ్మణ్యం, చదలవాడ రామలింగేశ్వరరావు, ముక్తేవి వెంకట సత్యనారాయణలకు ప్రశంసాపత్రాలతో పాటు రూ. 10 వేలు నగదును అందజేశారు.

అట్టహాసంగా ప్రజా సంకల్పయాత్ర

» చల్లపల్లిలో బాలశౌరి, బుద్ధప్రసాద్‌కు ఘన స్వాగతం » యువత బైక్ ర్యాలీ.. » అడుగడుగునా మహిళల హారతులు

చల్లపల్లి / ఘంటసాల / అవనిగడ్డ / మోపిదేవి, ఏప్రిల్ 9 : ప్రజా సంకల్పయాత్ర చల్లపల్లి మండలంలో అట్టహాసంగా సాగింది. టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వల్లభనేని బాలశౌరి మండలి బుద్ధప్రసాద్‌లు తొలిసారిగా నియోజకవర్గంలో పర్యటిస్తుండటంతో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. శ్రీకాకుళంలో యాత్ర ప్రారంభం కాగా, చల్లపల్లి టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, పార్టీనేతల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి నేతలకు స్వాగతం పలికారు. ఎన్టీఆర్ పార్కు సెంటరులో ఎంపీటీసీ మేకా బంగారుబాబు గజమాలతో సత్కరించారు. ఉపసర్పంచ్ ముమ్మనేని నాని ఆధ్వర్యంలో తీన్‌మార్ వాయిద్యాలతో క్రేన్ సహాయంతో భారీ గజమాలతో బాలశౌరి,



శ్రీకాకుళం నుంచి సంకల్ప యాత్రగా వస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు



అవనిగడ్డలో సందడి చేస్తున్న జనసైనికులు

బుద్ధప్రసాద్‌లను సన్మానించారు. జనసేన నేత అడపా రాంబాబు ఆధ్వర్యంలో భారీ గజమాలతో సత్కరించారు. జనసేన నేతలు దుశ్శాలువాలతో సత్కరించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంపీ బాలశౌరి, బుద్ధప్రసాద్‌లు నివాళులు అర్పించారు. వక్కలగడ్డలో టీడీపీ నేతలు తాతినేని సాయి, పరిశె మౌళి, మహిళలు తదితరులు ఘన స్వాగతం పలికారు. వారితోపాటు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య, టీడీపీ, జనసేన నేతలు ఉన్నారు. ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, మాలెంపాటి శ్రీనివాసరావు, రాజులపాటి అంకమ్మ, మట్టా కోమలి, నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అవనిగడ్డ గాంధీక్షేత్రంలో కార్యకర్తలనుద్దేశించి వల్లభనేని బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్‌లు ప్రసంగించారు. రాష్ట్రంలో వైసీపీ పాలనను అంతమొందించేందుకు పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుందని, ఈ పొత్తులో బీజేపీ భాగస్వామ్యం కావటంతో కూటమికి బలం చేకూరిందన్నారు. వైసీపీ రాక్షస పాలన అంతం ఖాయమనటానికి అవనిగడ్డ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీనే నిదర్శనమని మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం తనకు గుండెకాయ లాంటిదని, నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కార్యకర్తలకు వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. ఎదురుమొండి వారధి, నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, మత్స్యకారులకు సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తానని బాలశౌరి తెలిపారు.

కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం

ఎంపీ బాలశౌరి, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌ల సంకల్ప ర్యాలీ కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని ఎంపీ అభ్యర్థి బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. రైతులు, యువతకు మేలు జరగాలని సంకల్పం తీసుకున్నారు. వందలాది మంది యువకులు ర్యాలీగా వచ్చారు. బీజేపీ, జనసేన, టీడీపీ నేతలు మోపిదేవిలో పార్టీ నేతలను స్వాగతించి అవనిగడ్డ గాంధీక్షేత్రానికి ర్యాలీగా తరలివచ్చారు. అవనిగడ్డకు చెందిన వైసీపీ యువనేత సింహాద్రి పవన్ ఆ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్‌ల సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

నా తరపున ప్రచారం చేయండి

» పార్టీ శ్రేణులకు తాతయ్య విజ్ఞప్తి



జగ్గయ్యపేట, ఏప్రిల్ 9 : మాతృమూర్తి మరణానంతరం వైదిక కార్యక్రమాలు పూర్తయ్యే వరకు తన తరపున పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలని జగ్గయ్యపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి శ్రీరాం తాతయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన వీడియో సందేశాన్ని పార్టీ శ్రేణులకు పంపారు. సాంప్రదాయం ప్రకారం వైదిక కార్యక్రమాలు పూర్తయ్యేవరకు బయటకు రావటం కుదరనందున పార్టీ శ్రేణులే ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫోన్‌లో అందరికి అందుబాటులో ఉంటానని తెలిపారు.

మోసగాడు దొరికాడు

అవనిగడ్డ, ఏప్రిల్ 9 : అవనిగడ్డ ఇండియన్ బ్యాంక్‌లో గోల్డ్ లోన్ కట్టేందుకు వచ్చిన మహిళను మోసగించి రూ.50 వేలు కాజేసిన మోసగాడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రామచంద్రాపురం శివారు వలందపాలెం గ్రామానికి చెందిన వాకా కృష్ణకుమారి, లక్ష్మీల నుంచి రూ.50 వేలు తస్కరించగా, సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితుడు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన షేక్ నాగుల్ మీరా వలిగా గుర్తించారు. నిందితుడు బ్యాంక్‌ల్లో చదువు లేని వారిని, మహిళలను మోసగించి డబ్బులు కాజేసినట్టు 70కిపైగా కేసులు ఉన్నాయని, గతంలో అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో కోడూరులో ఇదే తరహాలో మోసం చేసినట్టు కేసు నమోదైనట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. పులిగడ్డ-పెనుమూడి వారధి సమీపంలో నాగుల్ మీరా వలి పట్టుబడ్డాడని, అతడి నుంచి డబ్బు రికవరీ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ రమేష్‌ను, స్టేషన్ సిబ్బంది డీఎస్పీ మురళీధర్‌రావు, సీఐ త్రినాథ్‌లు అభినందించారు.

స్వగ్రామానికి తల్లీకూతుళ్ల పార్థివ దేహాలు

» కొణకంచిలో విషాదచాయలు

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 9: అమెరికాలో మార్చి 31వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొణకంచి గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు కమతం గీతాంజలి, హానిక మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. తల్లీకూతుళ్ల పార్థివ దేహాలను మంగళవారం రాత్రి స్వగ్రామం కొణకంచి గ్రామానికి తీసుకువచ్చారు. వారి దేహాలను చూసిన కుటుంబసభ్యులు, బంధువులు తీవ్రంగా రోదిస్తున్నారు. రాత్రివేళ గీతాంజలి హానిక భౌతికకాయాలను చూసేందుకు గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రెండు రోజుల క్రితం గీతాంజలి భర్త నరేశ్, కుమారుడు కొణకంచి గ్రామానికి చేరుకున్నారు. కొణకంచి గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.



పార్థివదేహాల వద్ద విషణ్ణవదనంతో భర్త నరేశ్

వైసీపీ హైడ్రామా!

(5వ పేజీ తరువాయి)

ఈ కేసు తమ పరిధిలోకి రాదని చెప్పిన పోలీసులు బాధితుడిని తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మరికొన్ని రోజులకు మరో యువకుడిపై వైసీపీ కార్యకర్తలు దాడిచేశారు. ఈ అంశం వివాదాస్పదమైంది. రెండు ఘటనలకు కారకులైన వైసీపీ కార్యకర్తలపై పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోకుండా వైసీపీ నాయకులు తెరవెనుక చక్రం తిప్పారు.

● **7న జాతరలో రెండు వర్గాల ఘర్షణ**

ఉల్లిపాలెంలో ఈనెల 7న నూకాలమ్మ జాతర జరిగింది. ఈ సమయంలో వైసీపీకి చెందిన భాను, మణికంఠ, వెంకటేష్, పాండురంగారావు.. టీడీపీకి చెందిన ధర్మతేజ, మహేష్, యశ్వంత్, పవన్‌లపై దాడిచేశారు. దీంతో టీడీపీ కార్యకర్తలు తిరగబడి వైసీపీ కార్యకర్తలపై ఎదురుదాడి చేశారు. గ్రామంలో జరిగిన గొడవపై పూర్తిస్థాయిలో విచారణ చేసిన పోలీసులు ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. తరచూ గ్రామంలో గొడవలకు కారణమవుతున్న వైసీపీ కార్యకర్తలకు పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

● **పోలీస్‌స్టేషన్ వద్ద పేర్ని నాని ఆందోళన**

ఉల్లిపాలేనికి చెందిన వైసీపీ కార్యకర్తలను పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించిన నేపథ్యంలో ఎమ్మెల్యే పేర్ని నాని మంగళవారం తాలూకాపోలీస్ స్టేషనుకు పెద్దఎత్తున వైసీపీ కార్యకర్తలతో తరలివచ్చారు. స్టేషన్‌లో కూర్చుని తమ పార్టీ కార్యకర్తలను టీడీపీ కార్యకర్తల సమక్షంలో కొట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్‌సుభాన్ తాలూకా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. జరిగిన సంఘటనపై విచారణ చేసి తాలూకా ఎస్ఐ చాణక్యపై చర్యల నిమిత్తం నివేదికను ఎస్పీకి పంపుతామని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే పేర్ని నాని, వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ నుంచి వెళ్లిపోయారు.

● **గతంలో గొడవలు జరిగినా..**

ఉల్లిపాలేనికి చెందిన టీడీపీకి సానుభూతిపరులు ఇద్దరిపై వైసీపీకి చెందిన కార్యకర్తలు ఇటీవలకాలంలో రెండు విడతలుగా దాడులు చేశారు. వీరంతా పేర్ని కిట్టు అనుచరులమని గ్రామంలో హంగామా చేస్తూ ఉంటారు. యశ్వంత్‌పై దాడి కేసులో టీడీపీ నాయకులు కొల్లు రవీంద్ర, జనసేన నాయకుడు బండి రామకృష్ణ రాత్రి సమయంలో తాలూకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నిందితులపై చర్యలు తీసుకోవాలని, బాధితుడిని ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందేలా చూడాలని కోరే వరకు పోలీసులు తగు విధంగా స్పందించలేదు. వైసీపీ నాయకులు అడ్డుపడ్డారు. దీంతో వైసీపీకి చెందిన కార్యకర్తలు తాము ఏం చేసినా పేర్ని నాని, ఆయన కుమారుడు కిట్టు తమకు అండగా ఉన్నారనే కారణంతో నెలరోజుల వ్యవధిలో గ్రామంలో మూడు గొడవలకు కారణమయ్యారు. ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడే వారిని అదుపుచేయడానికి పోలీస్ తరహాలోనే ప్రయత్నాలు చేస్తారని, గొడవలకు కారణమవుతున్న వారిని వైసీపీ నాయకులు ప్రోత్సాహిస్తే శాంతి భద్రతలను అదుపుచేయడం కష్టమవుతుందని పోలీస్ అధికారులు అంటున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310



నెక్ కోడిగుడ్డు ధర


విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

భవానీపురం, ఏప్రిల్ 9 : రజా కమిటీ అధ్యక్షుడు షేక్ గయాజుద్దీన్(బజా) ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ స్థానిక రజా మసీదు వీధిలో మంగళవారం జరిగింది. సుమారు వెయ్యి మంది పేద ముస్లిం కుటుంబాలకు 13 రకాల సరుకులతో ఈ తోఫాను అందించినట్లు గయాజుద్దీన్ తెలిపారు. పలువురు ముస్లిం మత పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న గయాజుద్దీన్













వజ్రకవచ, గాజులతో, తమలపాకులతో ప్రత్యేక అలంకారం, నాగసాయిబాబా మందిరంలో, శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో సత్కారం, ఇండియన్ ఆయిల్ పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంకులో ఉగాది పచ్చడి పంపిణీ

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

●భక్తులతో కళకళలాడిన ఆలయాలు ● ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం ●ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలు పంపిణీ

చిట్టినగర్, ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నగరంలోని దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆయా దేవాలయాల్లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని, అమ్మవార్లను, స్వామివార్లకు పూలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించగా, అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు.

● పాలఫ్యాక్టరీ సమీపంలో విజయదుర్గా రామలింగేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో పంచముఖ ఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి, విజయ దుర్గా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ● వజ్రకవచ ప్రత్యేక అలంకారంలో పద్మావతి, గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పులిహోర ప్రసాదంతో స్వామిని అలంకరించి పూజలు చేశారు. ● పద్మావతి అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ● కొత్తపేట కేబీఎన్ ఎదురుగా ఉన్న గంగానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగసాయిబాబా మందిరంలో ..

గవర్నర్‌పేట: క్రోధి నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీషిర్డి నాగసాయిబాబా మందిరంలో ఉగాది పంచాంగ శ్రవణం జరిగింది. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో పండితులకు, భక్తులకు ఉచిత పంచాంగాలు పంపిణీ చేశారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాగమానసాదేవి అమ్మవారికి పూలతో అభిషేకం చేశారు. మహిళా భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మల్లాది విష్ణుకు నూతన వస్త్రాలతో సత్కరించారు. మందిరంలో నిత్యం బాబా కీర్తనలు ఆలపించే భక్త బృందాన్ని సుధాస్వామి సత్కరించి నూతన వస్త్రాలు బహుకరించారు.

● చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో రాళ్ళపల్లి వేంకటేశ్వర శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో పండితులు విరూపాక్షం శ్యావాశ్య మహర్షి అవధానులను నూతన వస్త్రాలతో సత్కరించి, పండ్లు, నగదు బహుమతిని అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇండియన్ ఆయిల్ పైలెట్ సర్వీస్ స్టేషన్

లబ్బీపేట: బందరు రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంకులో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్ వినియోగదారులకు, ఉద్యోగులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్వీస్ సేషన్ యజమానులు ఎంవీవీ సత్యనారాయణ, నంద కిషోర్‌లు వినియోగదారులకు ఉగాది పచ్చడి, మిఠాయిలు పంపిణీ చేశారు. మేనేజర్ కె.వెంకటప్పయ్య పాల్గొన్నారు.

పాత శివాలయంలో ప్రత్యేక అర్చనలు



పాత శివాలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం

వన్‌టౌన్, ఏప్రిల్ 9: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వర ఆలయంలో ఉగాది సందర్భంగా మంగళవారం ప్రత్యేక అర్చనాది కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ నిర్వహించారు. భ్రమరాంబ అమ్మవారికి, ఉపాలయాలలో దేవతా మూర్తులకు స్నపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఖడ్గమాలార్చన, నివేదన, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. మల్లేశ్వరస్వామికి భస్మార్చన చేశారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ,ప్రత్యేక అలంకారం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. సాయంత్రం క్రోధినామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యనిర్వహణ అధికారి కానూరి సురేష్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు రాచకొండ సుమంత్ శర్మ, నాగరాజు శర్మ, నాదెళ్ల లక్ష్మీ రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్ల ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్లు

భవానీపురం, ఏప్రిల్ 9 : హెచ్‌బీ కాలనీలోని ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ హాల్లో క్రోధి నామ సంవత్సర ఉగాది వే డుకలు మంగళవారం నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథులుగా రిటైర్డు ఏపీ జెన్‌కో డైరెక్టర్ సాలి ఆంజనేయులు, రిటైర్డు ఎంపీడీవో అబ్బిలి ఆంజనేయులు, రిటైర్డు ఇన్‌కంటాక్స్ జాయింట్ కమిషనర్ తెలగరెడ్డి సత్యానందంలు హాజరై ఇటీవల జరిగిన సూరిశెట్టి రామయ్య-మహాలక్ష్మి మెమోరియల్ క్యారమ్స్ విజేతలకు షీల్డులు ప్రదానం చేశారు. తొలుత అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రిటైర్డు తెలుగు ఉపాధ్యాయులు ఆవంచ వేణుగోపాల రాధాకృష్ణమూర్తి పంచాంగ పఠనం చేశారు. రిటైర్డు సంస్కృత ఉపాధ్యాయులు పమిడిపాటి పట్టాభి రామారావు ఉగాది విశిష్టతను కవితల రూపంలో వివరించారు. ఉపాధ్యక్షులు నందక కృష్ణ, కార్యదర్శి యెనిగళ్ల సుబ్బారావు, దేవరపల్లి శేషగిరిరావులు పాల్గొన్నారు.

వైభవంగా 'ఫన్‌టైమ్స్ క్లబ్'లో పంచాంగ శ్రవణం



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

పటమట, ఏప్రిల్ 9 : విజయవాడ టీచర్స్‌కాలనీలో మంగళవారం రాత్రి శ్రీ క్రోధి నామ సంవత్సరం వేడుకలు వైభవంగా నిర్వహించారు. జ్యోతి వెలిగించి చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. తదుపరి పండితులు వేమూరి శ్రీహరి పంచాంగ శ్రవణం నిర్వహించారు. ముఖ్య అతిథులు కవి పండిత్ బిరుదాకింతుడు నెక్కంటి సుబ్బారావు, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ సంస్థ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్‌లను ఫన్‌టైమ్స్ యాజమాన్యం ఉగాది పురస్కారాలతో సన్మానించారు. ఫన్‌టైమ్స్ సెక్రటరీ కిలారు వెంకటశివాజీ, ఉపాధ్యక్షులు బొర్రా రాధాకృష్ణ(గాంధీ), అట్లూరి సుమబిందు, నిర్వహణ కార్యదర్శి కొసరాజు విజయబాబు, కోశాధికారి ముప్పవరపు సతీష్‌బాబు, ఫన్‌టైమ్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సహనాన్ని పాటించాలి : ఆంజనేయశాస్త్రి

విజయవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ టీటీడీ కల్యాణమండపం ఆవరణలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం రాత్రి పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త హనుమత్ ఉపాసకులు గబ్బిట ఆంజనేయశాస్త్రి పంచాంగ పఠనం చేశారు. క్రోధి నామ సంవత్సరం కావడంతో కోపతాపాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ సహనాన్ని పాటించాలని చెప్పారు. దేశం, కుటుంబంలో యుద్ధవాతావరణం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రామచంద్రరావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టేడియంలో ఈద్ నమాజ్



ఈద్ నమాజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

లబ్బీపేట, ఏప్రిల్ 9: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో బహిరంగ ఈదుల్ ఫితర్ నమాజ్ నిర్వహిస్తున్నట్లు ముస్లిం ఈద్‌గాహ్ కమిటీ అధ్యక్షుడు కాలేషావలీ తెలిపారు. మంగళవారం కమిటీ సభ్యులు స్టేడియంలో నమాజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ రోజు ఉదయం 7.15 నిముషాలకు ఈద్ సందేశం, 8 గంటలకు ఈద్ నమాజ్ జరుగుతుందని, ఈ నమాజ్ నందు ముస్లిం సోదరులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇర్ఫాన్, మౌలానా మక్బుల్ అహ్మద్, ముక్తర్ ఆలీ, మౌలానా హుస్సేన్, అహ్మద్ షరీఫ్, మునీర్ అహ్మద్, సయ్యద్ అలీమ్, అన్వర్ బాషా, డాక్టర్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

లంకమ్మ జాతర 22న

అవనిగడ్డ రూరల్ : దివిసీమ ఇలవేల్పు లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం ఈనెల 22న జరుగుతుందని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు రామఫణి శర్మ అమ్మవారి జాతర మహోత్సవ సుముహూర్త పత్రికను ఆలయానికి అందజేశారు. ఈ నెల 17వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12.45 నిముషాలకు అమ్మవారిని ఆలయం నుంచి బయటికి తీసుకురావటం జరుగుతుందన్నారు. 22వ తేదీ వరకు గ్రామోత్సవం నిర్వహించగానే మంగళవారం ఉదయం 10.45 నిముషాలకు అమ్మవారు ఆలయానికి చేరుకుంటారని తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి: పది మంది అరెస్టు

ఎ.కొండూరు, ఏప్రిల్ 9 : ఉగాది సందర్భంగా మండలంలోని రామచంద్రాపురం గ్రామ శివారు కోమటికుంట్ల సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై కృష్ణ, సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అరెస్టు చేసి, రూ. 20 వేల 250, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

జి.కొండూరు: కుంటముక్కల గ్రామంలో కోడి పందేలు వేస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,800, ఒక పందెపు పుంజును, ఒక కోడి కత్తిని, మునగపాడు గ్రామంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,500 స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం ఎస్సై షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో చిన్నం

గన్నవరం, ఏప్రిల్ 9 : నడకతో సంపూర్ణ ఆరోగ్యమని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ నడవాలని వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నం రామకృష్ణ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నడక ఆరోగ్యానికి మంచిదన్నారు. దీనికి తోడు సేవా శిక్షణ అవసరమన్నారు. విజయవాడలో ఆరు గ్రౌండ్స్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు , రెండు చోట్ల ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామన్నారు. గన్నవరం గ్రౌండ్ కూడా బాగా అభివృద్ధి చేయటంతో పాటు చుట్టూ లైటింగ్ ఏర్పాటు అభినందనీయమన్నారు. నూతన అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ మాట్లాడుతూ, గన్నవరం వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసేందుకు విశేష కృషి చేస్తానన్నారు. అందరిని కలుపుకుని గ్రౌండ్‌కు అవసరమైన వసతులు కల్పిస్తానని తెలిపారు. కార్యదర్శి సురేంద్ర, కోశాధికారి బి.కోటేశ్వరరావు, హెచ్ఎం ఎస్.రవీంద్ర భవాని, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, రిటైర్డ్ పీడీ టిఎస్ఆర్‌కె ప్రసాద్, జలసూత్రం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలి: బొండా ఉమా

సత్యనారాయణపురం, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో సామాన్య ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. 32వ డివిజన్ లోటస్‌లో మంగళవారం ఆ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సత్యనారాయణపురం, ఏప్రిల్ 9: ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8గం నుంచి 9గంటల వరకూ, మళ్లీ 11 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు బి.వి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్‌కేవీ లైన్లు మరమ్మతుల కారణంగా కేదారేశ్వరపేట1వ లైన్ నుంచి 7వ లైన్ వరకూ, లోటస్ సెక్టార్ 1, 2, 3, 4, 5, రామలింగేశ్వరపేట మొత్తం ఏరియా, శాంతినగర్, అయోధ్యనగర్ మొత్తం ఏరియా, సూరిబాబు కాలనీ, బసవతారకనగర్, బుడమేరుకట్ట, డొంకరోడ్డు ఏరియాల్లో విద్యుత్‌సరఫరా ఉండదని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విద్యాధరపురం, ఏప్రిల్ 9: భవానీపురం దర్గా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. స్థానికులు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాలలోపు వయస్సు ఉంటుందని, తెలుపురంగు బనియన్, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మూడు రోజుల క్రితం మృతి చెందాడని, మృతికి కారణాలు తెలియాల్సి ఉందని స్థానికులు చెబుతున్నారు.

వికాస్‌లో ప్రాంగణ ఎంపికలు 13న

విస్సన్నపేట, ఏప్రిల్ 9: ప్రముఖ బహుళజాతి ఔషధ సంస్థ హెటీరో ల్యాబ్స్ ఈనెల 13న విస్సన్నపేట వికాస్ పీజీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్ ఎన్.నర్సిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, బీ.ఫార్మసీ, పాలిటెక్నిక్ మెకానికల్ పూర్తి చేసిన అభ్యర్థులు, చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు వికాస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా సుధీర్ రెడ్డిని వ్యక్తిగతంగా, 9849553107 నంబరుకు సంప్రదించాలన్నారు.

జోగి నోరు అదుపులో పెట్టుకో: దేవినేని రాజా

కంకిపాడు, ఏప్రిల్ 9 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదని పెనమలూరు వైసీపీ అభ్యర్థి జోగి రమేష్‌ను కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా హెచ్చరించారు. మంగళవారం స్థానిక విలేకరులతో రాజా మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుపై జోగి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. మాట్లాడితే వంగవీటి మోహన్ రంగా అను చరుడుని అని చెప్పుకుంటున్న జోగి వైసీపీ అధి ష్టానం వంగవీటి మోహన్ రంగా కుమారుడు రాధాను గత ఎన్నికల్లో పక్కన పెడితే ఏం చేశాడని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర, చెల్లి సంగీతరావు, షేక్ షకార్, సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే

మహిళాభివృద్ధికి పెద్ద పీట

కేశినేని జానకీ లక్ష్మి



ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి, బొండా సుజాత, వల్లభనేని రాజేశ్వరి

గుణదల, ఏప్రిల్ 9: టీడీపీ అధికారంలోకి రాగానే మహిళాభివృద్ధికి పెద్ద పీట వేయడంతోపాటు మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందేలా పలు పథకాలు ప్రవేశపెట్టనున్నట్లు విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సతీమణి కేశినేని జానకీ లక్ష్మి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాచవరంలోని దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధిలో సోమవారం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కేశినేని జానకీ లక్ష్మితో పాటు సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా సతీమణి బొండా సుజాత, 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరిలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ కంచర్ల నాగశేషారాణి, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, బాడిత శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: కేశినేని వెంకట్



సమస్యలు తెలుసుకుంటున్న కేశినేని వెంకట్

భారతీనగర్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో అభివృద్ధి కనిపించాలన్నా, ప్రజాస్వామ్య పాలన రావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ యువనాయకుడు కేశినేని వెంకట్ అన్నారు. మంగళవారం తూర్పులోని 7వ డివిజన్‌లో కేశినేని వెంకట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమం బందులదొడ్డి సెంటర్ నుంచి సి.ఆర్.నగర్ కొండప్రాంతం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కేశినేని వెంకట్ మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్, డివిజన్‌పార్టీ ప్రెసిడెంట్ పటమట సతీష్ చంద్ర, డివిజన్ ఉపాధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి లక్ష్మణ్, జననాగుమోతు రాజు, దోమకొండ రత్నాకర్, బూత్ కన్వీనర్ కర్రి రాజేష్, జనసేన డివిజన్ ప్రెసిడెంట్ దోమకొండ అశోక్, శివ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టిల్లు మన మనిషి అయిపోయాడు

ఎన్టీఆర్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లుస్క్వేర్' మార్చి 29న విడుదలై ఘనవిజయం అందుకుంది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ సాధించిన 'టిల్లు స్క్వేర్' సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ "సిద్ధూకి సినిమా తప్ప వేరే ఏమీ తెలియదు. నిరంతరం వర్క్ గురించే ఆలోచిస్తుంటారు. ఈ సినిమాతో సిద్ధు కేవలం



విజయాన్ని అందుకోవడమే కాకుండా మన జీవితంలో కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చారు. ఈ రోజు టిల్లు... మన ఇంట్లో, మన చుట్టూ తిరిగే మనిషి అయిపోయాడు. నేనింక నవ్వలేను బాబోయ్ అనేంతలా సిద్ధూ నవ్వించారు" అని చెప్పారు. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా 'టిల్లు స్క్వేర్' మాత్రమే కాదు, రాధిక స్క్వేర్ కూడా. ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశాను. అందుకే ఈ రేంజ్ సక్సెస్ వారికి దక్కింది" అని అన్నారు. కథానాయకుడు విశ్వక్‌సేన్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం సిద్ధు ఎంతగా ఎఫర్ట్ పెట్టారో నాకు తెలుసు. టిల్లు పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది" అని తెలిపారు. చిత్ర కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమాను ఇంతలా ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డ్ ఇంకోటి ఉండదు" అని చెప్పారు. దర్శకుడు రామ్ మల్లిక్ మాట్లాడుతూ "ఈ సినిమా విజయంలో చిత్ర బృందం సమష్టి కృషి ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేశారు.

ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్నారు హీరో శ్రీవిష్ణు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆయన తన 19వ చిత్రాన్ని ప్రారంభించారు. దిల్‌రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి షాట్‌కి వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శత్వం వహిస్తున్నారు. అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీదీపక్ నిర్మిస్తున్నారు. కోన వెంకట్, బాబీ కొల్లి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, సంగీతం: విజయ్ బులగానిన్, డీఓపీ: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:వై నాగు.

హ్యాట్రిక్ హిట్ కోసం..



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘన విజయం సాధించాయి. హ్యాట్రిక్ హిట్ కోసం వీరిద్దరూ మళ్లీ జత కట్టారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ సినిమా వివరాలను ఉగాది సందర్భంగా మంగళవారం వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ ఏడు హిట్స్ అందించిన అనిల్ రావిపూడికి దిల్ రాజు నిర్మాణ సంస్థలో ఇది ఆరో సినిమా కావడం గమనార్హం.

హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ లవ్ స్టోరీ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం వినోదభరితంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది సంకాంత్రికి చిత్రాన్ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి



రవితేజ తన కెరీర్‌లో 75వ చిత్రం మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధమయ్యారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన ల్యాండ్ మార్క్ ఫిల్మ్‌ను ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం వివరాలు వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. దాని మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని రాసి ఉంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిదని అర్థమవుతుంది. ఇందులో రవితేజ పేరు లక్ష్మణ భేరి. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంకాంత్రికి ఈ చిత్రం 'ధూమ్ ధామ్ మాస్ దావత్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటింగ్: నవీన్ నూలి.

ఈ జర్నీని ఎంజాయ్ చేశా



అంజలి నటించిన హారర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' 2014లో విడుదలై సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. హారర్ కామెడీ మూవీస్‌లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' లోనూ అంజలి నటించింది. ఈ సినిమా ఆమెకు 50వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 11న హారర్ కామెడీగా తెరకెక్కిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మీడియాతో ముచ్చటించారు.

నా సినిమాలన్నీ దాదాపు జీ అక్షరంతో మొదలవడం యాధృచ్ఛికం. గీతాంజలి సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలనే ఆలోచన ఇప్పటిది కాదు. ఈ సినిమా కథను కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ ప్రాజెక్ట్ తెరకెక్కడం ఆలస్యమైంది. అన్ని అడ్డంకులను దాటుకొని అద్భుతమైన అవుట్‌పుట్‌తో ఈ సినిమాను పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా సీక్వెల్ కాబట్టి పాత క్యారెక్టర్స్‌ను మార్చలేం. కాబట్టి కొత్త క్యారెక్టర్స్‌ను స్టోరీలోకి తీసుకువచ్చాం. ఈ సినిమాలో హారర్, కామెడీతో పాటు విగిలిన అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా 50వ చిత్రం కావడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అప్పుడే ఇన్ని సినిమాలు చేసేశానా అనిపిస్తుంది. ఒక నటిగా ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెప్పారు.

ప్రతి ఒక్కరు రిలేట్ అవుతారు



నవదీప్ నటిస్తున్న తాజా చిత్రం 'లవ్ మౌళి'. తనను ఇప్పటివరకు చూడని విధంగా ఆవిష్కరించే చిత్రమిదని నవదీప్ విజయంపై ఎంతో ధీమాగా ఉన్నారు. అందుకే ఈ సినిమాకు నవదీప్ 2.0గా తనని ప్రేక్షకులకు పరిచయం చేసుకుంటున్నారు. పంఖురి గిద్వాని, భావన సాగి హీరోయిన్లుగా నటిస్తున్నారు. అవనీంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. సి స్పేస్, నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన విశ్వక్‌సేన్ మాట్లాడుతూ "సినీ ఇండస్ట్రీలో అజాతశత్రువు ఎవరైనా ఉన్నారంటే అది నవదీప్ మాత్రమే. ఈ సినిమాలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. హీరో క్యారెక్టరైజేషన్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు" అని చెప్పారు. హీరో నవదీప్ మాట్లాడుతూ "ఇది చాలా కొత్త కథ. సంవత్సరం పాటు ఈ సినిమాలోని నా లుక్ కోసమే కష్టపడ్డాను" అని చెప్పారు. డైరెక్టర్ అవనీంద్ర మాట్లాడుతూ "ఈ సినిమాలో నవదీప్ క్యారెక్టర్‌లో చాలా విభిన్నమైన షేడ్స్ ఉంటాయి. ఇది ఒక చిత్రకారుడి ఎమోషనల్ జర్నీ. ప్రతి ఒక్కరు ఈ సినిమాకు రిలేట్ అవుతారు" అని చెప్పారు.

'రాజారాణి' ఫీల్ కలిగింది



జీవీ ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యా రాజేశ్ నటించిన ఫ్యామిలీ డ్రామా 'డియర్'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్విరాజ్ నిర్మించారు. ఈ చిత్రం తమిళంలో ఈ నెల11న, తెలుగులో 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో జీవీ ప్రకాశ్ మాట్లాడుతూ "డియర్ అందరూ రిలేట్ చేసుకునే సినిమా. ఇందులో అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి. ఈ సినిమా కథ విన్నప్పుడు 'రాజారాణి' మూవీ ఫీల్ కలిగింది" అని చెప్పారు. దర్శకుడు ఆనంద్‌రవిచంద్రన్ మాట్లాడుతూ "గురక పెట్టడం ప్రతీ ఇంట్లో ఉండే సమస్య. దీనిపై కథ రాయడం చాలా కొత్తగా అనిపించింది. ఈ సినిమాలో జీవీ ప్రకాశ్, ఐశ్వర్య కెమిస్ట్రీ అద్భుతంగా పండింది" అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ అవుతుంది" అని ఆకాంక్షించారు. నటి ఐశ్వర్య మాట్లాడుతూ "ఈ సినిమాలో అందరినీ ఆకట్టుకునే కంటెంట్ ఉంది" అని చెప్పారు.

డిఫరెంట్ కథతో 'షణ్ముఖ'



ఆది సాయికుమార్, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. రమేశ్‌యాదవ్, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ చిత్రం టైటిల్ లోగోను లాంచ్ చేశారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. అందరినీ తప్పక ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శకుడు షణ్ముఖం మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో 'షణ్ముఖ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది" అని చెప్పారు. నిర్మాత రమేశ్ యాదవ్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా...



రవికిరణ్, త్రిషల, రక్ష హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'ఆర్ కె పురంలో' చిత్రం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. శ్రీకర్ ప్రసాద్ కట్టా దర్శకత్వంలో గుబ్బల రవికిరణ్ నిర్మించిన ఈ చిత్రం మే నెలలో విడుదలవుతుంది. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'నేటి యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాల్ని నాశనం చేసుకుంటోంది. వీరి వల్ల సమాజంలో ఎటువంటి ప్రతికూల పరిస్థితుల్ని మహిళలు ఎదుర్కొంటున్నారన్నది ఈ చిత్ర కథాంశం' అని చెప్పారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా, సమాజానికి ఉపయోగపడే ఓ పవర్‌ఫుల్ పాత్రను హీరో చేశాడని నిర్మాత చెప్పారు.

నిహారిక కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ను హీరో సాయిదుర్గా తేజ్ విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నిహారిక మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు', దామోదర్ స్టూడియోస్ సంస్థతో కలసి నిర్మిస్తున్నా. కొత్తవాళ్లతో ఈ సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న యదు వంశీ మాట్లాడుతూ 'పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. వినోదభరితంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. కొత్త నటీనటులతో పాటు సాయికుమార్, గోపరాజు రమణ, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: రాజు ఎదురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక.

ఫ్యామిలీతో చూసి ఎంజాయ్ చేస్తారు



సరికొత్త కాన్సెప్ట్‌తో సినిమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'లవ్ గురు' ఈ గురువారం విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నేను ఎక్కువగా వర్తమానంలోనే ఉంటాను. భవిష్యత్ గురించి ఆలోచించను. మనకు ఏది కావాలో, ఏది ఇవ్వాలో విధి నిర్ణయించే ఉంటుంది. ఈ సినిమా విషయానికి వస్తే కథ బాగా నచ్చింది. సినిమా తీస్తే హిట్ అవుతుందనే నమ్మకం కలిగింది. కామెడీ బాగా కుదిరింది. ఫ్యామిలీతో చూసి మీరంతా ఎంజాయ్ చేస్తారు. 'లవ్ గురు' సినిమా చూసిన తర్వాత మీ భార్యను ప్రేమించడం నేర్చుకుంటారు. ఇందులో ఒక ఎమోషనల్ ఫ్లాష్‌బ్యాక్ ఉంది. దాన్ని ఇప్పుడు రివీల్ చేయను. దర్శకుడు వినాయక్ తన జీవితంలో చూసిన అనుభవాలతో ఈ చిత్రకథ రెడీ చేశాడు' అని చెప్పారు.

'బిచ్చగాడు 3' చిత్రాన్ని తీస్తున్నట్లు విజయ్ ఆంటోనీ చెబుతూ 'నా కెరీర్‌లోనే అది బిగ్ బడ్జెట్ ఫిల్మ్ అవుతుంది. దానికి నేనే దర్శకత్వం వహిస్తా. ప్రస్తుతం మా ప్రొడక్షన్‌లో మూడు సినిమాలు ఉన్నాయి. ఒకటి అక్టోబర్‌లో, మరొకటి సంక్రాంతికి, ఇంకొకటి వచ్చే వేసవికి విడుదలవుతాయి' అన్నారు.

ఫ్యాషన్ ప్రపంచంలో ఏ ట్రెండ్ కూడా స్థిరంగా ఉండదు. కొత్త కొత్త ట్రెండ్స్ నిరంతరంగా పుట్టుకొస్తూనే ఉంటాయి. అలా మహిళల మనసులను దోచుకున్న సరికొత్త ట్రెండ్ 'షరారా'! మరీ ముఖ్యంగా రంజాన్ ఈద్ నాటి జిలుగు వెలుగుల వేడుకల్లో తళుక్కున మెరవడం కోసం అమ్మాయిలు ఎంచుకోవలసిన డ్రస్సులు షరారాలే!

రంజాన్ షరారా



అలంకరణ ఇలా...

చాంద్ బాలీ, కడా లాంటి భారీ పోల్కి లేదా కుందన్ జ్యువెలరీ షరారాలకు చక్కగా సూటవుతుంది. ఏ నగ ధరించినా అవి రాళ్లు పొదిగినవి అయి ఉండేలా చూసుకోవాలి. అలాగే చెవులకు పొడవాటి ఝుంకాలు పెట్టుకోవాలి. హై హీల్స్ పాయింటెడ్ షూస్ వేసుకుంటే, షరారా అందం రెట్టింపవుతుంది.





నచ్చిన స్టైల్‌లో

పొడవాటి కుర్తీ, దుపట్టాలతో కలిపి ధరిస్తే షరారా అందం ద్విగుణీకృతం అవుతుంది. అనార్కలి, షార్ట్ కుర్తీలతో కూడా కలిపి ధరించవచ్చు. సౌకర్యం, స్టైల్ ఆధారంగా ఎవరికి వారు షరారాలను నచ్చినట్టు ధరించవచ్చు. ఆధునికం, సంప్రదాయం.. ఇలా రెండు పోకడలూ కలగలసినట్టు కనిపించే షరారాలు నిండుగా, హుందాగా ఉంటాయి. పండుగ కోసం గులాబీ, ఎరుపు, నీలం.. ఇలా ముదురు రంగుల శాటిన్ లేదా జార్జెట్ షరారాలు ఎంచుకోవాలి.





లెహంగా ప్యాంట్స్

జత ఫ్లేర్డ్ ప్యాంట్స్ కలగలిస్తే ఒక షరారా రూపొందుతుంది. కాళ్ల దగ్గర వదులుగా ఉండడంతో ఈ డ్రస్‌ను లెహంగా ప్యాంట్స్ అని కూడా సంబోధిస్తూ ఉంటారు. ముత్యాలు, జరీ, సెక్విన్లు, గోటా పట్టీ ఇలా అదనపు హంగులు జోడించుకున్న షరారాలు ప్రత్యేకించి రంజాన్ వేడుకల్లో ధరించడానికి అనువుగా ఉంటాయి.

స్ఫూర్తి

19 ఏళ్లకే సర్టిఫైడ్ బుల్లెట్ మెకానిక్‌గా ఎదిగింది కేరళకు చెందిన 21 ఏళ్ల దియా జోసెఫ్. గోళ్లకు రంగులు వేసుకోవలసిన వయసులో, వాటికి గ్రీజు జిడ్డు అంటించుకుంటూ, టీనేజీ వయసును బుల్లెట్ల మరమ్మతుకే అంకితం చేసింది దియా. అతి పిన్న వయస్కురాలైన బుల్లెట్ మెకానిక్‌గా గుర్తింపు పొందిన దియా గురించి మరిన్ని ఆసక్తికరమైన విశేషాలివి.

డుగ్ డుగ్ బండి.. రిపేర్ చేస్తా రండి



ఎవరైనా బైక్ నడపడం మొదలుపెట్టిన తర్వాతే, దాన్ని రిపేర్ చేయడమెలాగో నేర్చుకుంటారు. కానీ కేరళలోని పులిక్కపరంబిల్‌కు చెందిన దియా జోసెఫ్, మొదట రిపేర్లు చేయడం నేర్చుకుని తర్వాత బైక్ నడపడం మొదలుపెట్టింది. 2007లో దియా తండ్రి జోసెఫ్ డొమినిక్, ఇంట్లోనే సొంత బుల్లెట్ వర్క్‌షాప్‌ను నెలకొల్పి, రిపేర్లు చేయడం మొదలుపెట్టాడు. అప్పట్లో ఇంట్లో ఉన్న కుటుంబసభ్యుల కంటే ఇంటి ముందు బుల్లెట్లే ఎక్కువ ఉండేవి. వాటి మధ్య పరుగులు తీస్తూ, బుల్లెట్ల డుగ్ డుగ్ శబ్దాలు వింటూ పెరిగిన దియా, ఖాళీ సమయాల్లో రిపేర్ పనుల్లో మునిగిపోయిన నాన్నను గమనిస్తూ ఉండిపోయేది. అలా దియాలో బుల్లెట్ల పట్ల తెలియని ఆసక్తి చిన్నప్పుడే నాటుకుపోయింది.

నాన్నకు సహాయపడుతూ...

కొట్టాయం రైల్వే స్టేషన్‌కు దగ్గర్లో ఉన్న జోసెఫ్ వర్క్‌షాప్ వస్తూ, పోతూ ఉండే బుల్లెట్లతో ఎప్పుడూ బిజీగానే ఉంటూ ఉంటుంది. పదో తరగతి పరీక్షలు రాసి, ఇంటి పట్టున సెలవు రోజులు గడుపుతున్న దియా, మొబైల్ ఫోన్‌తో కాలక్షేపం చేస్తూ ఉండేది. కానీ కూతురు మొబైల్ ఫోన్‌తో కాలక్షేపం చేయడం నచ్చని దియా తల్లి, ఆ అలవాటు మానుకోమని చెప్పడంతో, దియా తన తండ్రి వర్క్‌షాప్‌కు వెళ్లి, మెకానిక్ పనుల్లో ఆయనకు సహాయపడడం మొదలుపెట్టింది. దియా కనబరుస్తున్న ఆసక్తికి ముచ్చటపడిన జోసెఫ్, క్రమేపీ కూతురికి చిన్నా చితకా రిపేర్ పనులను అప్పగించడం మొదలుపెట్టాడు. అలా రెండేళ్ల వ్యవధిలో దియా బుల్లెట్ రిపేర్ల మీద పట్టును పెంచుకుంది. ఒక పక్క ఇంటర్ చదువుతూనే, మరో పక్క ఖాళీ సమయాలను రిపేర్ల కోసం కేటాయించడం కొనసాగించింది. కూతురి ఆసక్తిని గమనించిన తల్లి, బిడ్డ చదువు గురించి ఒకింత కంగారు పడడం మొదలుపెట్టింది. కానీ ఇంటర్ పరీక్షల్లో దియాకు 98% మార్కులు రావడంతో ఆవిడ ఊపిరి పీల్చుకుంది. వర్క్‌షాప్‌లో కస్టమర్ల కంప్లైంట్స్ రాసుకోవడంతో మొదలుపెట్టి, ఎయిర్ ఫిల్టర్ క్లీనింగ్, ఆయిల్, కేబుల్ ఛేంజ్‌తో పాటు పూర్తి బుల్లెట్ సర్వీసింగ్ వరకూ దియా నైపుణ్యం సాధించేసింది.

థండర్‌బర్డ్ బహుమతిగా...

దియా ఇప్పుడు రోజుకు రెండు నుంచి మూడు బుల్లెట్లను సర్వీస్ వర్క్ చేయగలుగుతోంది. అలా ఈ 21 ఏళ్ల అమ్మాయి రోజుకు రెండు వేల రూపాయలను కూడా సంపాదిస్తోంది. ప్రస్తుతం అమల్ జ్యోతి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న దియా, తాజాగా బుల్లెట్ డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందింది. అయితే అంతకంటే రెండేళ్ల ముందే బుల్లెట్ రిపేర్లకు సంబంధించిన లైసెన్స్‌ను సొంతం చేసుకోవడం విశేషం. అయితే రిపేర్లతో తనకొచ్చిన డబ్బును కుటుంబానికే ఇచ్చేసి, పాకెట్ మనీగా కొంత మొత్తాన్నే తల్లిదండ్రుల నుంచి తీసుకునే దియాకు, బుల్లెట్ నడపాలనే ఆసక్తి కూడా ఎక్కువే! నిజానికి బాల్యం నుంచే బుల్లెట్లతో అనుబంధం ఉన్నప్పటికీ, ఆ బైక్‌ను నడిపే అవకాశం దియాకు ఎప్పుడూ రాలేదు. కానీ సొంత బుల్లెట్ ఉంటే, దాని కొచ్చే రిపేర్లు, వాటిని సరి చేయడంలో ఉండే కిటుకులు ఒంటపడతాయి. ఆ దిశగా ఆలోచించిన దియా తండ్రి జోసెఫ్, దియాకు థండర్‌బర్డ్ వేరియెంట్‌ను బహూకరించాడు. డ్రైవింగ్ లైసెన్స్ కూడా దక్కడంతో, దియా ఇప్పుడు కొట్టాయం రోడ్ల మీద రయ్యిమంటూ దూసుకుపోతోంది.


> ఈ పనిలో నేనెదుర్కొన్న ఒకే ఒక ఇబ్బంది నా వయసు, శరీర బరువు. రిపేర్ నేర్చుకుంటున్న సమయంలో బుల్లెట్, దాని విడిభాగాలను నేను మోయలేకపోయేదాన్ని. కానీ రెండేళ్ల వ్యవధిలో బుల్లెట్ బరువును ఎలా ఆపాలో, దాన్నెలా హ్యాండిల్ చేయాలో నేర్చుకోగలిగాను.

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఆఫర్

కేరళలోని పిన్న వయసు సర్టిఫైడ్ విమెన్ బుల్లెట్ మెకానిక్‌గా పేరు తెచ్చుకున్న దియా గురించి తెలుసుకున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ, చెన్నైలోని ఫ్యాక్టరీలో పని చేసే అవకాశాన్ని దియాకు కల్పించింది. "అదొక పెద్ద సర్‌ప్రైజ్ నాకు. వాళ్లు మా ఇంటికొచ్చి నా గురించి ఒక ఫీచర్ ఫిల్మ్ నిర్మించారు. నేనిప్పటివరకూ పొందిన అమూల్యమైన గుర్తింపు అది. ఈ విషయం తెలిసిన మా కాలేజీ టీచర్లు, విద్యార్థులు నన్ను అభినందించి, ప్రోత్సహించారు. రిపేర్ పనుల్లో నేను ప్రతి రోజూ నాన్నకు సహాయపడుతూ ఉంటాను. ఆయిల్స్, కేబుల్స్ మార్చడంతో పాటు, చైన్లను బిగించడం, ఇతర విడిభాగాలను మార్చడం చేస్తూ ఉంటాను. కానీ ఇంజన్ బరువు ఎక్కువ కాబట్టి దాన్ని ఊడదీసి బిగించడం నా ఒక్క దాని వల్లా కాదు. కాబట్టి ఆ పనిలో నాన్న సహాయం తీసుకుంటూ ఉంటాను" అంటూ తన బుల్లెట్ జర్నీ గురించి వివరించింది దియా.

కొత్త నైపుణ్యం లాభదాయకం

"కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడం ఎప్పటికీ లాభదాయకమే! దియా వర్క్‌షాప్‌లో ఉంటే ఆ సందడే వేరు. అందర్నీ నవ్విస్తూ, చలాకీగా రిపేర్లు చేసే దియాతో మా వర్క్‌షాప్ ప్రతి రోజూ కళకళలాడుతూ ఉంటుంది. ఒకసారి ఇంజన్ లోడ్ చేస్తూ చేతికి గాయమవడంతో, దియా కళ్లు తిరిగి పడిపోయింది. అయినా కొద్ది క్షణాల్లోనే తేరుకుని, వెనకంజ వేయకుండా రిపేర్ ముగించింది. పనిలో దియాకు ఉన్న శ్రద్ధకు ఈ సంఘటనే ఉదాహరణ" అంటూ దియా తండ్రి, జోసెఫ్, కూతురిని కొనియాడుతున్నాడు. ప్రస్తుతం కాలేజీ హాస్టల్‌లో ఉంటూ ఇంజనీరింగ్ చదువుతున్న దియా, సెలవు రోజుల్లో ఇంటికొచ్చినప్పుడు, బుల్లెట్ రిపేర్ పనుల్లో మునిగిపోతూ ఉంటుంది. "ఈ పనిలో నేనెదుర్కొన్న ఒకే ఒక ఇబ్బంది నా వయసు, శరీర బరువు. రిపేర్ నేర్చుకుంటున్న సమయంలో బుల్లెట్, దాని విడిభాగాలను నేను మోయలేకపోయేదాన్ని. కానీ రెండేళ్ల వ్యవధిలో బుల్లెట్ బరువును ఎలా ఆపాలో, దాన్నెలా హ్యాండిల్ చేయాలో నేర్చుకోగలిగాను. ఇప్పుడు నాన్న సహాయం లేకుండా రిపేర్ పనులన్నీ చేయగలుగుతున్నాను. స్వయంగా బుల్లెట్ కూడా నడుపుతున్నాను కాబట్టి, రిపేర్ మీద మరింత అవగాహన పెరిగింది. ఎంతో మంది ఆడపిల్లల తల్లిదండ్రులు నన్ను ప్రేరణగా తీసుకుని, నచ్చిన కెరీర్ ఎంచుకునే అవకాశాన్ని వాళ్ల పిల్లలకు కల్పిస్తూ ఉండడం నాకెంతో సంతోషంగా ఉంది" అంటూ చెప్పుకొచ్చింది దియా.



పిల్లల్లో చురుకుదనం...

పిల్లలు చురుగ్గా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాల్సిందే. ఇంతకీ చిన్నపిల్లల మెదడు ఎదుగుదల కోసం ఇవ్వాల్సిన పోషకాహారాలేంటో తెలుసుకుందాం...

- కోడిగుడ్లలో న్యూట్రిన్లుతో పాటు బి12 విటమిన్ ఉంటుంది. వీటి వల్ల మెదడు అభివృద్ధికి ఉపయోగపడతాయి. దీంతో పాటు ప్రతిరోజూ కోడిగుడ్డు తింటే పిల్లల్లో బలం వస్తుంది.
- పాలు, పెరుగు, నెయ్యి లాంటి పాల ఉత్పత్తుల్లో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు విరివిగా లభిస్తాయి. ఇవి మెదడుకు శక్తినిస్తాయి. అందువల్ల పిల్లల్లో చురుకుదనం వస్తుంది.
- బీన్స్‌లో జింక్ శాతం ఉంటుంది. మెదడుకు ఎనర్జీని ఇస్తుంది. దీనివల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.
- కంది, పెసలు, అలచందలు, మినుములు, శనగలు.. లాంటి పప్పు ధాన్యాలతో చేసిన ఆహారం తినిపించాలి. వీటిల్లోని బి-విటమిన్ వల్ల మెదడు కణజాలం అభివృద్ధి చెందుతుంది. ముఖ్యంగా పిల్లల చర్మం మీద నొప్పులు తగ్గిపోతాయి.
- చిలగడదుంపలు, ఆలు, టొమాటోలు, క్యారెట్‌తో చేసిన ఆహారంతో పాటు.. ద్రాక్ష, బొప్పాయి.. లాంటి తాజా పండ్లను తినటం వల్ల సులువుగా జీర్ణం అవుతుంది. అంతేనా వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల పిల్లల్లో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. ప్రధానంగా మెదడు కణాల్లో శక్తి కలుగుతుంది. తద్వారా మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.
- జీడిపప్పు, పిస్తా, బాదం, పొద్దు తిరుగుడు విత్తనాలు లాంటివి తినటం వల్ల ప్రొటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్‌తో పాటు అధికంగా ఎ, బి విటమిన్లు లభ్యమవుతాయి. దీనివల్ల బ్రెయిన్ ఫంక్షనింగ్‌కు మంచిది.
- కూరల్లోకి శుద్ధమైన పసుపు వాడటం వల్ల పిల్లల మెదడు కణజాలం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా వారిలో వేగంగా నేర్చుకునే స్కిల్స్ పెరుగుతాయి.
- తాజా ఆకుకూరలతో పాటు ఓట్స్‌తో చేసిన ఆహారం తినటం వల్ల పిల్లల్లో చురుకుదనం వస్తుంది.
- చేపలు తినటం వల్ల ఇందులోని న్యూట్రిన్లు మెదడును చురుగ్గా ఉంచుతాయి. అంతేనా సీఫుడ్ తింటే పిల్లల ఆరోగ్యానికెంతో మంచిది. దీంతో పాటు పిల్లలు మంచి నీళ్లు బాగా తాగాలి. దీని వల్ల డీహైడ్రేషన్ ఉండదు. రక్తం సాఫీగా ప్రవహిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ అందుతుంది.



అమోఘంగా... గెలుపు సారథిగా...

కన్న బిడ్డ కోసం నలభై మూడేళ్ళ వయసులో ఫుట్‌బాల్ కోచ్‌గా మారారు గిరిజా కుమారి మధు. సెరిబ్రల్ పాల్సీకి గురైన బాలలకు శిక్షణ ఇచ్చి... ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో పతకాలు గెలిచేలా తీర్చిదిద్దారు. "వైకల్యాలున్న పిల్లలకు అండగా నిలవడం కన్నా గొప్ప సేవ మరేదీ ఉండదు" అంటున్న యాభయ్యేళ్ళ గిరిజ కథ...



"మాది కేరళలోని తామరకుళం గ్రామానికి చెందిన మధ్యతరగతి రైతు కుటుంబం. అయిదుగురు సోదరులు, ఇద్దరు అక్కాచెల్లెళ్ళ మధ్య పెరిగాను. కుటుంబం గడవడమే అంతంతమాత్రం కావడంతో... అందరికీ ఉన్నత విద్య చెప్పించే స్తోమత మా అమ్మానాన్నలకి లేదు. ఇంటర్ వరకూ చదివాను. నాన్న మరణించడంతో... ఇంటి బాధ్యతలు అమ్మ మీద పడ్డాయి. ఆమెకు అండగా ఉండాలనుకున్నాను. కొట్టాయంలో నర్సింగ్ కోర్సు పూర్తి చేసి, ఒక ఆసుపత్రిలో నర్సుగా రెండేళ్ళు పని చేశాను. ఆ తరువాత ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్ మధుసూదనన్‌తో నాకు వివాహమయింది. మాకు ఇద్దరు పిల్లలు. వాళ్ళు కాస్త పెరిగాక.. డిజైనింగ్ నేర్చుకొని, టైలరింగ్ ప్రారంభించాను. ముగ్గురు మహిళలను పనిలో పెట్టుకొని... పదేళ్ళ పాటు టైలరింగ్ షాపు నడిపాను.


ఇంగ్లీష్ రాకపోవడంతో...

నాకు బాల్యం నుంచి క్రీడలంటే ఇష్టం. బడిలో ఏ స్పోర్ట్స్ ఈవెంట్ జరిగినా ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. కానీ కుటుంబ పరిస్థితుల వల్ల అంతకన్నా ముందుకు కొనసాగలేకపోయాను. మా చిన్నబ్బాయికి ఫుట్‌బాల్ అంటే ఆసక్తి. వాడిని స్థానిక ఫుట్‌బాల్ అకాడమీలో చేర్చాను. వీలైనప్పుడల్లా వాడితో మైదానానికి వెళ్ళేదాన్ని. ఆ అకాడమీలో మంచి కోచ్‌లు ఉండేవారు. కానీ ఏవేవో కారణాలతో తరచూ మానేసేవారు.. దాంతో పిల్లల శిక్షణకు అంతరాయం కలిగేది. మా అబ్బాయిలో నిరాశ గమనించాక... నేనే కోచ్ అయితే ఎలా ఉంటుందనిపించింది. దానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నాను. అలెప్పీలో ఆరు రోజుల పాటు ఫుట్‌బాల్ కోచింగ్ కోర్సులో చేరాను. తొలి ప్రయత్నంలో... థియరీలో 72 శాతం మార్కులు సంపాదించినా.. ప్రాక్టికల్స్‌లో ఫెయిలయ్యాను. కొచ్చీలో మరోసారి అదే కోర్సు చేసి.. సర్టిఫికెట్ సంపాదించాను. స్థానికంగా పిల్లలకు శిక్షణ మొదలుపెట్టాను. అప్పుడే ముంబాయిలోని పిళ్ళై గ్రూప్ వాళ్ళు స్పోర్ట్స్ మేనేజిమెంట్‌లో నిర్వహిస్తున్న ఎఫ్ఐఎఫ్ఎ/సిఐసిఎస్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ గురించి తెలిసింది. ముంబాయిలోని వాళ్ళ కార్యాలయానికి వెళ్ళినపుడు... నాకు ఇంగ్లీష్ బాగా రాకపోవడంతో ఇబ్బందిపడ్డాను. వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనుకున్నాను. అక్కడ ఉన్న డాక్టర్ సెలీనా జోయ్ అనే మలయాళీ మహిళ నా పరిస్థితి అర్థం చేసుకున్నారు. "ఒత్తిడి పడకండి. మీకు తెలిసినవన్నీ మలయాళంలోనే చెప్పండి" అని ప్రోత్సహించారు. ఆమె సాయంతో కోర్సుకు అప్లై చేశాను. ఇంటర్వ్యూ సమయానికి నా ఇంగ్లీష్ మెరుగుపరుచుకున్నాను. నా ఉత్సాహాన్ని గమనించిన ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు నాకు అడ్మిషన్ ఇచ్చారు. ఈలోగా కొవిడ్ రావడంతో... బోధన ఆన్‌లైన్‌లో సాగింది. 2021లో... ఏడాది వ్యవధి ఉండే ఆ కోర్సు పూర్తి చేసిన.. కేరళ సీనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ జట్టుకు మేనేజర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. అలాగే ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ 'గోల్డెన్ బేబీ లీగ్'లోనూ కోచ్‌గా చేరాను. ఆ లీగ్‌లో ప్రతి సంవత్సరం 500 మంది గ్రామీణ బాలలకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇస్తారు. 'సెరిబ్రల్ పాల్సీ (సీపీ) స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'ను నడిపిస్తున్న కవితా సురేశ్‌ను అక్కడే కలుసుకున్నాను. ఆ పరిచయం నా జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పింది.

> ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ 'గోల్డెన్ బేబీ లీగ్'లోనూ కోచ్‌గా చేరాను. ఆ లీగ్‌లో ప్రతి సంవత్సరం 500 మంది గ్రామీణ బాలలకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇస్తారు. 'సెరిబ్రల్ పాల్సీ (సీపీ) స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'ను నడిపిస్తున్న కవితా సురేశ్‌ను అక్కడే కలుసుకున్నాను. ఆ పరిచయం నా జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పింది.

దేవునికి కృతజ్ఞతగా...

సెరిబ్రల్ పాల్సీకి గురైన పిల్లల కోసం పలు కార్యక్రమాలను కవిత నిర్వహిస్తున్నారు. కేరళలో వారికోసం ఒక ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రారంభించాలని ఆమె చేసిన ప్రతిపాదన నాకు ఎంతగానో నచ్చింది. ఈ విషయం మా ఇంట్లో చర్చించినప్పుడు... అందరూ మద్దతునిచ్చారు. ముందుగా కేరళ రాష్ట్రంలో సెరిబ్రల్ పాల్సీ బాధితులైన పిల్లల వివరాలు సేకరించాను. వారి తల్లితండ్రులను కలిసి... ఆ పిల్లల స్థితిగతుల గురించి తెలుసుకున్నాను. రోజువారీ జీవనంలో వారు ఎదుర్కొనే సమస్యలను అవగాహన చేసుకున్నాను. ఆహారాన్ని తినడానికి సైతం వాళ్ళు పడుతున్న ఇబ్బందులు చూసి... నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. సమాజం వారిని జాలిగానో, నిర్లక్ష్యంగానో చూస్తుంది. తల్లితండ్రులకు వారి భవిష్యత్తు గురించి తీవ్రమైన ఆందోళన, భయం ఉంటాయి. నా వంతు చేయూత అందించి... వారి సామర్థ్యాన్ని నిరూపించుకొనే అవకాశం కల్పించాలని నిర్ణయించుకున్నాను. 2021లో 'సెరిబ్రల్ పాల్సీ ఫుట్‌బాల్ అసోసియేషన్' ఏర్పాటు చేశాను. మొదటి విడతగా... నా సొంత ఊరైన తామరకుళంలో శిక్షణ శిబిరం నిర్వహించాం. పిల్లలకు రోజువారీ పనుల్లో సాయం అందించడానికి కొందరు తల్లితండ్రుల సహకారం తీసుకున్నాం. ఆ శిబిరానికి మంచి స్పందన వచ్చింది. శిక్షణ పొందిన పిల్లలు వివిధ పోటీల్లో విజయాలు సాధించారు. ఇది మాకు మరింత ఉత్సాహాన్నివ్వడంతో... శిబిరాలను రెగ్యులర్‌గా కొనసాగిస్తున్నాం. మూడేళ్ళలో 250 మందికి పైగా... సెరిబ్రల్ పాల్సీ బాధిత పిల్లలు శిక్షణ పొందారు. కిందటి ఏడాది డిసెంబర్‌లో జరిగిన 'ఖేలో ఇండియా పారా గేమ్స్'తో సహా... పాల్గొన్న అయిదు జాతీయ స్థాయి ఈవెంట్లలోనూ వాళ్ళు పతకాలు సాధించారు. రాబోయే నెలల్లో జరగబోయే మరిన్ని ఈవెంట్లలో తమ సత్తా చూపడానికి సిద్ధమవుతున్నారు. అలాగే... వైకల్యాలున్న, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని పిల్లలకు క్రీడలతో పాటు ఇతర అంశాల్లో నైపుణ్యాలు కల్పించడానికి 'అమోఘా ఫౌండేషన్' పేరిట ఒక సంస్థను 2023లో స్థాపించాను. దానిద్వారా ఇప్పటికి ఇరవై మంది పిల్లలకు స్కూటర్లను, ల్యాప్‌టాప్‌లనూ అందజేశాను. వివిధ ఫుట్‌బాల్ అకాడమీలకు కోచ్‌గా నేను సంపాదించే డబ్బులో ఎక్కువ భాగం నా సంస్థ కోసమే ఖర్చు చేస్తున్నాను. మా పిల్లలు, బంధువులు, స్నేహితులు... ప్రతి ఒక్కరూ నేను చేసే పనులకు అండగా నిలుస్తున్నారు. వైకల్యాలున్న పిల్లలకు సాయం చెయ్యడం కన్నా గొప్ప సేవ మరేదీ ఉండదు. ఆరోగ్యవంతమైన పిల్లలను నాకు ఇచ్చిన దేవుడికి కృతజ్ఞతగా... నాకు ఓపిక ఉన్నంతకాలం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాను."



మెయిన్ డ్రాకు మాళవిక



ఆసియా బ్యాడ్మింటన్

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు మాళవిక బన్సోద్, రీతుపర్ణ, శ్వేతపర్ణ మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. మంగళవారం ముగిసిన క్వాలిఫయర్స్‌లో సింగిల్స్ తొలి మ్యాచ్‌లో 21-18, 21-10తో నురాణి అజ్జహ్ (యూఏఈ)పై గెలిచిన మాళవిక.. రెండో మ్యాచ్‌లో 21-4, 21-5తో సోఫియా జకిరోవా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించి మెయిన్ డ్రాలో ప్రవేశించింది. మహిళల డబుల్స్ క్వాలిఫయింగ్ ఆఖరి మ్యాచ్‌లో రీతుపర్ణ-శ్వేతపర్ణ జోడీ 21-6, 21-6తో వెంగ్ చి ఎన్ జి-ఫుయి చి వా (మకావు) జంటపై నెగ్గి మెయిన్ డ్రాకు చేరుకుంది. ఇక, బుధవారం నుంచి జరిగే మెయిన్ డ్రా పోటీల్లో సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు, ప్రియాన్షు రజావత్, లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ఆకర్షి కశ్యప్, డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్-సాయి ప్రతీక్, గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో అర్జున్-ధ్రువ్ కపిల బరిలోకి దిగుతున్నారు.

పాక్ జట్టులోకి మళ్లీ ఆమిర్

కరాచీ: నాలుగేళ్ల తర్వాత పేసర్ మహ్మద్ ఆమిర్ తిరిగి పాకిస్థాన్ జట్టులో ఆడనున్నాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడే పాక్ జట్టును మంగళవారం ప్రకటించారు. బాబర్ ఆజమ్ నేతృత్వంలోని 17 మంది సభ్యుల ఈ జట్టుకు మాజీ క్రికెటర్ అజర్ మెహమూద్‌ను కోచ్‌గా ఎంపిక చేశారు. ఈనెల 18 నుంచి 27 వరకు జరిగే ఈ సిరీస్‌లోని తొలి మూడు మ్యాచ్‌లకు రావల్పిండి, చివరి రెండు మ్యాచ్‌లకు లాహోర్ ఆతిథ్యమివ్వనున్నాయి. కాగా జట్టుకు ఎంపికైన ఆమిర్ 2020, ఆగస్టులో తన చివరి మ్యాచ్ ఆడాడు. అలాగే ఆల్‌రౌండర్ ఇమాద్ వసీమ్‌ను సైతం ఎంపిక చేశారు. ఈ ఇద్దరూ ఇటీవలే తమ రిటైర్మెంట్‌ను ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఇర్ఫాన్ ఖాన్, ఉస్మాన్ ఖాన్‌లకు కొత్తగా జట్టులో చోటు దక్కింది.

ఐశ్వర్య కాంస్యం.. రజతమయ్యే అవకాశం



న్యూఢిల్లీ: గతేడాది ఆసియా చాంపియన్‌షిప్స్‌లో 400 మీ. రేస్‌లో భారత అథ్లెట్ ఐశ్వర్య మిశ్రా సాధించిన కాంస్యం.. రజతమయ్యే అవకాశాలున్నాయి. ఆ రేస్‌లో రెండో స్థానంలో నిలిచిన ఫరీదా సొలియేవా (ఉజ్బెకిస్థాన్) డోపింగ్‌లో పట్టుబడింది. దీంతో 2023, జూలై 13 తర్వాత పాల్గొన్న రేసుల నుంచి ఆమెను డిస్‌క్వాలిఫై చేశారు. ఫరీదా సాధించిన పతకాలను వెనక్కు తీసుకోనున్నారు. దీంతో ఐశ్వర్యకు రజతం లభించవచ్చు.

బిల్లీ జీన్ కప్‌లో భారత్ శుభారంభం

చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ తొలి రౌండ్‌లో భారత టెన్నిస్ జట్టు శుభారంభం చేసింది. మంగళవారం ప్రారంభమైన ఈ పోటీల్లో భారత్ 3-0తో పసిఫిక్ ఓసియానియాపై విజయం సాధించింది. తొలుత జరిగిన సింగిల్స్ పోరులో అంకిత రైనా 6-1, 6-3తో సావోయిర్స్ బ్రీన్‌పై, రుతుజా భోస్లే 6-0, 6-0తో తరణి కామోపై, డబుల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక-ప్రార్థన తొంబరే జోడీ 6-1, 6-1తో మెహెటియా బూసి-రూబీ కాఫిన్ ద్వయంపై నెగ్గింది. బుధవారం జరిగే రెండో రౌండ్‌లో ఆతిథ్య చైనాతో భారత్ తలపడనుంది.



మేం ఓల్డ్.. కానీ గోల్డ్

లండన్: ప్రపంచ టెన్నిస్ పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో నెంబర్ వన్ ర్యాంకర్లుగా కొనసాగుతున్న సెర్బియా స్టార్ జొకోవిచ్ (36), భారత ఏస్ రోహన్ బోపన్న (44) మాంటే కార్లో మాస్టర్స్ టోర్నీ సందర్భంగా సరదాగా మాట్లాడుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను పురుషుల టెన్నిస్ సమాఖ్య సోషల్ మీడియాలో పోస్టు చేసింది. 'టెన్నిస్ మనకు ఎన్నో అద్భుత విషయాలను నేర్పుతుంది. అనుభవం ఎప్పుడూ గెలుస్తుందనేది నాకు బోధపడింది' అని బోపన్న వ్యాఖ్యానించగా.. 'అనుభవం ఒక్కటే కాదు.. తగిన నిబద్ధత, అంకిత భావం కూడా అవసరం' అని నొవాక్ చెప్పాడు. బోపన్న ఇప్పుడు కూడా జిమ్‌లో ఎంతో శ్రమిస్తాడని జొకో కొనియాడాడు. ఇక, అవకాశం దొరికితే భారత్‌లో ఆడాలనుకొంటున్నట్టు జొకోవిచ్ చెప్పాడు. చివరగా 'మేం ఓల్డ్.. కానీ గోల్డ్' అని అన్న నొవాక్.. నమస్తే అంటూ ముగించాడు. పెద్ద వయసులో టాప్ ర్యాంక్‌లో నిలిచిన టెన్నిస్ ఆటగాళ్లుగా వీరిద్దరూ రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే.

తెలుగోడి సత్తా

● అదరగొట్టిన నితీశ్ కుమార్ ● సన్‌రైజర్స్ ఉత్కంఠ విజయం ● పోరాడిన పంజాబ్

నేటి మ్యాచ్
రాజస్థాన్ X గుజరాత్
వేదిక: జైపూర్-రా.7.30 గం.



నితీశ్ కుమార్ (37 బంతుల్లో 64)

విశాఖ కెరటం

నితీశ్ రెడ్డి స్వస్థలం విశాఖపట్నం. నితీశ్ 2020లో కేరళపై రంజీల్లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత అనతి కాలంలోనే ఆంధ్ర రంజీ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. ఈ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ ఇప్పటివరకు 17 రంజీ మ్యాచుల్లో 566 పరుగులు, 52 వికెట్లు తీశాడు. నిరుడు ఐపీఎల్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అరంగేట్రం చేసిన 20 ఏళ్ల నితీశ్‌కు రెండే మ్యాచ్‌ల్లో చాన్స్ దక్కింది. ఈ రెండింట్లోనూ బౌలింగ్ తప్ప, బ్యాటింగ్ చేసే చాన్స్ దక్కలేదు. ఇక ఈ ఐపీఎల్‌లో గతవారం హైదరాబాద్ వేదికగా చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఆఖర్లో బ్యాటింగ్‌కు వచ్చి 8 బంతుల్లో 14 (నాటౌట్) పరుగులు సాధించాడు. ఇక, పంజాబ్‌తో మ్యాచ్‌లో అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంటూ తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి అర్ధ శతకం నమోదు చేశాడు. నితీశ్ బ్యాట్‌తోనే కాకుండా బంతితోనూ ఆంధ్ర జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. బ్యాటర్‌గా కెరీర్ మొదలు పెట్టిన నితీశ్ అనంతరం పేస్ బౌలింగ్‌లోనూ ప్రావీణ్యం సంపాదించాడు. హార్దిక్ పాండ్యా, బెన్ స్టోక్స్‌ను అభిమానించే నితీశ్, ఐపీఎల్‌లో సత్తా చాటితే భవిష్యత్‌లో టీమిండియా తలుపు తట్టే అవకాశాలున్నాయి.

ముల్లాపూర్ (చండీగఢ్): ఉత్కంఠ పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆఖరి బంతికి ఊపిరిపీల్చుకుంది. రైజర్స్ తరఫున తొలిసారి ఓ తెలుగు క్రికెటర్ అదరగొట్టాడు. జట్టు కష్టాల్లో ఉన్న వేళ నితీశ్ కుమార్ రెడ్డి (37 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 64) అర్ధసెంచరీతో సత్తా చూపగా, బౌలర్లు సైతం మెరుగ్గా రాణించారు. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌ను 2 పరుగులతో ఓడించింది. అయితే పంజాబ్‌కు ఆరు బంతుల్లో 29 పరుగులు కావాల్సిన వేళ శశాంక్ సింగ్ (25 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 46 నాటౌట్), అశుతోష్ శర్మ (15 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 33 నాటౌట్) సిక్సర్లతో రైజర్స్‌కు వణుకు పుట్టించారు. కానీ జట్టు 26 పరుగులకే పరిమితం కావడంతో చేసేదేమీలేకపోయింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. సమద్ (25), హెడ్ (21) పర్వాలేదనిపించారు. అర్ష్‌దీప్‌కు 4.. హర్షల్, కర్రాన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 180 పరుగులు చేసి ఓడింది. భువనేశ్వర్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నితీశ్ నిలిచాడు.

చివర్లో జోరు చూపినా..: ఈ పిచ్‌పై ఓ మాదిరి ఛేదనే అయినా పంజాబ్ బ్యాటర్ల ఆటతీరు భిన్నంగా సాగింది. ఆఖర్లో శశాంక్, అశుతోశ్ బ్యాట్లు ఝుళిపించినా నిరాశే మిగిలింది. పేసర్లు భువనేశ్వర్, కమిన్స్ పదునైన బంతులతో ఇబ్బందిపెట్టడమే కాకుండా తొలి నాలుగు ఓవర్లలోనే ఓపెనర్ బెయిర్‌స్టో (0), ప్రభ్‌సిమ్రన్ (4), కెప్టెన్ ధవన్ (14)లను పెవిలియన్‌కు చేర్చారు. దీంతో పవర్‌ప్లేలో జట్టు కేవలం 27 పరుగులతో నిలిచింది. ఏ జట్టుకైనా ఈ సీజన్‌లో ఇదే అత్యల్పం. ఇక నితీశ్ తొలి ఓవర్‌లోనే సికిందర్ రజా(28) రెండు ఫోర్లు, కర్రాన్ (29) ఓ ఫోర్‌తో 13 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత కూడా కర్రాన్ భారీ సిక్సర్లతో జోరు చూపాడు. కానీ పదో ఓవర్‌లోనే అతడి దూకుడును నటరాజన్ ముగించాడు. కమిన్స్ సూపర్ క్యాచ్‌తో నాలుగో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే రజాను ఉనాద్కట్ అవుట్ చేయడంతో 91/5 స్కోరుతో పంజాబ్ ఓటమి ఖాయమనిపించింది. అటు జితేశ్ (19) వేగంగా ఆడే యత్నంలో నితీశ్‌కు దొరికాడు. నితీశ్‌కు ఇది టీ20 కెరీర్‌లో తొలి వికెట్. ఈ దశలో 17వ ఓవర్‌లో శశాంక్ 3 ఫోర్లు, తర్వాతి ఓవర్‌లో అశుతోశ్ 2 ఫోర్లతో జోరు చూపారు. ఇక ఆఖరి ఓవర్‌లో 29 రన్స్ అవసరపడగా.. అశుతోశ్ 2 సిక్సర్లు బాది ఉత్కంఠ పెంచాడు. అయితే ఆఖరి బంతికి 9 రన్స్ కావాల్సిన వేళ శశాంక్ సిక్సర్ కొట్టినా ఫలితం లేకపోయింది.

నితీశ్ అండతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌ను పంజాబ్ పేసర్లు ఆరంభంలోనే కట్టడి చేశారు. పేసర్లు అర్ష్‌దీప్, హర్షల్ ధాటికి వికెట్లు కోల్పోతున్న దశలో.. నాలుగో ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ మాత్రం అదరగొట్టాడు. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడి తొలి 18 బంతుల్లో 14 పరుగులే చేసినా.. చివరి 19 బంతుల్లో 50 పరుగులతో చెలరేగి జట్టు సవాల్ విసిరే స్కోరుకు దోహదపడ్డాడు. మొదట ట్రావిస్ హెడ్, మార్‌క్రమ్ (0), అభిషేక్ (16) 39 పరుగుల వద్దే పెవిలియన్‌కు చేరడంతో రైజర్స్‌కు షాక్ తగిలింది. ఇన్నింగ్స్ తొలి బంతికే హెడ్ క్యాచ్ అవుటైనా పంజాబ్ రివ్యూ కోరలేదు. కానీ నాలుగో ఓవర్‌లో హెడ్, మార్‌క్రమ్ (0) వికెట్లను పేసర్ అర్ష్‌దీప్ పడగొట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్‌ను కర్రాన్ అవుట్ చేయడంతో పవర్‌ప్లేలో జట్టు 40/3 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ స్థితిలో 140 పరుగులు కూడా కష్టమే అనిపించింది. అటు ఇంపాక్ట్ సబ్‌గా వచ్చిన రాహుల్ త్రిపాఠి (11) కూడా నిరాశపరిచాడు. 11వ ఓవర్‌లో నితీశ్ 4,6తో బ్యాట్‌కు పనిజెప్పాడు. రబాడ, కర్రాన్ ఓవర్లలోనూ తను ఒక్కో సిక్సర్‌తో ఆకట్టుకున్నాడు. అయితే 14వ ఓవర్‌లో ప్రమాదకర క్లాసెన్ (9)ను హర్షల్ అవుట్ చేయడంతో పంజాబ్ సంబరాలు చేసుకుంది. కానీ నితీశ్ వారికి ఝలక్ ఇస్తూ గేరు మార్చాడు. 15వ ఓవర్‌లో వరుసగా 4,6,4,6తో 22 పరుగులు రాబట్టడమే కాకుండా తన టీ20 కెరీర్‌లోనే తొలి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అటు అబ్దుల్ సమద్ కూడా వేగం కనబర్చడంతో పంజాబ్ బౌలర్లు లయ తప్పారు. కానీ అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ జోడీని అర్ష్‌దీప్ విడదీశాడు. 16వ ఓవర్‌లో ఇద్దరినీ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 20 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 19వ ఓవర్‌లో షాబాజ్ (14 నాటౌట్) 4,6తో 15 రన్స్ రాగా.. ఆఖరి ఓవర్‌లోనూ 11 పరుగులు రాబట్టడంతో స్కోరు 180 దాటగలిగింది.



అర్ష్‌దీప్ (4-0-29-4)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
రాజస్థాన్	4	4	0	0	8	1.120
కోల్‌కతా	4	3	1	0	6	1.528
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	5	3	2	0	6	0.666
హైదరాబాద్	5	3	2	0	6	0.344
పంజాబ్	5	2	3	0	4	-0.196
గుజరాత్	5	2	3	0	4	-0.797
ముంబై	4	1	3	0	2	-0.704
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర.రే: నెట్ రన్‌రేట్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	ముస్తాఫిజుర్ (చెన్నై)
316 పరుగులు	9 వికెట్లు





స్కోరుబోర్డు

హైదరాబాద్: హెడ్ (సి) ధవన్ (బి) అర్ష్‌దీప్ 21, అభిషేక్ (సి) శశాంక్ (బి) కర్రాన్ 16, మార్‌క్రమ్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 0, నితీశ్ కుమార్ రెడ్డి (సి) రబాడ (బి) అర్ష్‌దీప్ 64, త్రిపాఠి (సి) జితేశ్ (బి) హర్షల్ 11, క్లాసెన్ (సి) కర్రాన్ (బి) హర్షల్ 9, సమద్ (సి) హర్షల్ (బి) అర్ష్‌దీప్ 25, షాబాజ్ (నాటౌట్) 14, కమిన్స్ (బి) రబాడ 3, భువనేశ్వర్ (సి) బెయిర్‌స్టో (బి) కర్రాన్ 6, ఉనాద్కట్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 182/9; వికెట్ల పతనం:** 1-27, 2-27, 3-39, 4-64, 5-100, 6-150, 7-151, 8-155, 9-176; **బౌలింగ్:** రబాడ 4-0-32-1, అర్ష్‌దీప్ సింగ్ 4-0-29-4, కర్రాన్ 4-0-41-2, హర్షల్ పటేల్ 4-0-30-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-48-0.

పంజాబ్: ధవన్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) భువనేశ్వర్ 14, బెయిర్‌స్టో (బి) కమిన్స్ 0, ప్రభ్‌సిమ్రన్ (సి) నితీశ్ (బి) భువనేశ్వర్ 4, కర్రాన్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 29, సికందర్ (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 28, శశాంక్ (నాటౌట్) 46, జితేశ్ (సి) అభిషేక్ (బి) నితీశ్ 19, అశుతోష్ (నాటౌట్) 33, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 180/6; వికెట్ల పతనం:** 1-2, 2-11, 3-20, 4-58, 5-91, 6-114; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-1-32-2, కమిన్స్ 4-0-22-1, నటరాజన్ 4-0-33-1, నితీశ్ కుమార్ రెడ్డి 3-0-33-1, ఉనాద్కట్ 4-0-49-1, షాబాజ్ 1-0-10-0.

బిజినెస్

నాట్కో ఫార్మాకు ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖ

న్యూఢిల్లీ: తెలంగాణలోని కొత్తూరులో ఉన్న నాట్కో ఫార్మా యూనిట్‌కు అమెరికన్ డ్రగ్ రెగ్యులేటర్ ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖ జారీ చేసింది. ఫారం 483 కింద తమకు ఈ లేఖ అందినట్టు కంపెనీ ప్రకటించింది. ఈ యూనిట్లో ఎఫ్‌డీఏ గత ఏడాది అక్టోబరు 9-18 తేదీల మధ్యలో ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. సోమవారం నాడు ఎఫ్‌డీఏ నుంచి తమకు ఈ లేఖ అందినట్టు రెగ్యులేటరీ సమాచారంలో నాట్కో ఫార్మా ప్రకటించింది. నిర్దేశిత గడువు లోగా దానికి స్పందించి అవసరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. తమ సరఫరాలపై గాని, ఆదాయాలపై గాని ఈ లేఖ ప్రభావం ఏమీ ఉండబోదని తెలిపింది.

విమాన చార్జీలకు రెక్కలు

20- 25% వరకు పెరిగిన రేట్లు
విస్తారా సర్వీసుల రద్దు, వేసవి గిరాకీయే కారణం



న్యూఢిల్లీ: ఈ వేసవిలో విమాన చార్జీలు మరింత ప్రియమయ్యాయి. కొన్ని మార్గాల్లో ఎయిర్ టికెట్ ధరలు 20-25 శాతం వరకు పెరిగాయి. విస్తారా ఎయిర్‌లైన్స్ సర్వీసుల రద్దుతో పాటు వేసవి కావడంతో విమానయాన సేవలకు డిమాండ్ ఒక్క సారిగా పెరగడం ఇందుకు ప్రధాన కారణమని ;పరిశ్రమ నిపుణులు పేర్కొన్నారు. పైలట్ల సంక్షోభం కారణంగా విస్తారా రోజుకు 25-30 విమాన సర్వీసులు లేదా రోజువారీ షెడ్యూలులో 10 శాతం సర్వీసులను తగ్గించుకుంది. దివాలా తీసిన గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ గతంలోనే సేవలను నిలిపివేయడంతో పాటు ఇంజన్ సమస్యల కార ణంగా ఇండిగోకు చెందిన 70 విమానాలు మూలనపడటంతో పరిశ్రమ సేవల సామ ర్థ్యం ఇప్పటికే తగ్గింది. దీనికి విస్తారా పైలట్ల సంక్షోభం జోడై ఈ సమస్య మరింత తీవ్రమయింది. పర్యాటక సేవల పోర్టల్ ఇక్సిగో విశ్లేషణ ప్రకారం.. ఈనెల 1-7 తేదీల్లో కొన్ని దేశీయ మార్గాల్లో విమాన సర్వీసుల స్పాట్ చార్జీలు గత నెల ఇదే కాలంతో పోలిస్తే 39 శాతం వరకు పెరిగాయి. గత వారం ఢిల్లీ-బెంగళూరు సర్వీసు స్పాట్ టికెట్ రేటు 39 శాతం ఎగబాకగా.. ఢిల్లీ-శ్రీనగర్ చార్జీ 30 శాతం, ఢిల్లీ-ముంబై చార్జీ 12 శాతం, ముంబై-ఢిల్లీ రూట్లో 8 శాతం పెరిగాయి. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో కలిపి ఎయిర్ టికెట్ చార్జీల పెరుగుదల 20-25 శాతంగా ఉండవచ్చని ప్రముఖ ట్రావెల్ పోర్టల్ యాత్రా. కామ్ ఎయిర్ అండ్ హోటల్ బిజినెస్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ భరత్ మాలిక్ అన్నారు. విస్తారా సర్వీసుల రద్దు కీలక దేశీయ మార్గాల్లో విమాన చార్జీలపై గణనీయ ప్రభావం చూపిందన్నారు. ఢిల్లీ నుంచి గోవా, కొచి, జమ్ము, శ్రీనగర్‌కు నడిచే విమానాలకు అధిక డిమాండ్ నెలకొనడంతో ఈ మార్గాల్లో టికెట్ ధరలు అధికంగా పెరిగాయన్నారు.

సెన్సెక్స్ @ 75,000

ఇంట్రాడేలో సరికొత్త శిఖరాలకు

చివరికి స్వల్ప నష్టాల్లో ముగింపు



ముంబై: భారత స్టాక్ మార్కెట్‌లో వరుసగా రెండో రోజూ రికార్డుల ర్యాలీ కొనసాగింది. ఈక్విటీ సూచీలు మంగళవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో సెన్సెక్స్ తొలిసారిగా 75,000 మైలురాయిని తాకింది. నిఫ్టీ 22,750 మార్క్‌ను దాటింది. ఆల్ టైం రికార్డు గరిష్ఠ స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి.

మరిన్ని విషయాలు..

- ఒకదశలో సెన్సెక్స్ 381.78 పాయింట్ల వృద్ధితో 75,124.28 వద్ద, నిఫ్టీ 102.1 పాయింట్ల లాభంతో 22,768.40 వద్ద సరికొత్త జీవనకాల ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. మధ్యాహ్నం నుంచి అమ్మకాలు పెరగడంతో సూచీలు క్రమంగా కిందికి జారాయి. చివరికి సెన్సెక్స్ 58.80 పాయింట్ల నష్టంతో 74,683.70 వద్ద, నిఫ్టీ 23.55 పాయింట్లు కోల్పోయి 22,642.75 వద్ద స్థిరపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.47 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.15 శాతం తగ్గాయి.
- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 12 లాభపడగా.. 18 నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 1.87 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.
- పసిడి ధరలు ఢిల్లీలో సరికొత్త రికార్డు స్థాయికి చేరాయి. 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం మరో రూ.140 పెరిగి రూ.71,840కి ఎగబాకింది. కిలో వెండి సైతం రూ.500 పెరుగుదలతో రూ.84,500 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,350 డాలర్లు, వెండి 28 డాలర్ల ఎగువకు చేరాయి.

పదేళ్లలో మూడింతలు

2014 మేలో తొలిసారిగా 25,000 మైలురాయిని చేరిన సెన్సెక్స్.. గడిచిన పదేళ్లలో మూడింతలై 75,000 స్థాయికి ఎగబాకింది. 2021లో సూచీ 50,000 మైలురాయిని తాకింది. అంటే, 25,000 నుంచి 50,000కు చేరుకునేందుకు దాదాపు ఆరున్నరేళ్లు పట్టింది. ఆ తర్వాత 25,000 పాయింట్ల (50,000 నుంచి 75,000కు) పరుగును 3 సంవత్సరాల 3 నెలల్లోనే పూర్తి చేసింది. గడిచిన ఏడాది కాలంలో సెన్సెక్స్ 25 శాతం వృద్ధిని కనబరిచింది. 2023 ఏప్రిల్ 21న నమోదైన సూచీ 52 వారాల కనిష్ఠ స్థాయి 59,412.81 వద్ద నుంచి 26 శాతానికి పైగా పెరిగింది. అంతేకాదు, ఈ మార్చి 6న 74,000 మైలురాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం 24 ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్లు పెరిగి 75వేలకు చేరుకోవడం విశేషం. గత ఏడాది డిసెంబరులోనైతే సూచీ ఏకంగా 5,000 పాయింట్లు (68,000 నుంచి 72,000కు)పుంజుకుంది.

మారుతి మనేసార్ ప్లాంట్ సామర్థ్యం విస్తరణ

న్యూఢిల్లీ: మనేసార్‌లోని తమ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష యూనిట్ల మేరకు పెంచినట్టు మారుతి సుజుకీ ప్రకటించింది. మనేసార్‌లో పని చేస్తున్న మూడు తయారీ ప్లాంట్లలో ప్లాంట్-ఎలో ఒక అదనపు అసెంబ్లీ లైన్ జోడించినట్టు తెలిపింది. ఈ లైన్ తయారీ సామర్థ్యం లక్ష యూనిట్లని, దీంతో మనేసార్ ప్లాంట్ మొత్తం తయారీ సామర్థ్యం 9 లక్షలకు పెరిగిందని తెలియచేసింది.

యూనికార్న్‌లలో భారత్ నం.3

2023 చివరినాటికి దేశంలో 67 యూనికార్న్‌లు • అంతక్రితం సంవత్సరంతో పోలిస్తే తగ్గిన సంఖ్య



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక యూనికార్న్‌లు కలిగిన దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. గత ఏడాది చివరినాటికి దేశంలోని యూనికార్న్‌ల నికర సంఖ్య 67గా నమోదైందని 'హురున్ గ్లోబల్ యూనికార్న్ ఇండెక్స్ 2024' వెల్లడించింది. 703 యూనికార్న్‌లతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా.. చైనా (340 యూనికార్న్‌లు) రెండో స్థానాన్ని దక్కించుకుంది. భారత్ తర్వాత యునైటెడ్ కింగ్‌డమ్ (53), జర్మనీ (36) వరుసగా 4, 5 స్థానాల్లో నిలిచాయి. కనీసం బిలియన్ డాలర్ల (రూ.8,300 కోట్లు) మార్కెట్ విలువ కలిగిన స్టార్టప్‌ను యూనికార్న్‌గా పిలుస్తారు. ప్రపంచ యూనికార్న్‌ల మొత్తం మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది గత ఏడాది జపాన్ జీడీపీతో సమానం. నివేదిక ముఖ్యాంశాలు..

- 2022లో దేశంలో 68 యూనికార్న్‌లుండగా.. 2023లో సంఖ్య 67 తగ్గింది. 2017 నుంచి హురున్ ప్రపంచ యూనికార్న్‌ల సూచీని విడుదల చేస్తూ వస్తోంది. అప్పటి నుంచి భారత్‌లో వీటి సంఖ్య తగ్గడం ఇదే మొదటిసారి. అంతర్జాతీయ అనిశ్చితులు, ఆర్థిక మందగమనం నేపథ్యంలో స్టార్టప్‌ల రంగంలోకి పెట్టుబడులు భారీగా తగ్గడం ఇందుకు ప్రధాన కారణం.
- భారతీయులు స్వదేశంలో కంటే విదేశాల్లోనే అధిక యూనికార్న్‌లను ఏర్పాటు చేయగలిగారు. భారతీయులు సహ వ్యవస్థాపకులుగా ఉన్న స్టార్టప్‌లలో ఇప్పటికే 109 యూనికార్న్ హోదాను సాధించాయి. అందులో 95 అమెరికాలోనే ఉన్నాయి.
- అత్యధిక యూనికార్న్‌లకు వేదికైన ప్రపంచ నగరాల జాబితాలో బెంగళూరు 6 నుంచి 7 స్థానానికి జారుకుంది. దేశంలోని 67 యూనికార్న్‌లలో 32 బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కాగా, 14 యూనికార్న్‌లతో ముంబై 20 నుంచి 19వ స్థానానికి ఎగబాకింది.
- దేశంలో అతిపెద్ద ఎడ్యుటెక్ స్టార్టప్ బైజూస్‌తోపాటు ఫార్మ్ ఈజీ మార్కెట్ విలువ భారీ క్షీణత కారణంగా ఈ సారి యూనికార్న్‌ల జాబితాలో స్థానం కోల్పోయాయి.
- చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ 22,000 కోట్ల డాలర్ల మార్కెట్ విలువతో ప్రపంచంలోనే అత్యంత విలువైన యూనికార్న్‌గా నిలిచింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ (18,000 కోట్ల డాలర్లు) రెండో స్థానంలో ఉంది. కాగా, జనరేటివ్ ఏఐ అప్లికేషన్ 'చాట్‌జీపీటీ'ని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐ 10,000 కోట్ల డాలర్ల మార్కెట్ వేల్యూతో మూడో స్థానానికి ఎగబాకింది.
- ప్రపంచంలోని అత్యంత విలువైన 100 యూనికార్న్‌లలో భారత్ నుంచి స్విగ్గీ (83వ స్థానం), డ్రీమ్11 (83), రేజర్ పే (94), ఓలా (100) ఉన్నాయి.

గ్లాండ్ ఫార్మాలో రూ.1,411 కోట్ల బ్లాక్ డీల్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న గ్లాండ్ ఫార్మా కౌంటర్‌లో మంగళవారం రూ.1,4,11 కోట్ల విలువైన బ్లాక్ డీల్ చోటు చేసుకుంది. కంపెనీ మాజీ ప్రమోటర్ డాక్టర్ పెన్మత్సకు చెందిన లకుమి ట్రస్టు, నికోమాక్ మెషినరీ సంస్థలు, కంపెనీ ఈక్విటీలో 4.9 శాతానికి సమానమైన 81.20 లక్షల షేర్లను ఈ బ్లాక్ డీల్ ద్వారా విక్రయించాయి. ఈ రెండు సంస్థలు ఈ షేర్లను ఒక్కోటి రూ.1,735.31 నుంచి 1,739.10 మధ్య విక్రయించాయి. ఈ రెండు సంస్థల నుంచి ఈ షేర్లను ఎవరు కొన్నదీ ఇంకా వెల్లడి కాలేదు. దీంతో ఎన్‌ఎస్ఈలో గ్లాండ్ ఫార్మా షేర్లు 2.83 శాతం నష్టంతో రూ.1,807 వద్ద క్లోజయ్యాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ



హైదరాబాద్	375	విజయవాడ	390
చిత్తూరు	458	విశాఖపట్నం	405
గోదావరి	390	వరంగల్	377
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	గోదావరి	152
వరంగల్	156	విజయవాడ	152
కరీంనగర్	156	గుంటూరు	152
మహబూబ్‌నగర్	156	ఒంగోలు	152
కర్నూలు	156	చిత్తూరు	151
విశాఖపట్నం	134		

పేటీఎం బ్యాంక్ ఎండీ రాజీనామా

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్ బ్యాంక్ (పీపీబీఎల్) ఎండీ, సీఈఓ సురీందర్ చావ్లా రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలు, మరింత మంచి అవకాశాల అన్వేషణ కోసం ఆయన రాజీనామా చేసినట్టు పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఆయన రాజీనామా ఈ ఏడాది జూన్ 26 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. గత ఏడాది జనవరిలోనే చావ్లా బ్యాంక్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు.



భీమా జువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ రామ్‌చరణ్

హైదరాబాద్: ఆభరణాల రిటైలింగ్‌లోని భీమా జువెలర్స్ ప్రముఖ నటుడు రామ్‌చరణ్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఇది భీమా జువెలర్స్ చరిత్రలో ఒక అద్భుత ఘట్టాన్ని ఆవిష్కరిస్తుందని కంపెనీ ఈ సందర్భంగా తెలిపింది. తమ బ్రాండ్ ప్రయాణంలో ఇది ఒక మహోజ్వల ఘట్టంగా నిలుస్తుందని భావిస్తున్నామని, ఇది సినిమా ఆకర్షణకు, కళా నైపుణ్యానికి మధ్య అనుబంధమని కంపెనీ చైర్మన్ బీ బిందుమాధవ్ అన్నారు. శతాబ్ది చరిత్ర కలిగిన, సాంప్రదాయం-నైపుణ్యాల మేలి కలయిక అయిన బ్రాండ్‌కు తాను ప్రచారకర్తగా వ్యవహరించడం ఆనందదాయకంగా ఉన్నదని రామ్‌చరణ్ ఈ సందర్భంగా అన్నారు.



పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం క్యాంపులో ఉగాది వేడుకల్లో సీఎం జగన్, భారతీరెడ్డి

బస్సు యాత్ర బసలో జగన్ ఉగాది వేడుకలు

» వేద పండితుల ఆశీస్సులు అందుకున్న సీఎం దంపతులు

నరసరావుపేట, ఏప్రిల్ 9: పల్నాడు జిల్లాలో సీఎం జగన్ మంగళవారం ఉగాది వేడుకలు జరుపుకున్నారు. పండుగ సందర్భంగా మేము సిద్ధం బస్సు యాత్రకు విరామం ఇచ్చారు. సోమవారం రాత్రి శావల్యాపురం గంటావారిపాలెం వద్ద ఆయన బస చేశారు. క్యాంప్‌లోనే క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను జగన్ తన సతీమణి భారతీరెడ్డితో కలసి జరుపుకున్నారు. జగన్ దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు. ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ జగన్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నరసరావుపేట లోక్‌సభ వైసీపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది వేడుకల్లో వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకుంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు

చంద్రబాబుకు అధికార యోగం

» కూటమికి128 అసెంబ్లీ సీట్లు... 24 ఎంపీ సీట్లు.. పంచాంగ కర్త మాచిరాజు

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమికి 128 అసెంబ్లీ సీట్లు, 24 ఎంపీ సీట్లు దక్కుతాయని పంచాంగ కర్త, ప్రముఖ జ్యోతిషుడు మాచిరాజు వేణుగోపాల్ జోస్యం చెప్పారు. చంద్రబాబుకు అధికార యోగం ఉందని తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరం తెలుగు జాతికి, అమరావతికి శుభ సంకేతాలు ఇస్తోందని, తెలుగువారు గర్వించే విధంగా అమరావతి రాజధాని పునర్నిర్మాణం మొదలవుతుందని చెప్పారు. కర్కాటక రాశివారికి ఈ ఏడాది దివ్యంగా ఉంటుందని, చంద్రబాబు కూడా ఈ రాశి ప్రభావంలో ఉంటారని తెలిపారు. ఎంతటి కష్టసాధ్యమైన పనైనా సాధించే శక్తి ఈ ఏడాది వారికి సమకూరుతుందని, అనుకొన్న ఫలితాన్ని రాబడతారని పేర్కొన్నారు.



కాకినాడ జిల్లా చేబ్రోలులోని కొత్త ఇంటిలో పండితుల ఆశీర్వచనాలు అందుకుంటున్న పవన్

పిఠాపురం నుంచే విజయ ప్రస్థానం: పవన్

» చేబ్రోలులో నూతన గృహప్రవేశం చేసిన జనసేనాని

కాకినాడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురం నియోజకవర్గం నుంచే విజయ ప్రస్థానం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన కాకినాడ జిల్లా పిఠాపురంలోని చేబ్రోలులో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. వేదపండితుల పంచాంగ శ్రవణానికి హాజరయ్యారు. అనంతరం పవన్ మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరంలో ఏపీలో కూటమి ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నామని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, దశ, దిశను మార్చిన కొత్త సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు. కాగా, పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో 216వ జాతీయ రహదారి చెంతన నూతనంగా తీసుకున్న ఇంట్లో పవన్ మంగళవారం గృహప్రవేశం చేశారు.

బీసీవై తొలి జాబితా విడుదల

» మంగళగిరి, పుంగనూరు నుంచి రామచంద్ర యాదవ్ పోటీ

» పిఠాపురంలో ట్రాన్స్‌జెండర్‌కు అవకాశం

మంగళగిరి, పుంగనూరు, ఏప్రిల్ 9: భారత చైతన్య యువజన పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాను మంగళవారం విడుదల చేసింది. తొలిదశలో 32 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నట్టు వెల్లడించారు. తన సొంత నియోజకవర్గమైన పుంగనూరుతోపాటు అమరావతి రాజధాని రక్షణ నినాదంతో మంగళగిరి నుంచి పోటీ చేయాలని నిర్ణయించారు. ట్రాన్స్‌జెండర్లకు చట్టసభల్లో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థిగా సింహాద్రి తమన్నా పేరును ఖరారు చేశారు.

'ప్రజాశాంతి'కి కామన్ సింబల్‌పై తేల్చండి

» కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీకి కామన్ సింబల్ కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చేసుకున్న దరఖాస్తుపై చట్టనిబంధనలకు లోబడి నిర్ణయాన్ని ప్రకటించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 10లోగా పిటిషనర్‌కు సమాచారాన్ని తెలియజేయాలని స్పష్టం చేసింది. ఏదైనా కారణాలతో ఆ దరఖాస్తును తిరస్కరిస్తే ఈ నెల 12లోగా తాజాగా దరఖాస్తు చేసుకొనేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఇటీవల తీర్పు ఇచ్చారు. హెలికాప్టర్ గుర్తును కామన్ సింబల్‌గా కేటాయించాలని కోరుతూ తాను సమర్పించిన దరఖాస్తుపై నిర్ణయం వెల్లడించేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ కేఏ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. పిటిషనర్ వినతిపై త్వరలో నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. ఏదైనా కారణంతో ఆ వినతి పరిగణలోకి తీసుకోకున్నా కామన్ సింబల్ కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

కాంగ్రెస్‌లో చేరుతున్నా..
చీరాల నుంచే పోటీ: ఆమంచి

చీరాల, ఏప్రిల్ 9: కాంగ్రెస్ పార్టీలో తాను చేరుతున్నానని చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ప్రకటించారు. చీరాల నియోజకవర్గం నుంచే పోటీచేస్తానన్నారు. మంగళవారం బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్లపల్లిలోని తన నివాస ప్రాంగణంలో అనుచరులు, అభిమానులతో ఆయన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవన్నారు. కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగాలన్న అనుచరుల సూచన మేరకు ఆ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డితో మాట్లాడి ఆమెకు వీలయిన రోజున నియోజకవర్గంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి.. అనుచరులతో కలిసి చేరతానని స్పష్టం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, సీఎం జగన్‌పై సానుకూల వ్యాఖ్యలు చేసిన ఆయన.. స్థానిక ఎమ్మెల్యే కరణం బలరాం, వైసీపీ అభ్యర్థి వెంకటేశ్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు.

టీడీపీ కూటమిదే అధికారం

» నా పోటీపై 48 గంటల్లో స్పష్టత: రఘురామరాజు



కాకినాడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోన్న సీఎం జగన్‌ను సాగనంపాల్సిన సమయం వచ్చింది. కొత్త ఏడాదిలో రాష్ట్రం డ్రగ్స్, రుణాల నుంచి బయటపడాలి. రాబోయేది టీడీపీ కూటమి ప్రభుత్వమే' అని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో ఉగాది వేడుకలకు హాజరైన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఎంపీ మంగళవారం కలిశారు. తాను పోటీచేసే స్థానం ఏదనేదానిపై గంటపాటు పవన్‌తో చర్చించారు. అనంతరం బయటకు వచ్చిన రఘురామరాజు మీడియాతో మాట్లాడారు. 'నేను ప్రజాక్షేత్రంలో ఉంటా. కచ్చితంగా చట్టసభల్లోనే ఉంటా. అయితే అది లోక్‌సభ, అసెంబ్లీయా అనే విషయంపై కొంత అస్పష్టత ఉంది. దీనిపై 48 గంటల్లో స్పష్టత వస్తుంది. నేను ఎక్కడ పోటీ చేసినా వచ్చి ప్రచారం చేయాలని పవన్‌ను కోరా. నా విజయానికి అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. చిరంజీవి నాకు స్నేహితుడు. పవన్ మంచి సన్నిహితుడు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ 65 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయం' అని రఘురామ అన్నారు. హెరిటేజ్ పత్రాలను దగ్ధం చేసిన సంఘటనపై పోలీసులు మతిలేని మాటలు చెబుతున్నారని రఘురామ కాకినాడ జిల్లా చేబ్రోలులో అన్నారు.

నెల్లూరు బరిలో కొప్పుల రాజు

» తిరుపతి నుంచి చింతా మోహన్

» మరో 6 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

» 12 మంది అసెంబ్లీ అభ్యర్థులతో రెండో జాబితా

» టెక్కలిలో కిల్లి కృపారాణి పోటీ

అమరావతి/న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి పాలక, ప్రధాన ప్రతిపక్షాల అభ్యర్థులు, హేమాహేమీలైన విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో ఎస్సీ వర్గానికి చెందిన మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు తలపడనున్నారు. ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ విభాగం ఛైర్మన్ అయిన ఆయన్ను నెల్లూరు నుంచి లోక్‌సభకు పోటీ చేయాలంటూ అగ్ర నేత రాహుల్ గాంధీ కోరడంతో.. రాజు సరేనన్నారు. తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి మాజీ మంత్రి చింతా మోహన్ బరిలో దిగనున్నారు. మంగళవారం వారు సహా రాష్ట్రంలో ఆరుగురు లోక్‌సభ, 12 మంది అసెంబ్లీ అభ్యర్థులతో ఏఐసీసీ తన రెండో జాబితాను విడుదల చేసింది. విశాఖపట్నం ఎంపీ స్థానం నుంచి పులుసు సత్యనారాయణరెడ్డి, అనకాపల్లి-వేగి వెంకటేశ్, ఏలూరు-కావూరి లావణ్య, నరసరావుపేటలో గార్నెపూడి అలెగ్జాండర్ పోటీచేస్తారు. ఇక కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి టెక్కలి నుంచి అసెంబ్లీకి పోటీచేయనున్నారు. భీమిలిలో అడ్డాల వెంకట వర్మరాజు, విశాఖ దక్షిణ-వాసుపల్లి సంతోష్, గాజువాక-లక్కరాజు రామారావు, అరకు లోయ(ఎస్టీ)-శెట్టి గంగాధర స్వామి, నర్సీపట్నం-ఆర్.శ్రీరామమూర్తి, గోపాలపురం(ఎస్సీ)-మిధున్ లూథర్, యర్రగొండపాలెం (ఎస్సీ)-బి.అజితారావు, పరుచూరు-ఎన్.శివ శ్రీలక్ష్మి జ్యోతి. సంతనూతలపాడు (ఎస్సీ)-విజేశ్‌రాజ్ పాలపర్తి, గంగాధర నెల్లూరు (ఎస్సీ)-డి.రమేశ్‌బాబు, పూతలపట్టు (ఎస్సీ) నుంచి వైసీపీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బరిలోకి దిగనున్నారు.

జగన్ ధనదాహం!

(మొదటి పేజీ తరువాయి)

రూ.5వేల పారితోషికాన్ని రూ.10 వేలకు పెంచుతామని ప్రకటించారు. ఈ రోజు నుంచి ఎన్నికలు సరిగ్గా 34రోజులు ఉన్నాయని.. పునర్వైభవం దిశగా రాష్ట్ర ప్రజలు సంకల్పం తీసుకోవాలని పిలుపిచ్చారు. మంగళవారమిక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన ప్రసంగించారు. విలేకరుల సమావేశంలోనూ మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి విరాళాల కోసం 'టీడీపీ ఫర్ ఆంధ్ర.కామ్' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. తమ పరిస్థితి బాగుందని చెప్పుకోవడానికి చరిత్రలో లేనివిధంగా 1500 బస్సులు పెట్టి జగన్ సభలు జరుపుతున్నారని చంద్రబాబు ఆక్షేపించారు. బిర్యానీలు, మందు దీనికి అదనమన్నారు. 'ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది? వ్యవసాయం చేస్తున్నారా.. వ్యాపారం చేస్తున్నారా? ఒక్కో సభకు కనీసం రూ.15కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇలాంటివి కనీసం పది సభలు పెట్టారు. అప్పటికీ జనం రాక ఒక మీటింగ్ ఫొటోలను మరో మీటింగ్‌కు మార్ఫింగ్ చేసి వాడుతున్నారు' అని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి నివాసంలో నోట్ల కౌంటింగ్ యంత్రాలు పెట్టి ఏ రోజు సంపాదన ఆ రోజు లెక్కపెట్టుకునే పరిస్థితి ఉందని చెప్పారు. గనులశాఖను పక్కన పెట్టి అయినకాడికి లూటీ చేయడానికే రాయల్టీ వసూలును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని విమర్శించారు. టీవీ9, ఎన్‌టీవీ వంటి చానళ్లు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాయని, రాష్ట్రాన్ని లూటీచేస్తున్న వారికి మద్దతిస్తూ సొంత వ్యాపారం చేసుకుంటున్నాయని విమర్శించారు. ప్రకటించిన అభ్యర్థుల విషయంలో మార్పులు ఉండవని, ఎక్కడైనా తప్పకపోతే ఒక సీటు పరస్పర మార్పిడితో మారుస్తామని తెలిపారు. ఐ-ప్యాక్ టీం పోగుచేసి తెచ్చిన వారి పక్కన జగన్ కూర్చుని వల్లమాలిన ఆప్యాయత వలకబోస్తూ ఫొటోలు దిగి ప్రచారం చేసుకుంటున్నారని చంద్రబాబు అన్నారు. ప్రతి రోజూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ విశృంఖలంగా జరుగుతోందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..





ముస్లిం సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు, బాబును సత్కరిస్తున్న మాల సంఘాల నాయకులు

వలంటీర్లకు మంచి ఉద్యోగాలు!

వలంటీర్ ఉద్యోగమే చివరిది కాదు. అది మొదటి అడుగు. నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి మరింత మంచి ఉద్యోగాలు రావడానికి అవకాశాలు కల్పిస్తాం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా ఇంటి నుంచే పనిచేసే అవకాశాలు కూడా రావచ్చు. జగన్ వైపు ఉండాలో.. రాష్ట్రం కోసం పనిచేయాలో వలంటీర్లు తేల్చుకోవాలి. పేదల పింఛన్లను జగన్ తన జేబులోనుంచి ఇవ్వడం లేదు. ప్రజలు కడుతున్న పన్నుల్లో నుంచే ఇస్తున్నారు. మేం పింఛను రూ.4వేలు చేస్తాం. ఇంటికే పంపుతాం. 3నెలల వరకూ తీసుకోకపోయినా ఇబ్బంది లేకుండా చేస్తాం. దివ్యాంగుల పింఛను రూ.6వేలు చేస్తాం. పేదలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే మా మేనిఫెస్టోలో ఆరు వరాలు ఇచ్చాం. మిగిలిన వర్గాల కోసం మరింత విపులంగా మేనిఫెస్టో ప్రకటిస్తాం. ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనం. వైసీపీ ఉగాది పచ్చడిలో కారం, చేదు మాత్రమే ఉన్నాయి. దాని పాలనలో.. ఊరికో బకాసురుడు, రౌడీ పుట్టుకొచ్చాడు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరిలో ఆవేశం, బాధ, ఆగ్రహం కనిపిస్తున్నాయి. పథకాల పేరుతో రూ.10 ఇచ్చి రూ. వంద దోచుకుంటున్నారు. రాష్ట్రంలో రాబోయేది టీడీపీ కూటమి ప్రభుత్వమే. క్రోధి నామ ఉగాది తెలుగువారికి మంచి రోజులు తెస్తుంది. నరకాసురుడు పోయి ప్రజల రాజ్యం వస్తుంది.

ఎంతైనా విరాళమివ్వొచ్చు!

» ఆర్థికంగా సహకరించండి



టీడీపీ అభిమానులు, పౌరులు ఎవరైనా 'టీడీపీ ఫర్ ఆంధ్ర.కామ్' వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. రూ.99 నుంచి ఎంతైనా పార్టీకి విరాళంగా ఇవ్వొచ్చు (మొదటి విరాళంగా ఆయన రూ.99 వేలు ఇచ్చారు). టీడీపీ విధానాల వల్ల బాగుపడ్డామని అనుకున్నవారు పార్టీకి ఆర్థికంగా సహకరించాలి. వీలైతే ఎన్నికల సమయంలో వచ్చి పనిచేయాలి. అది కుదరకపోతే ఆర్థికసాయం చేయాలి. తోచినంత ఇవ్వొచ్చు. రూ.10 కూడా ఇవ్వడానికి వీలుగా వెబ్‌సైట్‌లో మార్పులు చేస్తున్నాం. అవినీతి సొమ్ముకు టీడీపీ ఏనాడూ ఆశపడలేదు. వైసీపీ ఆన్‌లైన్ గ్యాంబ్లర్ల నుంచి రూ.160కోట్లు విరాళం తీసుకుంది. మేం అలాంటివి ఏనాడూ ప్రోత్సహించలేదు.

ముస్లింలకు న్యాయం చేసేది నేనే!

» టీడీపీ అధినేత చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తప్పుడు ప్రచారాలతో విద్వేషాలు, విభేదాలు సృష్టించేలా వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ '2014-19 మధ్య మైనార్టీల కోసం బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తే, జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మైనార్టీల నిధులకు కోత పెట్టారు. గతంలో అమలు చేసిన పథకాలను రద్దు చేసి, ముస్లింలను వంచించాడు. ముస్లింల 4శాతం రిజర్వేషన్లను కాపాడింది టీడీపీనే. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ముస్లింలకు అన్ని రంగాల్లో అండగా నిలిచి, న్యాయం చేసింది టీడీపీనే. ఇప్పుడు జగన్‌రెడ్డి పాలనలో నష్టపోయిన ముస్లింలకు న్యాయం చేసేది కూడా నేనే. మతపరమైన అంశాల్లో ముస్లింలకు ఇబ్బందులు ఎదురవ్వకుండా చూసుకునేది టీడీపీనే' అన్నారు.

వైసీపీ అంతం... మాలల పంతం!

» మాలమహానాడు నేతల ప్రకటన

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీకి ఓట్లేసి గెలిపించిన తామే ప్రస్తుత ఎన్నికల్లో ఓటుతోనే జగన్‌రెడ్డికి రాజకీయ సమాధి కడతామని మాల సంఘాల నేతలు హెచ్చరించారు. 'వైసీపీ అంతం.. మాలల పంతం'గా ఈ ఎన్నికల్లో పని చేసి, జగన్‌కు బుద్ధి చెప్తామని స్పష్టంచేశారు. మాలల సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రగతికి దోహదపడ్డ టీడీపీకే మాలల మద్దతు ఉంటుందని మాల మహానాడు నాయకులు ప్రకటించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో పార్టీ అధినేత చంద్రబాబుతో మాలమహానాడు రాష్ట్ర నాయకులు భేటీ అయ్యారు. శిరోముండనాలు, అవమానాలు, దౌర్జన్యాలతో మాలలను వేధించిన వైసీపీని ఓటుతోనే సమాధి చేస్తామని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... మాలలను రాజకీయంగా అభివృద్ధి చేసింది టీడీపీనే అని పేర్కొన్నారు.

పాలకొండ బరిలో జయకృష్ణ

» ఎట్టకేలకు ఖరారుచేసిన జనసేనాని

» మొత్తం 21 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

» పార్టీ కాకినాడ అధ్యక్షుడిగా రామస్వామి

» జగ్గంపేట ఇన్‌చార్జిగా తుమ్మలపల్లి రమేశ్

» దర్శికి గరికపాటి వెంకట్

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పాలకొండ (ఎస్టీ) నియోజకవర్గం అభ్యర్థిని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎట్టకేలకు ప్రకటించారు. నిమ్మక జయకృష్ణ పేరును ఖరారుచేశారు. దీంతో పొత్తులో భాగంగా వచ్చిన 21 అసెంబ్లీ స్థానాలకు జనసేన అభ్యర్థులను ప్రకటించినట్లయింది. పాలకొండ కోసం ఆ పార్టీలో గట్టి పోటీ నెలకొంది. పలు దఫాలుగా సర్వేలు చేశారు. జయకృష్ణ వైపే ఎక్కువ మంది మొగ్గు చూపడంతో ఆయనకే అభ్యర్థిత్వం ఖరారుచేశారు. అభ్యర్థి ప్రకటన ఆలస్యమైతే జనసేన శ్రేణులు గందరగోళంలో పడతాయని.. త్వరగా ఖరారుచేయాలని పార్టీ నాయకులు పవన్‌కు సూచించారు. దీంతో క్షేత్రస్థాయి సర్వే జరిపి నిర్ణయం తీసుకున్నారు. కాగా.. జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా తుమ్మల రామస్వామి(బాబు) నియమితులయ్యారు. పిఠాపురంలో పర్యటనలో ఉన్న పవన్ కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించారు. జగ్గంపేట ఇన్‌చార్జిగా ఉన్న పాటంశెట్టి సూర్యచంద్రను తొలగించి.. తుమ్మలపల్లి రమేశ్‌కు బాధ్యతలు అప్పగించారు. దర్శి ఇన్‌చార్జిగా గరికపాటి వెంకట్‌ను, ఉంగుటూరు ఎన్నికల నిర్వహణ సమన్వయకర్తగా వట్టి పవన్‌ను నియమించారు. కాకినాడ పార్లమెంట్ స్థానానికి ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి తోట సుధీర్ కార్యదర్శిగా ఉంటారు. మల్లాడి రాజేంద్ర, టి.వి.రామారావు, చిక్కాల దొరబాబు, నల్లా శ్రీధర్, దేవు మధువీరేశ్ సభ్యులు.

నేడు, రేపు ఉభయగోదావరి జిల్లాల్లో
బాబు, పవన్ రోడ్ షో

భీమవరం, తణుకు, రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలసి బుధ, గురువారాల్లో ఉభయ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల రోడ్‌షోలు నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే రోడ్‌షోలో ఇద్దరూ పాల్గొంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు చేరుకుంటారు. రాత్రి 7గంటలకు నిడదవోలు గణపతి సెంటర్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. ఇక్కడ బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొంటారు. రాత్రి చంద్రబాబు నిడదవోలు తిరుమల సాయి కల్యాణమండపంలో, పవన్ రాజమహేంద్రవరంలోని షెల్టాన్ హోటల్‌లో బస చేస్తారు. చంద్రబాబు గురువారం తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా నేతలతో సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం హెలికాప్టర్‌లో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట చేరుకుంటారు. ఈదుల్ ఫితర్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు అంబాజీపేట సెంటర్‌లో పవన్‌తో కలిసి రోడ్‌షో నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు అమలాపురం క్లాక్‌టవర్ సెంటర్‌లో బహిరంగసభలో పాల్గొంటారు. రాత్రికి అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీలో బాబు బస చేస్తారు.

పురందేశ్వరిపై వైసీపీ మరో కుట్ర

» ముస్లిం రిజర్వేషన్ రద్దు చేస్తామన్నట్లు ప్రచారం

» దానికి బాబు, పవన్‌ల మద్దతు ఉందంటూ 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' లోగోతో వైరల్

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై వైసీపీ బ్యాచ్ మరో కుట్ర చేసింది. రాష్ట్రంలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ ఆమె ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి వెల్లడించినట్లు వీడియోలు సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. వైఎస్ఆర్ ప్రభుత్వం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు అన్యాయంగా కట్టబెట్టిందని పురందేశ్వరి ఆరోపించినట్లు, కూటమి గెలిచిన వెంటనే ఆ రిజర్వేషన్ల రద్దుపై తొలి సంతకం చేసేందుకు చంద్రబాబు, పవన్ సానుకూలంగా స్పందించారని పురందేశ్వరి ప్రకటించినట్లు ఇతర వెబ్‌సైట్ల లోగోలతో వైరల్ చేశారు. వైసీపీ నేతల అక్రమాలపై గట్టిగా పోరాటం చేస్తోన్న పురందేశ్వరి లిక్కర్, ల్యాండ్, మైన్ తదితర అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదుచేశారు. ఇటీవల విశాఖ పోర్టులో సీబీఐ తనిఖీలు చేసిన డ్రగ్స్ వ్యవహారంలోనూ ఆమెకు సంబంధం ఉందంటూ జగన్ మీడియా తప్పుడు కథనాలు ప్రచురించి ప్రసారం చేసింది. దీంతో ఆమె పరువునష్టం నోటీసులు ఇచ్చారు. రాజమహేంద్రవరం పార్లమెంటు నుంచి ఆమె బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పదేపదే ఫేక్ న్యూస్ సృష్టించి అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలంటూ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ ఈసీకి విజ్ఞప్తిచేశారు. కాగా, ఇదే అంశంపై బీజేపీ ఏపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, 'ప్రతిసారి ఎన్నికలు రాగానే రిజర్వేషన్ల అంశం తెరపైకి వస్తుంది. నకిలీ వార్తలపై సైబర్ క్రైంకు ఫిర్యాదు చేస్తాం' అని అన్నారు.

మా అడ్డాకి ఎవడు పంపించాడ్రా!

» టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రచార వాహనంపై మాచర్లలో రెచ్చిపోయిన వైసీపీ గూండాలు

» రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనంపై కర్రలు, రాళ్లతో దాడి.. ఫ్లెక్సీలు ధ్వంసం

» డ్రైవర్ వేడుకున్నా వదలకుండా పిడిగుద్దులు

» పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు



వైసీపీ గూండాల దాడిలో ధ్వంసమైన ఎన్నికల ప్రచార వాహనం



దాడికి పాల్పడిన నిందితులు

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ గూండాలు పేట్రేగిపోయారు. టీడీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు చెందిన ఎన్నికల ప్రచార వాహనంపై రెంటచింతలలో మంగళవారం రాత్రి దాడి చేశారు. "మా అడ్డా(గ్రామానికి)కు ఎవడు పంపించాడ్రా!" అంటూ రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనంపై కర్రలు, రాళ్లతో దాడి చేసి బీభత్సం సృష్టించారు. హడలిపోయిన వాహనం డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోతానని కాళ్లవేళ్లా పడినా వినకుండా పిడిగుద్దులు కురిపించారు. డ్రైవర్ సెల్‌ఫోన్‌ను నేలకేసి కొట్టారు. ప్రచార వాహనం ఎల్‌ఈడీ స్ర్కీన్‌ని తునాతునకలు చేశారు. సౌండ్‌బాక్సులను పగలగొట్టారు. యాంప్లిఫైర్‌ని ఎత్తుకుపోయారు. వాహనాన్ని వదిలి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని డ్రైవర్ తప్పించుకుపోయారు.

ఏం జరిగిందంటే!

లావు శ్రీకృష్ణదేవరాయలు.. పలు మండలాలకు ప్రత్యేకంగా వాహనాలు పంపి.. మైకులు, ఎల్‌ఈడీ స్ర్కీన్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి వాహనాల్లో కేవలం డ్రైవర్ మాత్రమే ఉండి, నిర్దేశిత ప్రాంతంలో వాహనాన్ని తిప్పి ప్రచారం చేస్తారు. మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని రెంటచింతల మండలం, మంచికల్లు గ్రామానికి మంగళవారం సాయంత్రం ప్రచార వాహనం చేరుకుంది. ఈ వాహనాన్ని డ్రైవర్ కొండా నాయక్ రోడ్డుపక్కగా ఆపి ఉంచారు. మైకులు, ఎల్‌ఈడీ స్ర్కీన్‌ల ద్వారా ప్రచారం సాగుతోంది. ఇంతలో అక్కడకు చేరుకున్న వైసీపీ గూండాలు గొంగటి అంజిరెడ్డి, దేకొండ ఆంజనేయులు, దమ్ము అంజిబాబు.. "మా అడ్డాకు ఎవడ్రా నిన్ను పంపించింది?" అంటూ డ్రైవర్ కొండా నాయక్‌ను బయటకు లాగి ప్రశ్నించారు. సమాధానం చెప్పేలోపే దుర్భాషలాడుతూ.. వెంట తెచ్చుకున్న కర్రలు, రాళ్లతో వాహనాన్ని ధ్వంసం చేశారు. విషయాన్ని ఫోన్ ద్వారా టీడీపీ నాయకులకు చెప్పేందుకు డ్రైవర్ ప్రయత్నించడంతో ఫోన్‌ను లాక్కుని నేలకేసి కొట్టారు. వాహనానికి ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్‌ను, ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. డ్రైవర్‌పై భౌతిక దాడికి దిగారు. అక్కడి నుంచి వెళ్లిపోతానని నాయక్ బతిమాలినా అరకిలోమీటరు వరకు వెంబడించి మరీ కొట్టారు. ఇంతలో స్థానిక టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని, గూండాలపై రెంటచింతల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కొనసాగుతున్న అరాచకం

- పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష టీడీపీ నాయకులు, కార్యకర్తలపై హత్యలు, దాడులు పెరిగిపోయాయి. వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు పెద్దఎత్తున దాడులకు దిగుతున్నారు.
- మునిసిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఎవరూ కనీసం నామినేషన్లు వేయకుండా అడ్డుకొని అన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకొన్నారు.
- టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి బుద్ధా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావు తదితరులు పరిశీలనకు వెళ్లగా తురగా కిశోర్ అనే వ్యక్తితో వాళ్లు ప్రయాణిస్తున్న కార్లపై దుంగలతో దాడి చేయించి హతమార్చబోయారు. ఆ తర్వాత కొన్నాళ్లకు టీడీపీ కార్యాలయాన్ని, వాహనాలను దగ్ధం చేశారు.
- వినుకొండకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాచర్ల నియోజకవర్గంలోని నీలంపాటి అమ్మవారి ఆలయానికి వెళ్లి వస్తుండగా అక్కడ కూడా వారిపై దాడి చేశారు. జల్లయ్య అనే టీడీపీ నాయకుడిని నడిరోడ్డుపైనే నరికేశారు.

రూ.750 బదులు
రూ.7.50

- వెనక్కి ఇవ్వాల్సిన టెట్, డీఎస్సీ ఫీజుల్లో జగన్ సర్కారు మాయ
- కష్టపడి కట్టిన అభ్యర్థులకు టోపీ
- టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్లు చేసినా ఏమాత్రం పట్టించుకోని అధికారులు
- వేలాది మంది ఫీజులతో దోబూచులు
- లబోదిబో మంటున్న అభ్యర్థులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టెట్, డీఎస్సీ పరీక్షలకు ఫీజులు కట్టి వివిధ కారణాలతో వాటికి అనర్హులుగా మారిన వారి ఫీజులను పాఠశాల విద్యాశాఖ వెనక్కి ఇస్తామని ప్రకటించింది. ఎప్పుడో ఇవ్వాల్సిన ఆ ఫీజులను గత వారం రోజుల నుంచి వెనక్కి ఇచ్చే ప్రక్రియ మొదలుపెట్టింది. అయితే అందులోనూ అనేక మంది అభ్యర్థుల ఫీజుల విషయంలో గిమ్మిక్కులు చేస్తోంది. ఉదాహరణకు ఒక పేపర్‌కు రూ.750 చెల్లించిన అభ్యర్థికి అంతే మొత్తం తిరిగి చెల్లించాల్సి ఉండగా.. రూ.7.50 తిరిగి చెల్లిస్తోంది. అంటే 750కి 7 తర్వాత చుక్క పెట్టి అక్షరాలా ఏడున్నర రూపాయలు ఖాతాల్లో వేసింది. ఈ నగదు చూసి అభ్యర్థులు అవాక్కయ్యారు. తాము రూ.750 కడితే మళ్లీ అంతే తిరిగి ఇవ్వాలి కానీ, ఇలా రూ.7.50 ఇవ్వడం ఏంటని లబోదిబోమంటున్నారు. మిగిలిన రూ.742.5 ఎవరు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్లు చేస్తుంటే వాటికి అధికారులు స్పందించడం లేదు. నాలుగు నెంబర్లలో కొన్ని పనిచేయడం లేదని, కొన్నిసార్లు ఫోన్లు తీసి మాట్లాడినా బ్యాంకుకు వెళ్లి చూసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఇలా నిరుద్యోగుల ఫీజులు కొట్టేస్తే ఇక తమకు దిక్కు ఎవరని ప్రశ్నిస్తున్నారు. అయితే, ఇది పొరపాటున జరిగిందని భావించినా రూ.7.50 పోగా మిగిలిన ఫీజులపై ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి స్పందన లేదు. పొరపాటున తక్కువ జమ చేసి ఉంటే వెంటనే మిగిలిన మొత్తాన్ని ఖాతాల్లో వేస్తారు. కానీ ఈ నెల 5న రూ.7.50 జమ కాగా, మళ్లీ ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి స్పందనా ప్రభుత్వం వైపు నుంచి రాకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే ఫీజుల డబ్బులు నొక్కేస్తున్నారని అభ్యర్థులు భావిస్తున్నారు.

అసలేం జరిగింది?

ఫిబ్రవరి 12న పాఠశాల విద్యాశాఖ టెట్, డీఎస్సీ పరీక్షలకు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఒక్కో పరీక్షకు ఫీజును రూ.750గా నిర్ణయించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టెట్‌లో ఎస్జీటీ పేపరు రాయాలంటే డీఈడీ అభ్యర్థులే అర్హులు. కానీ, బీఈడీ వారికి కూడా ప్రభుత్వం అర్హత కల్పించింది. దీనిపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టింది. సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇస్తే అందుకు విరుద్ధంగా బీఈడీ చదివిన వారిని ఎస్జీటీ పోస్టులకు ఎలా అర్హులను చేశారని నిలదీసింది. నిర్ణయాన్ని మార్చుకోవాలని ఆదేశించడంతో పాఠశాల విద్యాశాఖ ఎస్జీటీ పోస్టులకు డీఈడీ వారు మాత్రమే అర్హులని నిబంధనలు మార్చేసింది. ఫలితంగా 50 వేల మందికి పైగా అభ్యర్థులు టెట్‌లో ఎస్జీటీ పేపరు పరీక్షకు అర్హత కోల్పోయారు. కానీ, అప్పటికే షెడ్యూలు ప్రకారం ఫీజులు చెల్లించారు. అలాగే టెట్, డీఎస్సీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే సమయంలో అనేక మందికి నగదు కట్ అయినా దరఖాస్తు తీసుకోలేదు. దీంతో రెండోసారి మూడోసారి కూడా దరఖాస్తులు చేసుకున్నారు. ఇలా ఒకే దరఖాస్తుకు రెండుమూడు సార్లు ఫీజులు కట్టారు. ఇలా అదనంగా కట్టిన ఫీజులను వెనక్కి ఇస్తామని పాఠశాల విద్యాశాఖ నెల రోజుల కిందట ప్రకటించింది. కానీ, టెట్ పరీక్షలు ముగిసినా, డీఎస్సీ మొత్తానికే వాయిదా పడినా ఆ ఫీజులు ఇంకా పూర్తిగా వెనక్కి రాలేదు. ఇటీవలే ఫీజులు వెనక్కి ఇచ్చే ప్రక్రియ ప్రారంభించగా కొందరికి మొత్తం ఫీజులు వెనక్కి వేశారు. కానీ, చాలా మందికి ఫీజులు వేయలేదు. పైగా ఇప్పుడు రూ.750కి బదులుగా రూ.7.50 వేస్తుండటం అభ్యర్థుల్లో గందరగోళం సృష్టిస్తోంది.

జగన్ ప్రభుత్వం అతి తెలివి ప్రదర్శిస్తోంది. రూపాయి రూపాయి పోగుచేసి పరీక్షల ఫీజులు కట్టుకున్న నిరుద్యోగుల జేబుకే చిల్లు పెడుతోంది. టెట్, డీఎస్సీ ప్రవేశ పరీక్షలకు అనర్హులుగా ప్రకటించిన అభ్యర్థులకు తిరిగి ఇవ్వాల్సిన వారు కట్టిన సొమ్ములో మాయ చేస్తోంది. రూ.750 కట్టిన వారికి రూ.7.50 చెల్లిస్తూ కుచ్చుటోపీ పెడుతోంది. ఇదేంటని ప్రశ్నిద్దామన్నా.. స్పందించేవారు కరువయ్యారు. దీంతో వేలాది మంది అభ్యర్థులు లబోదిబో మంటున్నారు.

ఇంటర్నెట్ సెంటర్లకు ఫీజులు

ఫీజుల విషయంలో పాఠశాల విద్యాశాఖ మరో మెలిక పెట్టింది. ఇప్పటికీ అనేక మంది విద్యార్థులు ఇంటర్నెట్ సెంటర్లలోనే దరఖాస్తులు చేసుకుంటున్నారు. సెంటర్ల నిర్వాహకులు వారి ఖాతాల నుంచే ఫీజులు చెల్లిస్తే, వారికి అభ్యర్థులు నగదు రూపంలో ఇస్తున్నారు. అయితే ఇలా పరీక్షలు రద్దు చేసినపుడు వెనక్కి ఇవ్వాల్సిన నగదును ఆధార్ సంఖ్య ఆధారంగా ఉన్న ఖాతాలకు వెనక్కి ఇవ్వాలి. కానీ అలా దరఖాస్తుదారులకు కాకుండా, ఏ ఖాతా నుంచి నగదు చెల్లిస్తే అదే ఖాతాకు వెనక్కి వేస్తున్నారు. దీంతో అభ్యర్థులకు రావాల్సిన నగదు ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులకు వెళ్తోంది. వారి నుంచి డబ్బులు తీసుకోవడం అభ్యర్థులకు కష్టంగా మారింది. అసలు ప్రభుత్వం అర్హతలు మార్చకుండా ఉంటే, డబ్బులు కట్ అయిన తర్వాత దరఖాస్తులు నిరాకరించకుండా ఉంటే ఈ గోలంతా ఉండేది కాదని అభ్యర్థులు అంటున్నారు. అనేక మంది అభ్యర్థులు రెండు, మూడు పేపర్లకు దరఖాస్తులు చేసుకోవడంతో అనేక మంది మందికి రూ.2 వేల వరకు వెనక్కి రావాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం అతి తెలివి ప్రదర్శించి ఏడున్నర రూపాయలతో సరిపెడుతోంది.

మరో వివాదంలో గిరీశ

డీకేటీ భూములపై రైతుల హక్కులకు చెక్.. రెండు గ్రామాల భూమి రికార్డులన్నీ బ్లాక్

- అన్నమయ్య జిల్లా కలెక్టరుగా వింత చర్య
- ఇప్పటికే ఈసీ వేటు.. తాజాగా రైతుల కన్నెర్ర
- సీఎస్, కేంద్రానికి మదనపల్లె రైతుసంఘం ఫిర్యాదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కనీసం 20 ఏళ్ల, అంతకు ముందే అసైన్ చేసిన భూములపై రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలి. దాన్ని అమలు చేయాల్సింది జిల్లా కలెక్టర్. అలాంటిది కలెక్టరే కొన్ని గ్రామాల భూమి రికార్డులు మార్పునకు లోనుకాకుండా బ్లాక్‌చేస్తే? అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఐఏఎస్ గిరీశ ఇదే పనిచేశారు. ఇప్పటికే ఈసీ వేటుకు గురైన ఈయన తాజా వ్యవహారంతో మరింత వివాదాస్పదునిగా మారారు. గిరీశ తప్పుడు ఆలోచనతోనే రెండు గ్రామాల భూములను బ్లాక్ చేశారనీ, కాబట్టి ఆయన చర్యపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మదనపల్లి రైతు సంఘం.... ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఏడీకి, కేంద్ర రెవెన్యూ విభాగం, ఇతర శాఖలకు ఫిర్యాదులు వెళ్లాయి. దానికంటే ముందే కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ ఏడాది జనవరిలో తీసుకెళ్లారు. కేంద్రం ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుంది. తక్షణమే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కేంద్రంలోని ఓ ప్రధాన శాఖ అండర్ సెక్రెటరీ నుంచి ఆదేశాలు వచ్చాయి. సహజంగా సీఎస్‌కో, సీఎంకో ఫిర్యాదు చేస్తే అధికారులు పెద్దగా పట్టించుకోకుండా ఐఏఎస్‌ను కాపాడే ప్రయత్నం చేసేవారు. అయితే, ముందు కేంద్రానికి ఫిర్యాదులు పంపించి, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంతో తప్పనిసరిగా స్పందించాల్సిన పరిస్థితి వచ్చింది. గిరీశపై వచ్చిన ఫిర్యాదులపై కేంద్రం ఆరాతీసింది. విచారణ నివేదిక ఇవ్వాలని కోరింది. దీంతో తప్పనిసరిగా విచారణకు సిద్ధపడాల్సి వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం చేతిలో తీవ్ర క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొంటున్న గిరీశపై ఉన్నతాధికారులకు సానుభూతి ఉంది. దీంతో రైతు సంఘం నుంచి వచ్చిన ఫిర్యాదును తొలుత పెద్దగా పట్టించుకోలేదు. కేంద్రం నుంచి కూడా చర్యలు ప్రారంభం కావడంతో, రాష్ట్ర అధికారులు ఇక చేసేదేమీలేక చర్యలకు దిగారు. రెండు గ్రామాల భూ రికార్డులు ఎందుకు బ్లాక్ చేయాల్సి వచ్చింది.... ఇందుకు గిరీశ చెబుతున్న కారణాలు ఏమిటి...ఇంకా ఇతర అంశాలుంటే వాటిపైనా విచారణ జరిపించాలని సర్కారు ఈ ఏడాది ఫిబ్రవరి ఐదో తేదీన .రెవెన్యూశాఖను ఆదేశించింది. "ఫిర్యాదులోని అంశాలపై సమగ్ర విచారణ చేయండి. ప్రాథమిక ఆధారాలు, ఇతర అంశాలు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేందుకు నివేదిక ఇవ్వండి" అని కోరింది. అయితే, రెవెన్యూశాఖ తనదైన శైలిలో ఈ ఉత్తర్వులపై తెలిసీ తెలియనట్లుగా ఉంటోంది.

జరిగింది ఇదీ!

రాష్ట్రంలో 38 లక్షల ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. ఇందులో 20 ఏళ్ల క్రితం అసైన్డ్ చేసిన భూములు రైతుల ఆధీనంలోనే ఉంటే వాటికి రైతు పేరిట పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేలా ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూముల చట్టం-1976లో జగన్ ప్రభుత్వం సవరణలు చేసింది. ఈ మేరకు చట్టసవరణ అమల్లోకి వచ్చింది. దాని ప్రకారం, అర్హత గల భూములను గుర్తించి గ్రామం వారీగా నోటిఫై చేయాలి. ఆ భూములను రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని నిషేధ భూముల జాబితా 22 (ఏ) నుంచి తొలగించాలి. 22 లక్షలమంది రైతులకు హక్కులు ఇచ్చేశామని ముఖ్యమంత్రి జగన్ గొప్పగా సిద్ధం సభల్లో చెబుతున్నారు. కానీ ఇది ఆచరణలో జరగ నేలేదు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి అసైన్డ్ చట్టం అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌దే. అయితే, అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలంలోని టీకే పల్లి, బసినికొండ గ్రామాల్లోని అసైన్డ్ భూమి రికార్డుల్లో మార్పులు జరగకుండా బ్లాక్ చేయించారని మదనపల్లి రైతు సంఘం అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి తీవ్ర ఆరోపణలు చేస్తూ ప్రభుత్వానికి లిఖితపూర్వక ఫిర్యాదులు చేశారు. "ఆ రెండు గ్రామాల రికార్డులను బ్లాక్ చేయాలని మదనపల్లి ఆర్డీవో మురళి, తహసీల్దార్ మహబూబ్ చాంద్‌లను కలెక్టర్ గిరీశ ఆదేశించారు. సరైన, నిర్దేశిత కారణం చెప్పకుండానే ఆ రెండు గ్రామాల డీకేటీ లబ్ధిదారుల వివరాలు సమర్పించకుండా గిరీశ అడ్డుకున్నారు. ఎందుకిలా చేశారని ఆర్డీవో, తహసీల్దార్‌ను ప్రశ్నించినప్పుడు, కలెక్టర్ ఆదేశాల మేరకే చేశామని తమకు వివరించారు. కారణాలు అడిగితే ప్రత్యేకంగా ఏమీలేవన్నారు. రెండు గ్రామాల అసైన్డ్ రైతుల ప్రయోజనాలను అడ్డుకోవడం కలెక్టర్‌గా ఆయన చేసిన తప్పు. ఈచర్య వెనక ఆయన ఉద్దేశాలు వేరే ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయకపోవడం బాధ్యతారాహిత్యం. భూహక్కులు నిలిపివేసి డీకేటీ పట్టాదారుల నుంచి భారీగా డబ్బు వసూలు చేయాలన్నది ఆయన ఉద్దేశంలా ఉంది. ఆయన చర్యలతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. రాయచోటి మాసపేట గ్రామంలోనూ ఉద్దేశపూర్వకంగానే రైతు ప్రయోజనకారి ఉత్తర్వులను అడ్డుకున్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలి. గిరీశపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని తన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

పనికి రాని పట్టా!

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ము చేసుకుంది. అవి ఎందుకూ పనికి రావు. అలాగే, ఐదేళ్ల తన పాలనలో మరో 25 లక్షల పనికిరాని రిజిస్ట్రేషన్ పత్రాలను పేదలకు పంచి ఓట్ల రూపంలో లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోంది. ఇదే పని బయట ఎవరైనా చేస్తే క్రిమినల్ కేసులు పెట్టి పోలీసులు అరెస్టు చేస్తారు. ప్రభుత్వమే మోసం చేస్తే ప్రజలు ఎక్కడికెళ్లాలి? పోలీసులను అడ్డంపెట్టుకుని జగన్ సర్కారు పాల్పడుతున్న దాష్టీకాలను చూసి కేసులు పెట్టడానికి కూడా బాధితులు భయపడుతున్నారు.

పేదల కొంప ముంచారిలా..

'ఓటీఎస్' కింద ఫీజులు కట్టిన పేదలనూ, ఇళ్లకు ఆశపడి ఓట్లేసిన పేదలనూ జగన్ ఒకేలా మోసం చేశారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలంటూ ఆర్భాటం చేసిన ప్రభుత్వం... తానే రిజిస్ట్రేషన్లు చేయిస్తానని నమ్మించింది. రిజిస్ట్రేషన్ల కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని, గ్రామ/వార్డు సచివాలయాల్లోనే అందుకు ఆ ఏర్పాట్లు చేశానని తెలిపింది. కొంతమందికి గ్రామ/వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసిన భూమి పత్రాలను అందించింది. మరికొంతమందికి ఇవ్వకుండా ఆపారు. ఈ పత్రాల్లో నాన్ జ్యూడిషియల్ స్టాంపుతోపాటు జగన్ ఫొటో, నవరత్నాలు బొమ్మలు, ఇతర డిజైన్లు ఉన్నాయి. ఇదే ఇప్పుడు బాధితుల కొంప ముంచింది. ఆ పత్రాలు ఎందుకూ పనికిరావంటూ అటు బ్యాంకులు, ఇటు రిజిస్ట్రేషన్ అధికారులు చేతులెత్తేశారు.

డబ్బులు కట్టినవారికీ కన్నీరే...

గత ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన ఇళ్లకు డాక్యుమెంట్లు ఇస్తామంటూ జగన్ ప్రభుత్వం ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానం తెచ్చింది. ఈ విధానం కింద.. గ్రామాల్లో ఒక్కో ఇంటికి రూ.10,000, మునిసిపాలిటీల్లో ఒక్కో ఇంటికి రూ.15,000 వసూలు చేశారు. ఖజానాకు ఆ రూపంలో రూ.350 కోట్లు వచ్చాయి. వారికిచ్చిన పత్రాలు గ్రామ/వార్డు సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించారు. వీటిపై కూడా జగన్ ఫొటోలు, నవరత్నాల బొమ్మలు ఉన్నాయి. ఒక్కసారి డబ్బు కడితే ఇల్లు మీ సొంతమైపోతుంది...మీ పేరుపై డాక్యుమెంట్ ఇస్తాము... దాన్ని అమ్ముకోవచ్చు...తనఖా పెట్టుకుని బ్యాంకుల నుంచి లోన్లు కూడా తీసుకోవచ్చని నమ్మబలికారు. పేదలు వేలకువేలు ప్రభుత్వానికి కట్టి ఆ పత్రాలు తీసుకున్నారు. వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి లోను తీసుకుందామని వెళ్తే ఆ పత్రాలు చూసిన బ్యాంకు అధికారులు ఇవి పనికిరావంటూ వెనక్కి పంపేస్తున్నారు. నాన్ జ్యూడీషియల్ స్టాంపు పేపర్లపై ఎవరి ఫొటోలుగానీ, బొమ్మలుగానీ, డిజైన్లు గానీ, స్టాంపులు గానీ ఉండకూడదని, ఉంటే ఆ పత్రాలు చెల్లవని స్పష్టం చేస్తున్నారు. పైగా పంచాయతీ సెక్రటరీ అంటే గ్రూప్-4 అధికారి. రిజిస్ట్రేషన్ల చట్టం ప్రకారం సబ్ రిజిస్ట్రార్ గ్రూప్-2 అధికారి లేదా ఆ శాఖలో పనిచేస్తూ ప్రమోషన్‌పై సబ్ రిజిస్ట్రార్ అయిన అధికారి సంతకం పెడితేనే రిజిస్ట్రేషన్ చట్టబద్ధం అవుతుంది.

ఇంకా నిషేధిత జాబితాలోనే...

గ్రామ/వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసిన పత్రాల ఆధారంగా తిరిగి రిజిస్ట్రేషన్ చేద్దామని ప్రయత్నించగా, అవన్నీ నిషేధిత భూముల జాబితాలో ఉన్నట్టుగా కనిపిస్తోంది. నిషేధిత భూముల జాబితా అంటే ప్రభుత్వ భూములు. ప్రభుత్వ భూములను ఎవ్వరికీ రిజిస్ట్రేషన్ చేయలేరు. చేయాలంటే వాటిని ఆ జాబితా నుంచి తొలగించాలి. కానీ, ప్రభుత్వం పేదలకిచ్చిన ఈ ఇళ్లను ఇప్పటికీ తన ఆస్తిగానే పరిగణిస్తూ నిషేధిత జాబితాలోనే ఉంచింది. అలాగే, పేదలందరికీ ఇళ్ల పేరుతో 25 లక్షల మందికి ఇచ్చిన పత్రాలది కూడా ఇదే దుస్థితి. అవన్నీ నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. అవి వైసీపీ నాయకులవే. తక్కువ విలువ గల భూములను ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మేసిన సంగతి తెలిసిందే. ఇటీవల ఇలా ప్రభుత్వానికి భూములమ్మిన వైసీపీ నాయకులకు రాజీవ్ స్వగృహ ద్వారా బ్యాంకు నుంచి అప్పులు తెచ్చి మరీ బిల్లులు చెల్లించారు. కానీ, పేదలకు మాత్రం పైసా మేలు జరగలేదు.

ఏబీవీపై రాష్ట్రం దోబూచులాట

(మొదటి పేజీ తరువాయి)

చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏబీవీ 1989లో యూపీఎస్సీ ద్వారా ఐపీఎస్‌కు ఎంపికై రాష్ట్ర కేడర్‌కు అలాట్ అయ్యారు. మూడు దశాబ్దాలపాటు పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర నిఘా విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే 2019 ఎన్నికల సమయంలో ఆయనపై వైసీపీ నేతలు పదే పదే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి.. ఆ పదవి నుంచి తప్పించేలా చేశారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్.. ఆయనపై కక్ష సాధింపులు మొదలు పెట్టారు. ఆయన నిఘా చీఫ్‌గా ఉన్నప్పుడు ఇజ్రాయెల్ నుంచి కీలక పరికరాలు కొనుగోలు చేశారని, తమ ఫోన్లు ట్యాప్ చేశారన్న ఆరోపణలతో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తర్వాత మాటమార్చి పరికరాల కొనుగోలులో అవినీతికి పాల్పడ్డారంటూ విచారణ పేరుతో వేధించింది. తాను ఎలాంటి అవినీతి చేయలేదని, అసలు పరికరాలే కొనుగోలు చేయలేదంటూ ఏబీవీ ఇచ్చిన వివరణను కనీసం పట్టించుకోలేదు. దీంతో ఆయన పరిపాలనా ట్రిబ్యునల్, న్యాయస్థానాలను ఆశ్రయించి సస్పెన్షన్‌ను ఎత్తివేయించుకున్నారు. అనంతరం ప్రింటింగ్, స్టేషనరీ కమిషనర్‌గా నియమితులయ్యారు. కానీ పోస్టింగ్ ఇచ్చిన రెండు వారాలకే మరో అభియోగంపై సర్కారు సస్పెండ్ చేసింది. తర్వాత వెంకటేశ్వరరావు తీవ్రమైన తప్పు చేశారంటూ.. ఆయన్ను సర్వీసు నుంచి డిస్మిస్ చేయాలని కేంద్రాన్ని కోరింది. 2020 డిసెంబరు 18న ఆయనపై విచారణ ప్రారంభించి.. 2022 అక్టోబరు 21నాటికి పూర్తి చేశామని.. లభించిన ఆధారాల మేరకు డిస్మిస్ చేయాలని విజ్ఞప్తి చేసింది. అయితే రాష్ట్రప్రభుత్వం అందజేసిన ఆధారాల ప్రకారం డిస్మిస్ చేయడం కుదరదంటూ కేంద్ర హోం శాఖ తిరస్కరించింది. ఆలిండియా సర్వీసు నిబంధనల ప్రకారమే ఆయనపై చర్యలు తీసుకోవాలని సూచించింది. అయినా వెనక్కి తగ్గని వైసీపీ ప్రభుత్వం కొత్త ఆధారాలు దొరికాయంటూ.. ఆయన్ను డిస్మిస్ చేయాలని మరోమారు కోరడంతో హోం శాఖ యూపీఎస్సీకి నివేదించింది. ఈ వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన యూపీఎస్సీ.. ఏ రూల్ కింద డీజీ ర్యాంకు అధికారిని డిస్మిస్ చేయాలో రాష్ట్రప్రభుత్వం పేర్కొనలేదని.. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి చేసిన తప్పేంటో, దానిపై విచారణలో తేలింది ఏమిటో.. ఆయన సమాధానం ఏమిటో ఎక్కడా లేదని స్పష్టం చేసింది. నిందపడిన అధికారి నుంచి ఎలాంటి వివరణా తీసుకోకుండా, సముచిత ఆధారాల్లేకుండా డిస్మిస్ చేయడం సాధ్యం కాదని కేంద్రానికి తేల్చిచెప్పింది. దీంతో.. రాష్ట్రం వినతిని యూపీఎస్సీ తిరస్కరించిందని.. అఖిల భారత సర్వీసుల నిబంధనల ప్రకారమే ఆయనపై చర్యలు తీసుకోవాలన్న తన మొదటి సిఫారసును అమలు చేయాలని కేంద్ర హోం శాఖ రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేగాక ఏం చర్యలు తీసుకున్నారో తమకు తెలియజేయాలని నిర్దేశించింది. అయినా జగన్ ప్రభుత్వం కేంద్రానికి ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. కనీసం కేసు ఫైళ్లు అందాయో లేదో కూడా చెప్పలేదు. ఏబీవీపై వచ్చిన ఆరోపణలు, విచారణలో తేలిన అంశాలు, వాటి ఆధారంగా ఆయనపై తీసుకున్న చర్యల వివరాలను ఈ ఏడాది జనవరి 24లోపు పంపాలని కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. స్పందన లేకపోవడంతో కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి సంజీవ్‌కుమార్ గత నెల 13న ఇంకో లేఖ రాశారు. ఇదివరకటి లేఖ గురించి ప్రస్తావించారు. ఏబీవీపై చర్యల వివరాలు ఇంకా తమకు అందలేదని.. వాటికోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. అయితే ఏబీవీని ఐదేళ్లుగా కక్షపూరితంగా వేధిస్తున్న జగన్ ప్రభుత్వం.. పూర్తి వివరాలు కేంద్రానికి అందజేస్తే సదరు కేసులో ఏమీ లేదనే విషయం బయటపడుతుందని.. ఆయన సస్పెన్షన్ రద్దవుతుందని ఆందోళన చెందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఎన్నికల వేళ ఆయన విధుల్లో చేరితే తమ ఆటలు సాగవన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలా చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వైసీపీ 'మద్యం' దారి!

(మొదటి పేజీ తరువాయి)

యథేచ్ఛగా పంపిణీ చేసి ఓట్లు వేయించుకునే దిశగా ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. వాస్తవానికి డిస్టిలరీల్లో తయారైన మద్యం.. అక్కడ నుంచి డిపోల(గోడౌన్లు)కు వెళ్లి అటు నుంచి షాపులు, బార్లకు చేరుతుంది. కానీ, ఇప్పుడు ఈ దారిని మూసేసి.. నేరుగా అధికార పార్టీ నేతలు చెప్పిన పాయింట్లకే సరుకును చేర్చుతున్నట్లు అనుమానాలు వస్తున్నాయి. తాజాగా పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి వద్ద.. డిపో నుంచి షాపులకు వెళ్లాల్సిన మద్యం లారీ దారి తప్పింది. నిర్దేశిత మార్గంలో కాకుండా, వేరే దారిలోకి సదరు వాహనం మళ్లడంతో పోలీసులు పట్టుకున్నారు. ఇలా అధికారులకు చిక్కినా మేనేజ్ చేస్తూ అనేక వాహనాలు దారి మళ్లుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పలుమార్లు మద్యం కేస్‌లు, సీసాలు స్కానింగ్ చేసే యంత్రాలు పనిచేయకపోవడం కూడా దీనికి బలం చేకూరుస్తోంది. ఈ ఆరోపణల నేపథ్యంలో అసలు మొత్తం మద్యం సరఫరాను కెమేరాల పరిధిలోకి తేవాలంటూ ఈసీ ఆదేశించింది. డిస్టిలరీలు, బ్రూవరీల్లో ఉత్పత్తి చేసే ప్రదేశాల్లో, నిల్వ చేసే డిపోలకు వచ్చి, వెళ్లే మార్గాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని, ఆ ఫీడ్‌ను జిల్లాల కలెక్టర్లు, సీఈవో కార్యాలయానికి ఇవ్వాలని ఆదేశిస్తూ సీఈవో ఎంకే మీనా.. బేవరేజెస్ కార్పొరేషన్‌కు లేఖ రాశారు. ఈ మేరకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కానీ, ఇప్పటికే కోట్లాది మద్యం బాటిళ్లు అధికార పార్టీ నేతల పాయింట్లకు చేరిపోయినట్టు తెలుస్తోంది.

షెడ్యూల్‌కు ముందే నిల్వలు

మద్యం షాపులను తమ పరిధిలోకి తెచ్చుకుని మొత్తం మద్యం వ్యాపారాన్ని తన గుప్పిట్లోకి తీసుకున్న ప్రభుత్వం.. తమ పార్టీకి మేలు చేసేలా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలపై నియంత్రణ ఉంటుంది. గతేడాది ఈ సమయంలో ఎంత మద్యం అమ్మారో, ఇప్పుడు కూడా అంతే అమ్మాలి. అందువల్ల కావాల్సినంత మద్యం దొరకదని భావించిన అధికార పార్టీ షెడ్యూల్ ప్రకటనకు ముందే జాగ్రత్తపడినట్లు సమాచారం. పలు జిల్లాల్లో స్థానిక నేతలకు ముందుగానే కావాల్సినంత మద్యం చేరవేశారు. కొన్ని చోట్ల నేరుగా డిపోల నుంచే పంపినట్లు అనుమానాలున్నాయి. కాగా, ప్రభుత్వ మద్యం షాపులే కావడంతో అధికార పార్టీ నేతలు ఎంత అడిగితే, అంత మద్యం పెద్దమొత్తంలో విక్రయించినట్టు తెలిసింది. సాధారణ వినియోగదారులు, ప్రతిపక్ష పార్టీలకు అనేక ఆంక్షలు విధిస్తూ, వైసీపీ నేతలకు మాత్రం ఇష్టానుసారంగా మద్యం ఇచ్చేశారు. ఫలితంగా గత కొద్ది నెలలుగా మద్యం అమ్మకాల విలువ పెరిగిపోయింది.

పక్కా వ్యూహంతో..

ఎన్నికల్లో కీలకంగా ఉండే మద్యం విషయంలో వైసీపీ మొదట్లోనే పక్కాగా ప్లాన్ చేసింది. సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్యం తమకు అందుబాటులో ఉండాలంటే వ్యాపారం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండకూడదని భావించి, వ్యాపారాన్ని ప్రభుత్వం తీసేసుకుంది. ఎప్పటి నుంచో కొనసాగుతున్న బార్లకు కూడా కొత్తగా వేలం నిర్వహించి కావాల్సిన వారికే కట్టబెట్టింది. ప్రధానంగా మద్యం షాపులను ప్రభుత్వం తీసుకోవడంతో అధికార పార్టీకి అన్నిరకాలుగా కలిసొచ్చింది. ఎన్నికల్లో మద్యం సరఫరాతోపాటు, మద్యంపై ఆదాయాన్ని కూడా అధికార పార్టీ ఆర్జించింది. కొత్తగా తెచ్చిన బ్రాండ్లను మాత్రమే షాపుల్లో విక్రయించి తద్వారా భారీగా కమీషన్లు రాబట్టుకుంది. నాలుగున్నరేళ్లపాటు నిరంతరాయంగా ఈ కమీషన్లను వసూలు చేసుకుని, ఇప్పుడు ఎన్నికల్లో తమ పార్టీకి మద్యం కొరత లేకుండా చేసుకుంది. ఇలా రెండు వైపులా అధికార పార్టీకి మేలుచేసేలా ప్రభుత్వ మద్యం షాపులు పనిచేయడం గమనార్హం.

పరువు పాయె!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించారో లేదో మరి. అధికారంలోకి వచ్చిన గత ఐదేళ్లలో ఏడాదికి రూ.లక్షకోట్లకుపైగా అప్పులు తెచ్చారు కానీ, రాష్ట్రం చెల్లించాల్సిన బకాయిలు, పెండింగ్ బిల్లులూ అలాగే ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెల్లించాల్సిన బాకీలు కూడా పేరుకుపోయాయి. రూ. వేలకోట్లు పేరుకుపోవడంతో రాష్ట్రం ఎప్పుడెప్పుడు చెల్లిస్తుందా అని వేయి కళ్లతో ఆ సంస్థలు ఎదురుచూస్తున్నాయి. నెలలు గడుస్తున్నా అతీగతీ లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి లేఖలు రాశాయి.

సరఫరా ఆపేస్తాం..

"రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఏపీజెన్కోకు, ఏపీడీసీఎల్‌కు కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్ ద్వారా బొగ్గు సరఫరా చేశాం. దీనికి సంబంధించి రూ.2851 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉంది. తక్షణమే ఇది చెల్లించండి. లేదంటే రాష్ట్రానికి బొగ్గు సరఫరా ఆపేస్తా"మంటూ కోల్ సెక్రటరీ మీనా హెచ్చరించారు. ఈ మేరకు సీఎస్‌కు లేఖ రాశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 29 నాటికే, కోల్ ఇండియా లిమిటెడ్‌కు ఏపీజెన్‌కో రూ.1159 కోట్లు, ఏపీడీసీఎల్ రూ.1098 కోట్లు, మార్చి 18వ తేదీ నాటికి సింగరేణి కాలరీస్‌కు ఏపీజెన్కో, ఏపీడీసీఎల్ కలిపి రూ.1098.46 కోట్లు బాకీ పడ్డాయి. మొత్తం కలిపి రూ.2851 కోట్లు. ఇది చాలా పెద్ద మొత్తం. దీని వల్ల కోల్ ఇండియా రోజువారీ కార్యకలాపాలు కూడా దెబ్బతింటున్నాయి. అలాగే, ఎంవోయూ రేటింగ్స్ కూడా తగ్గిపోతున్నాయని తన లేఖలో మీనా వెల్లడించారు.

మీటింగ్ ఎగ్గొట్టారు..: చాలా పెద్ద మొత్తం పెండింగ్ ఉండటంతో గత నెల 20వ తేదీన మీనా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెన్‌కో అధికారులను, రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆహ్వానించామని, కానీ ఆయన సమావేశానికి రాలేదని సీఎస్‌కు రాసిన లేఖలో మీనా తెలిపారు. సమస్య తీవ్రత దృష్ట్యా ఆయన సమావేశానికి కచ్చితంగా వచ్చి ఉండాల్సిందని స్పష్టం చేశారు. కనీసం ఆయన తరఫున ఏ అధికారి కూడా ఆ రోజు సమావేశంలో పాల్గొనలేదని, ఇది సరైన సంకేతం కాదని సూటిగా చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచించారు. ప్రభుత్వం నుంచి ఆ సమావేశంలో ఏ అధికారి లేకపోవడం, బకాయిలపై ఎలాంటి స్పష్టత రాకపోవడంతో సీఎస్‌కి లేఖ రాశారు. బకాయిలు చెల్లించకపోతే సరఫరాలు నిలిపివేస్తామని హెచ్చరించారు.

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి తిప్పలు

కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ఇండియా...రాష్ట్ర ప్రభుత్వానికి ఎయిర్‌పోర్టుల్లో సేవలందించిన వాటి బకాయిల కోసం ఎదురుచూస్తోంది. కడప, కర్నూలు, రాజమండ్రి ఎయిర్‌పోర్టుల్లో సీఎన్ఎస్, ఏటీఎం, ఫైర్, సెక్యూరిటీ సేవలు ఏఏఐ అందించినందుకుగాను, విద్యుత్ చార్జీల రీయింబర్స్‌మెంట్ కింద రూ.26.29 కోట్లు బాకీ పడింది. వీటిని నెలల తరబడి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదు. వాటిని తక్షణమే చెల్లించాలని సీఎస్‌ను ఆ సంస్థ కోరింది.

కొడుకు మృతదేహంతో 8 కి.మీ. నడక

- రహదారి సౌకర్యం లేక చినకూనెల గ్రామస్థుడి అవస్థ



కుమారుడి మృతదేహంతో చినకూనెల వెళ్తున్న సార కొత్తయ్య

అరకులోయ, ఏప్రిల్ 9: రహదారి సౌకర్యం లేక కుమారుడి మృతదేహాన్ని తల్లిదండ్రులు చేతులపై మోసుకుంటూ 8 కిలోమీటర్లు నడిచి స్వగ్రామానికి చేరిన దయనీయ పరిస్థితి అనంతగిరి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ శివారు శిఖర గ్రామం చినకూనెలకు చెందిన సార కొత్తయ్య, సీత దంపతులు పిల్లలతోపాటు ఉపాధి కోసం గుంటూరు జిల్లా కొల్లూరుకు వెళ్లి అక్కడ ఇటుక బట్టీలో పనిచేస్తున్నారు. కాగా, వారి రెండున్నరేళ్ల కుమారుడు ఈశ్వరరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆ చిన్నారి మృతదేహాన్ని చినకూనెల తరలించడానికి ఇటుక బట్టీ యజమాని, మేస్త్రీ అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ఆ అంబులెన్స్ మంగళవారం వేకువజామున 2 గంటలకు విజయనగరం జిల్లా మెంటాడ మండలం వనజ గ్రామం వరకు చేరుకుంది. అక్కడి నుంచి చినకూనెలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో చిన్నారి మృతదేహాన్ని చేతులపై వేసుకుని తండ్రి నడక సాగించాడు. కొండలు, గుట్టలు దాటుకుంటూ ఉదయం 8 గంటలకు స్వగ్రామం చేరుకుని అంత్యక్రియలు నిర్వహించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

బాదుడే.. బాదుడు!



- ఉమ్మడి కృష్ణాజిల్లాలో వాహనదారుల విలవిల
- ఆర్థిక సంవత్సరం ముగింపు నుంచే ధరలో తగ్గుదల
- ఎన్నికల వేళ స్వల్పంగా ధరలు తగ్గింపు
- రూ.19 మేర తగ్గి రూ. 86.44కు చేరిక
- పదేళ్ల కిందట రూ. 105.30
- భారీగా క్రూడ్ ధరలు తగ్గినా తగ్గింపులు లేవు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ముడి చమురు (క్రూడ్) ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం తగ్గటం లేదు! ఏటా కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో చమురు ధరలు అసాధారణంగా పెరగటం, కొన్ని సందర్భాల్లో తగ్గటం జరుగుతుంది. ప్రస్తుతం 2023 - 24 ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలలో చమురు ధరలు ఇంకా దిగి వచ్చాయి. ఆర్థిక సంవత్సరాంతంలో ఇంచుమించుగా క్రూడ్ ధరల్లో తగ్గుదల కనిపించింది. క్రూడ్ ధర తగ్గినా పెట్రో ధరలు మాత్రం తగ్గకపోవటం గమనార్హం. కొంత కాలంగా చమురు ధరల్లో తగ్గుదల ఉంది. ఇటీవల కేంద్ర ఎన్నికల వేళ స్వల్పంగా ధరలు తగ్గించినా తగ్గిన చమురు ధరలకు అనుగుణంగా అయితే లేదు. ఏతా వాతా వాహనదారుల నెత్తిన ఇంధన ధరలు మాత్రం తగ్గలేదు. పదేళ్ల కిందట అంటే 2014 ఏప్రిల్ నెలలో ఇదే క్రూడ్ ఆయిల్ ధర (చమురు) లీటరుకు రూ.105.56 ఉంది. 2013-14 ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చిలో రూ.105.30 ధర ఉంది. సరిగ్గా పదేళ్ల తర్వాత 2024 - 25వ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఏప్రిల్‌లో చమురు (క్రూడ్) ధర ఇండియన్ బాస్కెట్ చూస్తే రూ. 86.44 ఉంది. ప్రపంచ మార్కెట్ చూస్తే డ బ్ల్యూటీఐ క్రూడ్ ధర రూ.84.93 ఉంది. బ్రెంట్ క్రూడ్ రూ.88.58 ఉంది. ముర్బాన్ క్రూడ్ రూ. 89.15గా ఉంది. మన దేశం రష్యా నుంచి కూడా క్రూడ్‌ను దిగుమతి చేసుకుంటోంది. అక్కడయితే అక్కడి ఈఎస్‌పీవో క్రూడ్ ధర రూ. 83.02 ఉంది. అంటే ఇంకా కనిష్టానికి క్రూడ్ ధరలున్నాయి. ఇలాంటపుడు పెట్రోల్, డీజిల్ ధరలు గణనీయంగా తగ్గాల్సింది పోయి ఆ ఊసే లేకుండా పోతోంది. పదేళ్ల కిందట ఇదే ఏప్రిల్‌లో క్రూడ్ ధర రూ.105.66 ఉంటే పెట్రోల్ ధర లీటర్‌కు రూ.72.26, డీజిల్ ధర లీటర్‌కు రూ.55.49గా ఉంది. ప్రస్తుత ఆర్థిక ఏడాది ప్రారంభంలో క్రూడ్ ధర రూ.86.44గా ఉన్నా పెట్రోల్ ధర రూ.107.41, డీజిల్ ధర రూ. 95.65గా ఉంది. ఇదెక్కడి అన్యాయం? ముడి చమురు ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలలో తగ్గింపు ఉండటం లేదు. ఎటొచ్చీ ఎన్నికల సమయంలో కావడంతో కేంద్ర ప్రభుత్వం చాలా స్వల్పంగా తగ్గించింది. పదేళ్లకి, ఇప్పటికీ చమురు ధరలో భారీగా రూ. 19 మేర తగ్గుదల సంభవిస్తే ఎన్నికల వేళ కేంద్రం రూ.2లు తగ్గించింది. పెట్రోల్ ధరలు రూ.100 దాటిన పరిస్థితుల్లో వాహనదారులు విలవిల్లాడిపోతున్నారు. కరోనా అనంతర పరిస్థితుల్లో ప్రజల ఆదాయాలు పెరగకపోగా నిత్యావసరాలు, ఇతర అనేక భారాలను చవిచూడాల్సి వస్తోంది. కరోనా ముందు కూడా రూ. 80 లోపు ఉన్న పెట్రోల్ ధరలు తర్వాత పెరిగాయి. ప్రస్తుతం రూ. 107 వరకు పెరిగింది. కరోనా ఆర్థిక సంక్షోభ పరిస్థితులను తట్టుకోవటానికి ప్రజలు ప్రయత్నిస్తుంటే.. అనూహ్యంగా పెట్రోల్, డీజిల్ ధరల మోతతో కేంద్ర ప్రభుత్వం వడ్డన మోపింది. ఈ భయంకరమైన వడ్డనను తట్టుకోలేక ప్రజలు ఇంధన వినియోగాన్ని తగ్గించాల్సి వచ్చింది. కరోనా అనంతరం ఏడాది పాటు ఇంధన వినియోగంలో తగ్గుదల కనిపించింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో స్పష్టంగా కనిపించింది. కృష్ణాజిల్లా పెట్రోల్, డీజిల్ ఆయిల్ డీలర్ల సంఘం కూడా వాస్తవమేనని అధికారికంగా ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో కుటుంబాల పోషణ కోసం ఉద్యోగ, ఉపాధి మార్గాల కోసం తప్పక వాహనాలను ఉపయోగించటం, తర్వాత పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల కారణంగా ఇంధన వినియోగం పెరిగింది. క్రూడ్ ధరలు ఇంత భారీగా తగ్గినపుడు కనీసం రూ.20 ఆ పైన ధరలు తగ్గాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పెంపుపైనున్న శ్రద్ధ తగ్గుదలపై చూపించకపోవటం వల్ల ప్రజలపై భారాలకు కారణమైంది. పరోక్షంగా నిత్యావసర ధరలు పెరిగాయి. దీంతో కుటుంబాలపై ఆర్థిక భారం పడితే, రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపించింది. రవాణా రంగం పెరిగిన ధరలకు అనుగుణంగా కిరాయిలను పెంచింది. దీనికనుగుణంగా పారిశ్రామిక ఉత్పత్తుల రవాణా వ్యయం పెరిగిపోయింది. దీంతో పారిశ్రామిక ఉత్పత్తులపైనా ప్రభావం చూపింది. అధిక ధరలు ప్రజలను పీల్చి పిప్పి చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలో తీవ్ర అసహనం పెరిగిపోతోంది.



ఉగాదితో పీడకల పోతుంది..!

- పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి

వన్‌టౌన్, ఏప్రిల్ 9: జగన్ సిద్ధం అయితే జగన్‌ను ఇంటికి పంపడానికి మేము సిద్ధమని, ఉగాది పండుగతో పీడకల పోతుందని పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి విమర్శించారు. భవానీపురంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి సుజనా చౌదరి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి కూటమి పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ నేత వంగవీటి రాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో కుల, మత ప్రాతిపదికన నేతలు రాకూడదని గట్టిగా నమ్మే వ్యక్తినని అన్నారు. పవన్ కల్యాణ్ త్యాగమూర్తి అని పట్టువదలని విక్రమార్కుడిలా పొత్తు కోసం కృషి చేశారన్నారు. ప్రజల భవిష్యత్ కోసం సొంత అన్నకే సీటు ఇవ్వలేకపోయారన్నారు. రాజకీయాల్లోకి వచ్చేవారు సిద్ధాంతాలు నమ్ముకొని పనిచేయాలని అలాంటి వారే రాజకీయాల్లో రాణించగలరన్నారు. చంద్రబాబు ఎప్పటికీ నాకు రాజకీయ గురువేనన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అనంతరం వంగవీటి రాధా మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకు జగన్ సిద్ధమైతే ప్రజలు ఆయన్ను ఓడించేందుకు సిద్ధమన్నారు. కులాలు, మతాలు ముఖ్యం కాదని ప్రజల భవిష్యత్తు ముఖ్యమన్నారు. ప్రజలకు మంచి భవిష్యత్తు కావాలంటే ఈ ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో బాగా తెలుసునన్నారు. జగన్ లాంటి రాక్షసుడి పాలనలో రాష్ట్రం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి చెందాలంటే ఉమ్మడి ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అలాగే దేశం అభివృద్ధి వైపు పరుగులు తీయాలన్నా, రాష్ట్రానికి నిధులు రావాలన్నా ప్రధానమంత్రిగా మోదీ గెలవాలన్నారు. కమలం గుర్తుపై ఓటువేసి సుజనా చౌదరిని పశ్చిమలో భారీ మెజారిటీతో గెలిపించటంతో పాటుగా, తనకి అత్యధిక మెజార్టీ అందించాలని శివనాథ్ కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ సీనియర్ నేతలు బొమ్మసాని సుబ్బారావు, మైనార్టీ నేతలు ఎంఎస్ బేగ్, బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సుజనా, కేశినేని చిన్ని, రాధా


గణపతి ఆలయంలో తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న కేశినేని శివనాథ్ దంపతులు

జీవితం షడ్రుచుల సమ్మేళనం..

- పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్

భారతీనగర్, ఏప్రిల్ 9: ఉగాది నాడు తినే షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని వివిధ అనుభవాలను సూచిస్తుందని, నూతన జీవితానికి నాందిగా ఉగాది పండుగ జరుపుకొంటామని బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా కేశినేని శివనాథ్, జానకిలక్ష్మీ దంపతులు 8వ డివిజన్‌లోని ఎస్.బి.ఐ కాలనీ, సిద్ధార్థ్ నగర్‌లోని శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని స్వామికి ప్రత్యేక పూజలు చేశామని ఆయన తెలిపారు. కడియాల శ్రీనివాస్ చక్రవర్తి, వంశీ, స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కమిటీ సభ్యులు, పూజారి పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్‌కు అమల్‌రెడ్డి, నిరంజన్ రాయల్



విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 9: నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో బాస్కెట్‌బాల్ కోచ్ ఎస్.సంతోష్ వద్ద శిక్షణ పొందుతున్న ఎ.అమల్‌రెడ్డి, జి.నిరంజన్ రాయల్ జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పాలకొల్లులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరిద్దరూ చూపిన ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీలకు అర్హత సాధించారు పాండిచ్చేరిలో ఈ నెల 10 నుంచి జరిగే 38వ జాతీయ యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరిద్దరూ బరిలో దిగనున్నారు. వీరిని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.సుభాష్ చంద్రబోస్, డీఎస్‌డీవో ఎస్ఎ అజీజ్, కోచ్ అభినందించారు.

ఉచితాలను రద్దు చేయండి

- రాష్ట్ర హేతువాదసంఘ అధ్యక్షుడు నార్నె సూచన

వన్‌టౌన్, ఏప్రిల్ 9: మనిషిని సోమరిగా చేసే ఉచితాలను రద్దు చేయాలని రాష్ట్ర హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య అన్నారు. ఈమేరకు ఉమ్మడి ఫెస్టో రూపకల్పన చేసే రాజకీయ పార్టీలకు సలహాలు, సూచనలు చేస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న అరాచక పాలన పోయి ప్రజాస్వామిక పాలన రావాలని కోరుకుంటున్నట్లు, తాను ఏ పార్టీకి చెందినవాడిని కాదన్నారు. బీజేపీతో పొత్తు సమంజసం కాదన్నారు. ఎల్‌పీజీ ఉచితం అక్కర్లేదు, రూ.500 తగ్గిస్తే చాలునని సూచించారు. వృద్ధులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని వలంటీర్లను అవసరాన్ని బట్టి కొనసాగించాలన్నారు. పూజలు, యాగాలు, ముహూర్తాల జోలికి వెళ్లవద్దని, బాబాలు, స్వాములు,మాతలను దూరంగా ఉంచాలని, లౌకిక వాదనను కాపాడే పాలన రావాలన్నారు. పాస్టర్లకు, పూజారులకు, ముల్లాలకు ప్రభుత్వ ధనంతో జీతాలివ్వడాన్ని నిలిపేయాలన్నారు. విశాఖపట్నం వద్ద స్వరూపానందకు ఇచ్చిన 15 ఎకరాల భూమికి సంబంధించిన జీవోను రద్దు చేసి భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములను అక్రమించుకున్నవారిని అరెస్టు చేసి ఆయా భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. రైతుకు తగిన గిట్టుబాటు ధరలు వచ్చేటట్టు చూడాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ఇంటిపన్నుల విషయంలో శాస్త్రీయత పాటించాలన్నారు. ప్రతి వ్యక్తి తన సొంత కాళ్లపైన నిలబడేలా చూడాలని, మనిషిని సోమరిగా చేసే ఉచితాలను తొలగించాలన్నారు.



వేంకటేశ్వరస్వామి గుడిలో స్వామి కల్యాణం

వన్‌టౌన్, ఏప్రిల్ 9: బ్రాహ్మణవీధిలోని ఉన్న వేంకటేశ్వరస్వామి గుడిలో ఉగాదిని పురస్కరించుకుని పద్మావతి, శ్రీనివాసుల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు శాస్త్రోక్త విధానంలో అర్చకులు ఈ కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈవో ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ ఉగాది కార్యక్రమాలను నిర్వహించారు.

సీపీ ప్రత్యేక అర్చనలు

వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలోని గుడిలో మంగళవారం అమ్మవారికి ఉగాది సందర్భంగా ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ కాంతిరాణా పాల్గొని అమ్మవారిని స్వయంగా అర్చించారు. వేదమంత్రాలు, మంగళ హారతులను సమర్పించారు.


అమ్మవారికి హారతులు ఇస్తున్న సీపీ కాంతిరాణా

గురు సంచారంలో మార్పుతో

రాష్ట్రంలో పాలకుడి మార్పు

- వేద పండితుడు బుర్రాబాలకృష్ణ శర్మ
- బీజేపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం


బీజేపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న సుజనా చౌదరి

విద్యాధరపురం ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సరంలో త్వరలో గురు సంచారంలో మార్పు రానుండడంతో రాష్ట్రంలో పాలన మారే అవకాశం ఉందని మంగళవారం బీజేపీ కార్యాలయంలో పంచాగ పఠనం చేసిన వేద పండితుడు బుర్రాబాలకృష్ణ శర్మ చెప్పారు. ప్రజలకు మంచి జరుగుతుందని, పంచగ్రహ కూటమి వల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగినా వాటిని అధిగమించనున్నారన్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక ఇబ్బందులు తప్పవన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని, బంగారం ధరలు పెరుగుతాయన్నారు. ఇదే సందర్భంగా సుజనా చౌదరి ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరిశ్రీరామ్, రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి,మీడియా సెల్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ సీనియర్ నేత ఎంఎస్ బేగ్ పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా కొత్తపేట ఇంద్రకీలాద్రిపై ఉన్న వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్య స్వామిని సుజనా చౌదరి దర్శించుకున్నారు, ప్రత్యేక అర్చనల అనంతరం తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ హాలులో టీడీపీ సీనియర్ నేత ముష్టి శ్రీనివాస్ మిత్ర బృందం ఏర్పాటు చేసిన ఉగాది వేడుకలో సుజనా చౌదరి పాల్గొన్నారు, లంక శివానందశర్మ రాసిన పంచాంగాలను ఆవిష్కరించారు. అనంతరం శర్మ పంచాంగ విశేషాలను వివరించారు.

వేదపండితులు స్వస్తి వాచకం చదివారు. రుగ్వేదం సిస్టర్స్ సంగీత విభావరి జరిగింది. వీరిని సుజనా చౌదరి అభినందించారు.

ఖల్‌నాయక్ భార్య, కుమార్తెపై దాడి

- కుటుంబ సభ్యులే నిందితులు
- ఐదుగురిపై కేసు నమోదు
- ఇద్దరి వద్ద గంజాయి లభ్యం

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 9: రౌడీషీటర్ కట్టా వేణుగోపాల్ అలియాస్ ఖల్‌నాయక్ భార్య, కుమార్తెపై సొంత కుటుంబ సభ్యులే దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడిన ఐదుగురిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరి నుంచి 2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన రౌడీషీటర్ ఖల్‌నాయక్ ఇటీవల బెయిల్‌పై విడుదలై ఏలూరులో ఉంటున్నాడు. భార్య కట్టా లక్ష్మీ న్యూ రాజరాజేశ్వరిపేటలోనే ఉంటోంది. ఇటీవల ఖల్‌నాయక్ 3వ కుమార్తె దేవి ఇటీవల ఓ రౌడీషీటర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఈ వివాహం కుటుంబ సభ్యులకు ఇష్టం లేదు. అయితే తల్లి లక్ష్మీ మద్దతు తెలిపింది. ఈ నేపథ్యంలో వివాహాన్ని వ్యతిరేకించిన ఖల్‌నాయక్ 3వ కొడుకు కట్టా సాంబయ్య, 4వ కొడుకు రౌడీషీటర్ అయిన కట్టా గోపి, 3వ కొడుకు అల్లుడు రౌడీషీటర్ అయిన అమృత్ సురేష్, సాంబయ్య బావమరది దుర్గారావు, సాంబయ్య భార్య కట్టా శాంతి కలిసి ఖల్‌నాయక్ ఇంటికి వచ్చారు. ఇంట్లో భార్య లక్ష్మీ, ప్రేమ వివాహం చేసుకున్న 3వ కూతురు దేవిపై విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో బాధితులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన ఐదుగురిని అదుపులోకి తీసుకోగా వారిలో కట్టా గోపి, అమృత్ సురేష్ వద్ద 2 కేజీల గంజాయి లభ్యమైంది. నిందితులు ఐదుగురిపై కేసులు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు.

నగరానికి ఉగాది ముందే వచ్చింది

- జనసేన వీరమహిళ రావి సౌజన్య

విజయవాడ: జనసేన పార్టీ నుంచి పోతిన మహేశ్ వెళ్లిపోవడంతో నగరానికి ఒకరోజు ముందుగా నే ఉగాది పండుగ వచ్చిందని జనసేన వీరమహిళా కృష్ణా, పెన్నా రీజనల్ కో-ఆర్డినేటర్ రావి సౌజన్య మంగళవారం ఒక ప్రకటన అన్నారు. పోతిన మహే శ్ వెళ్లిపోవడంతో పార్టీకి ఎలాంటి నష్టం లేదని, పా ర్టీకి ఇక నుంచి అంతా మంచే జరుగుతుందన్నారు. సీటు దక్కకపోయేసరికి పోతిన నోటికొచ్చినట్టు పే లుతున్నారన్నారు. పార్టీ సంస్థాగతంగా నిర్మాణం కా లేదని చెబుతున్న ఆయన నగరాధ్యక్షుడిగా నువ్వెందుకు చేయలేదని ప్రశ్నించారు. సీటు ఇవ్వకపోయేసరికి పార్టీ నిర్మాణంలో లోపాలు కనిపించాయా అని ప్రశ్నించారు. మహేశ్ ఇప్పటి వరకు జరిగిన ఏ ఎ న్నికల్లోనూ జనసేనకు పనిచేయలేదన్నారు.

'ముస్లింలను భయపెడుతున్న వైసీపీ'

విజయవాడ: వైసీపీ ఓటమి భయంతో ఫేక్ వా ర్తలను ప్రచారం చేసి ముస్లిం సమాజాన్ని భయపెడుతోందని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అ ధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ విమర్శించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చే స్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి వ్యాఖ్యానించిట్టు ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో ప్రచారమైందని ఫేక్ స్క్రీన్‌షాట్లు సామాజిక మాధ్యమాల్లో తిప్పుతున్నారన్నారు. ఇది పూర్తిగా అవాస్తమని స్ప ష్టం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు తాను చేయలేదని పురందేశ్వరి స్పష్టత ఇచ్చారన్నారు.

గ్రూప్-2 ఫలితాలపై స్పష్టత ఇవ్వండి

పాతరాజరాజేశ్వరి పేట: 4 లక్షల పైబడి నిరుద్యోగులు ఎదురుచూస్తున్న గ్రూప్-2 ఫలితాలపై స్ప ష్టత ఇవ్వాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షు డు సమయం హేమంత కుమార్ మంగళవారం ఒ క ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రూప్-2 ఫలితాలు ఈ నెల 6న ప్రకటించాల్సి ఉండగా ఇంతవరకు విడుదల చేయక పోవడంపై నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. జరిగిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు విడుదల చేస్తే అర్హత సాధించిన వారు తదుపరి ప్రధాన పరీక్షకు సిద్ధపడే సమయం ఉంటుందన్నారు. గ్రూప్-2 ఫలితాలను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు నిరసనలకు సిద్ధమవుతారని హెచ్చరించారు.

రాజకీయ భిక్ష పెట్టిన

పవన్‌పైనే విమర్శలా..!

- పోతిన మహేశ్‌పై జనసేన నేతల ఫైర్

పెనమలూరు, ఏప్రిల్ 9: రాజకీయ భిక్ష పెట్టిన పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి పోతిన మహేశ్‌కు ఉందా అని జనసేన నేతలు ముప్పా రాజా, తాతపూడి గణేష్ పోతిన మహేశ్‌ను ప్రశ్నించారు. మంగళవారం జనసేన తాడిగడప కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సోమవారం పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి పోతిన మహేశ్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. పిఠాపురంలో నూతన గృహప్రవేశానికి పవన్ భార్యను తీసుకు రమ్మనడంలో అర్థం లేదన్నారు. ఏ అనుభవమూ లేని నీకు పవన్ కల్యాణ్ రాజకీయ భిక్ష పెడితే తిరిగి ఆయన్నే ప్రశ్నించే స్థాయికి ఎదిగావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడైతే పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశావో ఆ క్షణం నుంచి నీ రాజకీయ జీవితం మంటకలిసిపోయిందన్నారు. వైసీపీ నుంచి ఎంత ప్యాకేజీ తీసుకొని పవన్‌ను విమర్శిస్తున్నావని ప్రశ్నించారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టే స్క్రిప్టు రాసి తాడేపల్లి పెద్దలు నీకిస్తే అది చదివి ప్రజలకు వినిపిస్తావా అని ప్రశ్నించారు. నీకు టికెట్ లేదు కాబట్టి నీ నిజస్వరూపం బయటపడిందని, కేశినేని నాని, వెల్లంపల్లి నుంచి ఎంత ప్యాకేజీ తీసుకున్నావో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. జనసేన నేతలు గోళ్ల శ్రీనివాస్, వడ్డి జీవా, మాదాసు రాము, కరిమికొండ సురేష్, గంధం సురేష్, సమ్మెట సుధాకర్, తిరుమలశెట్టి సుధీర్, సుబ్బారావు, సీహెచ్ రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నేతలు తాతపూడి గణేష్, ముప్పా రాజా

ముస్లిం కుటుంబాలను ఆదుకుంటాం

- టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 9: ఐదేళ్లగా సైకో పాలనలో పూర్తిస్థాయిలో అణిచివేతకు గురైన వేలాది ముస్లిం కుటుంబాలను వచ్చే టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం తాడిగడప మసీదులో రంజాన్ పవిత్ర మాస ఉపవాస దీక్షల సందర్భంగా ముస్లింలకు ఆయన పార్టీ తరఫున ఇఫ్తార్ విందు ఇచ్చి తానే స్వయంగా వడ్డించి మాట్లాడారు. టీడీపీ పాలనలో ముస్లిం వర్గాలను వివిధ పథకాలతో అన్ని విధాలా పురోభివృద్ధిలోకి తీసుకొచ్చామని, ఒక్క చాన్సు పేరుతో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి ముస్లిం వర్గాలకు అమలు చేసిన అనేక పథకాలను దారుణంగా రద్దు చేసి ఉత్తుత్తి బటన్ నొక్కుతూ వారిని మభ్య పెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ముస్లింల సమగ్రాభివృద్ధికి రూ. 3,600 కోట్లను కేటాయించామన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం కుటుంబాలకు రూ.50వేల నుంచి రూ. లక్షవరకు రుణాలు మంజూరు చేశామన్నారు ఎలాంటి ఆదాయం లేని మసీదులకు చెందిన ఇమాంలకు రూ.5వేలు, మౌజంలకు రూ.3వేల చొప్పున పారితోషికం ఇవ్వడం చంద్రబాబుతోనే సాధ్యమైందన్నారు. దుల్హన్ పథకం కింద ముస్లిం యువతుల వివాహాలకు రూ.50వేల చొప్పున పెళ్లి కానుకలను టీడీపీ ప్రభుత్వం అందజేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, మన్నె రాజాబాబు, తుమ్మల రాంకుమార్, పోలవరపు బాబీ, షేక్ నాగుల్‌మీరా, రజాక్, నర్రా చంటి, సాదిక్, ఖాన్ యెసాన్, షేక్ బాషా, నాగూర్ పాల్గొన్నారు.


తాడిగడప మసీదులో ఇఫ్తార్ విందు సందర్భంగా ముస్లిం సోదరులకు వడ్డిస్తున్న బోడె ప్రసాద్

రాష్ట్రహితం పట్టదా?

- కృష్ణా జలాలపై బలమైన వాదనలేవీ?
- జగన్ సర్కారుపై సాగునీటి నిపుణుల ఆగ్రహం
- ఎన్నికలు వస్తున్నాయని తెలియదా?
- కోడ్ ఉందంటూ వాయిదా కోరిన వైనం
- కుదరదన్న బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్
- ఈ నెల 29లోగా స్టేట్‌మెంట్ సమర్పించాల్సిందే
- ఇక వాయిదాలుండవని స్పష్టీకరణ
- వచ్చే నెల 15 నుంచి 17 దాకా తుది విచారణ



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జస్టిస్ బ్రజేశ్‌కుమార్ సారథ్యంలోని కృష్ణా జల వివాద ట్రైబ్యునల్-2 చేసిన నీటి కేటాయింపుల పునఃసమీక్షకు కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పట్టించుకోలేదు. ప్రధానంగా కృష్ణా జలాలపై ఆధారపడిన రాయలసీమకు ఈ నిర్ణయం శరాఘాతంలా మారుతుందని.. తెలంగాణ ప్రాజెక్టులకు అదనపు కేటాయింపులు జరిగితే రాయలసీమ ఎడారిలా మారుతుందని ఎరిగినా కేంద్రంపై ఒత్తిడి తీసుకురాలేదు. ప్రధాని మోదీకి ఇదిగో లేఖ రాసేస్తున్నానన్న సీఎం.. కనీసం ఆ ధైర్యం కూడా చేయలేకపోయారు. రాయలసీమ బిడ్డ కేంద్ర కేబినెట్ నిర్ణయంపై తూతూ మంత్రంగా కేసు వేసి వదిలేశారు. ఈ కేసుపై జగన్ కనీసం సమీక్షించలేదు. ఇదో పార్శ్వం కాగా.. ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించి రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి.. అందుకు విరుద్ధంగా పేలవమైన వాదనలు వినిపిస్తూ వస్తున్నారు. ఇంతవరకు నిర్దిష్ట వైఖరిని ఖరారు చేయకుండా.. ట్రైబ్యునల్‌ను వాయిదాలు కోరుతూ కాలయాపనకు ప్రయత్నిస్తున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నామని సోమవారం ట్రైబ్యునల్‌కు నివేదించారు. విచారణ వాయిదా వేయాలని కోరారు. దీనిని ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. ఏ పరిస్థితుల్లోనూ ఈ నెల 29న స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సిందేనని తేల్చిచెప్పింది. వచ్చే నెల 15 నుంచి 17 వరకు విచారణ జరుగుతుందని స్పష్టం చేసింది. సోమవారం నాటి రాష్ట్ర వాదనలను పరిశీలించిన వారికి.. కృష్ణాజలాల హక్కులను కాపాడుకోవాలన్న చిత్తశుద్ధి జగన్‌కు ఏమాత్రం లేదని తేలిపోయిందని జల వనరుల నిపుణులు, రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయ పక్షాలైతే తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

నాడు నోరెత్తని జగన్..

కృష్ణా జలాల్లో 75 శాతం డిపెండబిలిటీని లెక్కగట్టి.. కృష్ణా ట్రైబ్యునల్-2 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 800 టీఎంసీలను కేటాయించింది. దీనితో పాటు మరో 11 టీఎంసీల మిగులు జలాలను కలిపి మొత్తం 811 టీఎంసీలను కేటాయించింది. రాష్ట్ర విభజన తర్వాత ఇందులో 512 టీఎంసీలు నవ్యాంధ్రకు, 299 టీఎంసీలు తెలంగాణకు కేటాయించారు. వాస్తవానికి తెలంగాణకు మొదట 277 టీఎంసీలే ఇచ్చారు. తర్వాత బీమా ప్రాజెక్టుకు మరో 20 టీఎంసీలు కేటాయించారు. అయినా తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తమకు 50 శాతం కేటాయించాల్సిందేనని వాదిస్తోంది. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నేతృత్వంలో 2020 అక్టోబరు ఆరో తేదీన జరిగిన అపెక్స్ కమిటీ సమావేశంలో ఈ కేటాయింపులను పునఃసమీక్షించాలని నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ డిమాండ్ చేశారు. ఈ భేటీకి హాజరైన జగన్ కిమ్మనలేదు. దీంతో.. కేసీఆర్ వాదనలను ఆంధ్ర అంగీకరించినట్లుగానే కేంద్ర జలశక్తి శాఖ భావించింది. కేటాయింపుల పునఃసమీక్ష బాధ్యతను ట్రైబ్యునల్-2కు కట్టబెడుతూ గెజిట్ కూడా జారీచేసింది. నదీ పరివాహక ప్రాంతం ఆధారంగా కృష్ణా జలాల కేటాయింపు జరిపితే.. ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని రాష్ట్ర రైతాంగం, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా జగన్ పట్టించుకోలేదు. రైతాంగం ఆందోళన ఉధృతం కావడంతో.. రాష్ట్ర జలవనరుల శాఖ కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని తప్పుబడుతూ సుప్రీం కోర్టులో వ్యాజ్యం వేసి చేతులు దులుపుకొంది. ఇటు ట్రైబ్యునల్ ముందు వాదనలు వినిపించకుండా లేనిపోని సాకులతో వాయిదాలు కోరుతోంది. ట్రైబ్యునల్‌లో ఏపీ తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా, తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తున్నారు. ఈ కేసుకు సబంధించి గత ఏడాది మార్చి 20వ తేదీన తెలంగాణ తన స్టేట్‌మెంట్‌ను ట్రైబ్యునల్‌కు సమర్పించింది. ఏపీ సర్కారు ఇప్పటికీ సమర్పించలేదు. వాస్తవానికి ఈ నెల నాలుగో తేదీన స్టేట్‌మెంట్‌ను ఇవ్వాల్సి ఉన్నా విచారణ ఎనిమిదో తేదీకి వాయిదా పడింది. సోమవారం కూడా రాష్ట్ర ప్రభుత్వం తన స్టేట్‌మెంట్‌ను ఇవ్వకుండా కోడ్ ఉన్నందున విధాన నిర్ణయం తీసుకోలేమని.. మరికొంత సమయం ఇవ్వాలని కోరింది. దీనిని తెలంగాణ ఆక్షేపించింది. ఎన్నికలు వస్తాయని ముందుగా తెలియదా.. కాలహరణం చేసేందుకే ఆంధ్రప్రదేశ్ ఇలాంటి వాదనలు వినిపిస్తోందని తెలిపింది. ఈ వాదనతో ఏకీభవించిన ట్రైబ్యునల్.. నీటి కేటాయింపులు కొత్త ప్రాజెక్టులకు సంబంధించి కాదని.. ఇది విధాన నిర్ణయమూ కాదని అభిప్రాయపడింది. వాయిదా ఇవ్వడం కుదరదని స్పష్టం చేసింది. ఈ నెల 29వ తేదీలోగా కేసుకు సంబంధించిన స్టేట్‌మెంట్‌ను ఆంధ్రప్రదేశ్ అందించాల్సిందేనని తేల్చిచెప్పింది. స్టేట్‌మెంట్ ఇచ్చిన రెండు వారాల్లో సమాధానాలు ఇచ్చిపుచ్చుకోవాలని రెండు రాష్ట్రాలనూ ఆదేశించింది.. వచ్చే నెల 15 నుంచి 17వ తేదీ దాకా తుది విచారణ జరుపుతామని పేర్కొంది.

వెంకట్రామిరెడ్డికి కోడ్ వర్తించదా?

- పీటీడీ ఉద్యోగులపైనే ఆర్టీసీకి కక్షా?
- ఎన్నికల కోడ్ నిబంధనలు కేవలం బీసీ, ఎస్సీ, మైనార్టీ ఉద్యోగులకేనా?
- ప్రజా రవాణా ఉద్యోగుల ఆవేదన

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అందరికీ ఒకేలా వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవారు కోడ్ అమల్లో ఉన్న సమయంలో సర్కారు పార్టీకే కాదు.. ఏ పార్టీకీ అనుకూలంగా ప్రచారం చేయకూడదు. ఇలా చేస్తే కోడ్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారు. అయితే, ఈ విషయంలో అసలు వ్యక్తిని వదిలేసి.. కొసరు నేతలపై చర్యలు తీసుకోవడం ప్రజారవాణా విభాగం(పీటీడీ)లో మంటలు రేపింది. ఎన్నికల కోడ్‌కు సంబంధించిన మార్గదర్శకాలు ఉద్యోగ సంఘం నాయకుడికి పట్టవా? అని పీటీడీ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు.. "మాపైనే ఎందుకు కక్ష.. ఇదేం పనిష్మెంట్?" అని వాపోతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల అత్యుత్సాహమో లేక ప్రభుత్వ అధికారుల వివక్షో తెలీదు కానీ.. ప్రభుత్వ పార్టీ వైసీపీ పక్షాన ప్రచారం చేసిన అసలు వ్యక్తి, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిపై ఈగ కూడా వాలలేదు. కానీ, ఈయన చేసిన ప్రచారంలో పాల్గొన్న వారిపై మాత్రం ఆర్టీసీ ఎండీ నిబంధనల కత్తి దూశారు. ఈ క్రమంలో పీటీడీ వైఎస్సార్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్యతోపాటు బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఏపీఎస్ఆర్టీసీలో తీవ్ర చర్చనీయాంశమైంది. తాము ఏ తప్పు చేయకున్నా.. పీటీడీ కమిషనర్(ఆర్టీసీ ఎండీ) చర్య తీసుకున్నారని, అదే తప్పునకు ప్రధాన కారకుడైన వెంకట్రామిరెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల అత్యుత్సాహం వల్ల తమకు అన్యాయం జరిగిందని, నిజంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) రూల్స్ ఉల్లంఘించినట్లయితే వెంకట్రామిరెడ్డిపైన ప్రభుత్వం చర్య తీసుకోవాలి కదా? అని నిలదీస్తున్నారు. వెంకట్రామిరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ ఎక్కడికక్కడ ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. జగన్ ప్రభుత్వం అది చేసింది.. ఇది చేసింది.. కనుక మరోమారు వైసీపీకి ఓటేసి రుణం తీర్చుకోవాలని జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు చెబుతున్నారు. ఇదే క్రమంలో చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాలోని ఆర్టీసీ డిపోలు, బస్టాండ్లలోకి వెళ్లి కార్పొరేషన్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన జగన్ రుణం తీర్చుకోవాలంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. మార్చి 31న బద్వేలు డిపోలో ఇదే విషయం చెబుతున్న సమయంలో అనుబంధ పీటీడీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్యతోపాటు అసోసియేషన్‌కు చెందిన సుందరయ్య(బద్వేలు), రామచంద్రుడు(ప్రొద్దుటూరు), ఫక్రుద్దీన్(కడప)లు కనిపించారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతున్న ఫొటోలు పత్రికల్లో రావడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చంద్రయ్యతోపాటు ఇతరుల్ని వివరణ అడిగారు. తాము ఉద్యోగుల సమస్యలు మాట్లాడేందుకే వెళ్లామని, డిపో మేనేజర్ కూడా అక్కడ ఉన్నారంటూ వివరణ ఇచ్చారు. అయినా ఆర్టీసీ ఎండీ ఇవేవీ పట్టించుకోకుండా బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారిని సస్పెండ్ చేశారు. ఇక, దీనికి మూలకారణమైన వెంకట్రామిరెడ్డిని కూడా ప్రభుత్వం సస్పెండ్ చేస్తుందేమోనని అందరూ అనుకున్నారు. కానీ, ఆయనకు ఇవేవీ వర్తించనట్టే వ్యవహరించారు. ఆర్టీసీలో ఇప్పుడు ఇదే పెద్ద చర్చనీయాంశం అయింది. సస్పెన్షన్లు, పనిష్మెంట్లు కక్ష సాధింపులా ఉన్నాయని అంటున్నారు.

రైతులకు ఉపయోగపడే పంచాంగాలు

- వ్యవసాయ, ఉద్యాన పంటలపై శాస్త్రవేత్తలతో రూపకల్పన: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు విధానాలపై శాస్త్రవేత్తలు రూపొందించిన పంచాంగాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్రోధి నామ సంవత్సరాది ఉగాది సందర్భంగా విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ, వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ 2024-25 వ్యవసాయ, ఉద్యాన పంచాంగాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పండించే ప్రధాన పంటలకు సంబంధించిన అనేక అంశాలను వ్యవసాయ, ఉద్యాన పంచాంగాల్లో పొందుపర్చారని చెప్పారు. ఇవి రైతులకు చాలా ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది రైతులు మంచి దిగుబడులు సాధించి, సుఖశాంతులతో జీవనం సాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా వర్సిటీల వీసీలు శారద జయలక్ష్మి, జానకీరామ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పత్రాల దగ్ధంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం

- తన అవకతవకలు బయటపడతాయన్న భయంలో రఘురామిరెడ్డి
- అందుకే సాక్ష్యాధారాల ఫైల్స్‌ను కావాలని తగలబెట్టించాడు: వర్ల

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సిట్ కార్యాలయంలో హెరిటేజ్ సంస్థకు సంబంధించిన ఫైల్స్ దగ్ధం చేయడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య చెప్పారు. ఈ విషయంలో తప్పు చేసిన ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలకమైన కేసుకు సంబంధించిన కీలక ఫైల్స్‌ను సిట్ కార్యాలయంలోనే దహనం చేశారంటే పోలీసులు ఎంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నారో అర్థమౌతోంది. సిట్ అధికారి రఘురామిరెడ్డికి వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాధారాల ఫైల్స్‌ను అతనే కావాలని తగలబెట్టించాడు. ఫైల్స్ తగలబడ్డ ముందు రోజే అతనికి ఢిల్లీ నుంచి ఫోన్ వచ్చింది. అసోం పోలీస్ అబ్జర్వర్‌గా కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే.. తన అవకతవకలు బయటపడతాయనే భయం అతనిలో ఏర్పడింది. అందుకే ముందు జాగ్రత్తగా అతనే ఫైల్స్ దగ్ధం చేయించాడు. జిరాక్స్ తీస్తుంటే ఇంకు అయిపోయిందని, జిరాక్స్ విజన్‌లో పేపర్లు ఇరుక్కుపోయి, పాడైన పేపర్లు తగలబెట్టామని సాకులు చెప్తున్నారు. ఎప్పుడో ముద్దాయిలకు ఇచ్చిన ఫైల్స్ అవి. తప్పుడు కేసుల్లో, దొంగ సాక్ష్యాలతో చంద్రబాబును అరెస్ట్ చేసిన వ్యక్తి ఇతనే. ఈ కేసులో కొల్లి రఘురామిరెడ్డికి వ్యతిరేకంగా సాక్ష్యాలు బయటకు వస్తాయనే భయంతో అతనే ఫైళ్లను తగలబెట్టించారని ఆరోపించారు. ఫైళ్ల దగ్ధంపై డీజీపీ ఏమీ మాట్లాడలేదు. అందుకే ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశాం. ఫైల్స్ దగ్ధంపై విజువల్స్‌ను సీఈవోకు అందజేశాం. దీనిపై వెంటనే సమగ్ర విచారణ చేయించాలని కోరాం. తెలంగాణలో అధికార మార్పిడి జరిగినప్పుడు ముఖ్యమైన ఫైల్స్ వెళ్లిపోయినట్లు ఇక్కడ కూడా జరుగుతున్నట్లు అనుమానంగా ఉంది. అందుకే ఎన్నికలు అయిపోయే వరకు ఏ ఆఫీస్‌లో ఏ ఫైల్ ధ్వంసం చేయడానికి వీల్లేదని చీఫ్ సెక్రటరీకి డైరెక్షన్ ఇవ్వాలని ఈసీని కోరినట్లు వర్ల చెప్పారు.

తెలంగాణ హైకోర్టుకు మార్గదర్శి కేసు

- ఆరు నెలల్లో వాదనలు పూర్తిచేయాలని సుప్రీం ఆదేశం
- మీడియాకు దూరంగా ఉంటే మంచిదని ఉండవల్లికి సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి డిపాజిట్లపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. డిపాజిట్లపై మరింత సమగ్ర పరిశీలన జరగాల్సి ఉన్నదని అత్యున్నత ధర్మాసనం అభిప్రాయ పడింది. అందుకే కేసును తెలంగాణ హైకోర్టుకు రిఫర్ చేస్తూ తీర్పు ఇచ్చింది. మార్గదర్శి డిపాజిట్ల కేసుపై మంగళవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసును న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. "ఈ కేసులో మెరిట్స్‌లోకి వెళ్లాలని అనుకోవడం లేదు. అయితే డిపాజిట్లపై సమగ్ర పరిశీలన జరగాలి. ఇంకా ఎవరికైనా డబ్బులు ఇవ్వాల్సి ఉన్నదా? అనేది పబ్లిక్ నోటీసు జారీ చేయడం ద్వారా వివరాలు సేకరించాలి. కొన్ని టెక్నికల్ రీజన్స్ నేపథ్యంలో కేసును తెలంగాణ హైకోర్టుకు రిఫర్ చేస్తున్నాం. రెండు, మూడు నెలల్లో డిపాజిట్లపై సమగ్ర పరిశీలన జరపాలి. దీనికోసం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలి. ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా హైకోర్టుకు సహకరించాలి. కేసు విచారణ జరుగుతున్న కాలంలో ఉండవల్లి మీడియా ముందుకు వెళ్లకపోవడం మంచిది. ఈ కేసులో ఏపీ ప్రభుత్వం, ఉండవల్లి, ఆర్బీఐ వాదనలు వినిపించాల్సి ఉంటుంది" అని ధర్మాసనం తెలిపింది. ఆరు నెలల్లో వాదనలు పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది.

అమెరికాలో కిడ్నాపైన హైదరాబాదీ విద్యార్థి మృతి

- మార్చి 7న అపహరించిన దుండగులు
- 1200 డాలర్లు డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని తండ్రికి ఫోన్
- మృతిచెందినట్లు ఎంబసీ నిర్ధారణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో అపహరణకు గురైన హైదరాబాదీ విద్యార్థి మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్(25) మృతిచెందినట్లు న్యూయార్క్‌లోని భారత దౌత్య కార్యాలయం మంగళవారం నిర్ధారించింది. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. "మేము కొంత కాలంగా వెతుకుతున్న మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్ మృతదేహాన్ని ఓహైయోలోని క్లేవ్‌ల్యాండ్‌లో గుర్తించాం. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసేందుకు స్థానిక పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఆ పోస్టులో పేర్కొంది. మృతదేహాన్ని హైదరాబాద్ తరలించడానికి సహాయం చేస్తామని ప్రకటించింది. హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతానికి చెందిన అబ్దుల్ క్లేవ్‌ల్యాండ్ వర్సిటీలో ఐటీలో మాస్టర్స్ చేయడానికి అమెరికా వెళ్లారు. గతనెల 7న ఆయన కిడ్నాప్ అయ్యారు. కిడ్నాపర్లు నాచారంలోని అబ్దుల్ తండ్రి మహమ్మద్ సలీంకు ఫోన్ చేసి, 1,200 డాలర్లు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వని పక్షంలో అబ్దుల్ కిడ్నీని విక్రయిస్తామని బెదిరించారు. దాంతో సలీం తన కుమారుడితో మాట్లాడించాలని, అతను అక్కడే ఉన్నట్లు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో కిడ్నాపర్లు ఫోన్ కట్ చేశారు. కిడ్నాపర్ల ఫోన్ నంబర్‌ను అమెరికాలోని తమ బంధువులకు పంపామని, వారు గత నెల 8న క్లేవ్‌ల్యాండ్ పోలీసులకు ఫిర్యాదు చేశారని అప్పట్లో సలీం వెల్లడించారు. మంగళవారం క్లేవ్‌ల్యాండ్‌లోనే అబ్దుల్ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. కాగా.. అబ్దుల్ తండ్రి సలీం నాచారంలో సెంట్రింగ్ కాంట్రాక్టు పనులు చేస్తుంటారు. ఆయనకు సలీంతోపాటు.. మరో కుమార్తె ఉన్నారు. కుమార్తె లండన్‌లో ఉంటున్నారు.

నెట్‌వర్క్ లేకున్నా ఫోన్ జాడ తెలుసుకోవచ్చు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఫోన్ పోతే.. 'ఫైండ్ మై డివైజ్' అనే ఆప్షన్ సాయంతో అది ఎక్కడుందో కనుక్కునే అవకాశం ఉంది. కానీ, దాంట్లో ఓ చిక్కు కూడా ఉంది. మన ఫోన్‌లో ఇంటర్‌నెట్ కనెక్షన్ యాక్టివ్‌గా ఉండాలి. అలా ఇంటర్‌నెట్ లేకున్నా కూడా.. పోయిన మన ఫోన్ ఎక్కడుందో గుర్తించేలా గూగుల్ సంస్థ 'ఫైండ్ మై డివైస్ నెట్‌వర్క్'ను అప్‌గ్రేడ్ చేసింది. ఆండ్రాయిడ్ 9 ఆపై ఆపరేటింగ్ సిస్టమ్‌తో నడిచే ఫోన్లన్నింటిలో ఈ అప్‌గ్రేడెడ్ వెర్షన్ పనిచేస్తుంది. నిజానికి యాపిల్ గతంలోనే ఈ ఆప్షన్‌ను తన వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. ఇంటర్‌నెట్ లేకున్నా.. ఫోన్లలో ఉండే బ్లూటూత్ ప్రాగ్జిమిటీ ఆధారంగా పోయిన ఫోన్ లొకేషన్‌ను గుర్తించే టెక్నాలజీ అది. గూగుల్ కూడా ఆ విధానాన్నే అందుబాటులోకి తెచ్చింది.

సీఈసీ రాజీవ్‌కుమార్‌కు జెడ్ కేటగిరీ భద్రత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రత కల్పించింది. ఆయనకు రక్షణగా ఉండేందుకు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన దాదాపు 45 మంది సాయుధ కమాండోలను కేంద్ర హోంశాఖ నియమించింది. ఎన్నికల తరుణంలో సీఈసీకి ముప్పు ఉందని కేంద్ర ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుల మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

ప్రజా ఉద్యమాలు మరింత బలపడాలి: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తన మాట వినకపోతే జైళ్లలో పెడుతుందని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు జీ ఓబులేసు విమర్శించారు. ఈ నేపథ్యంలో జనం మద్దతును కూడగట్టుకునేందుకు కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు మరింత బలపడాలని చెప్పారు. మంగళవారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

నేడు సీపీఐ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

సీపీఐ ఎన్నికల మేనిఫెస్టోను బుధవారం విడుదల చేయనున్నారు. దాసరి భవన్‌లో ఉదయం 11 గంటలకు తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మేనిఫెస్టోను విడుదల చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు.

గ్రూప్-2 ఫలితాలు ఎప్పుడు..?

- నిష్పత్తిపై అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ
- 1:100 ఉంటుందన్న ఏపీపీఎస్సీ సభ్యుడు
- త్వరలో ఫలితాలని ఇటీవల ప్రకటన.. 4 లక్షల మంది ఎదురుచూపులు

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఫిబ్రవరి 25న జరిగిన గ్రూప్-2 ప్రాథమిక పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ ఇప్పటికీ విడుదల చేయకపోవడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా ఈసారి మెయిన్స్‌కు ఎంత నిష్పత్తి నిర్ణయిస్తారు అనేది ఉత్కంఠకు కారణమైంది. 897 పోస్టుల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 ప్రాథమిక పరీక్ష ప్రశ్నపత్రాన్ని ఏపీపీఎస్సీ అత్యంత కఠినంగా రూపొందించింది. దీంతో ఎక్కువ మంది తెలియని ప్రశ్నలకు కూడా ఏదో ఒకటి అన్నట్టుగా సమాధానాలు పెట్టారు. దీనివల్ల నెగిటివ్ మార్కులు పెరిగాయి. మొత్తం 150 ప్రశ్నలతో కూడిన పరీక్షలో 90 ప్రశ్నలకు కూడా సమాధానాలు ఎంపిక చేయడం కష్టంగా మారిందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతిసారీ మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిని తీసుకుంటుండగా, ఈసారి పేపరు కఠినంగా వచ్చినందున 1:100 తీసుకోవాలని అభ్యర్థులు కోరారు. ఈ వినతితో పెద్దఎత్తున ఏపీపీఎస్సీకి లేఖలు పంపారు. దీనిపై స్పందించిన ఏపీపీఎస్సీ సభ్యుడు పరిగె సుధీర్ ఈసారి మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిని తీసుకుంటారని ట్విటర్‌లో తెలిపారు. వారం రోజుల్లో దీనిపై ప్రకటన ఉంటుందని వెల్లడించారు. కానీ, ఆయన ట్వీట్ చేసి 20 రోజులైనా ఇంతవరకూ ఏపీపీఎస్సీ ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారో కూడా వెల్లడించడం లేదు. నిష్పత్తిపై గందరగోళం నెలకొనడంతో ఫలితాలు వీలైనంత త్వరగా విడుదల చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ప్రతిరోజూ వినతులు సమర్పిస్తున్నా ఏపీపీఎస్సీ పట్టించుకోవడం లేదు. పరీక్ష రాసిన 4.04 లక్షల మంది ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. త్వరగా ఫలితాలు ప్రకటిస్తే మెయిన్స్‌కు సన్నద్ధత, ఇతర పోటీ పరీక్షల కోసం సమయం కేటాయిస్తామని, ఈ జాప్యం వల్ల ఎటూ తేల్చుకోలేకపోతున్నామని కోరుతున్నా ఏపీపీఎస్సీ స్పందించడం లేదని వాపోతున్నారు.

విశాఖ ఉక్కులో 'వీఆర్ఎస్'

- 2,500 మందిని తగ్గించాలని ప్రణాళిక
- అన్ని విభాగాల్లో ఇప్పటికే సిబ్బంది కొరత
- స్వచ్ఛందంగా ఉద్యోగాలు వదిలేసేవారికి వెంటనే సొమ్ములు ఇచ్చేందుకు సిద్ధం
- 1,445 కోట్లు ఇస్తామని కేంద్రం ప్రకటన



స్టీల్‌ప్లాంటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి భారీ ప్రణాళిక సిద్ధమవుతోంది. అప్పులు అధికంగా ఉన్నాయని, ముడి పదార్థాల కొరత ఉందని ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరితే నిరాకరించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాని(వీఆర్ఎస్)కి మాత్రం నిధులు ఇస్తామని(బడ్జెట్ సపోర్టు) ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో 2,500 మందిని తీసేస్తే వారికి పరిహారంగా ఇవ్వడానికి రూ.1,445 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. అయితే, వీఆర్ఎస్ ప్రక్రియ అంతా ఏడాదిలోనే పూర్తి చేయాలని షరతు పెట్టడం గమనార్హం. ప్రస్తుతం విశాఖ ఉక్కులోని అన్ని విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ఐదుగురు పనిచేయాల్సిన చోట ముగ్గురే చేస్తున్నారు. పని ఒత్తిడి అధికంగా ఉంది. నాలుగేళ్ల నుంచి కొత్త నియామకాలు ఆపేశారు. మరోవైపు ఏడాదికి 700 నుంచి 800 మంది పదవీ విరమణ చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం(2024-25)లో ఇంకో వెయ్యి మంది రిటైర్ కానున్నారు. 2027 చివరికి 4 వేల మంది రిటైర్‌మెంట్ పేరుతో బయటకు వెళ్లిపోతారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి 14 వేల మంది ఉన్నారు. 2027 నాటికి వారి సంఖ్య 10 వేలకు పడిపోతుంది. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని అస్మదీయులైన కార్పొరేట్లకు అప్పగించేటపుడు వారిపై జీతాల భారం అధికంగా ఉండకూడదని రిక్రూట్‌మెంట్ పూర్తిగా ఆపేశారు. ఉన్నవారిని కూడా పంపించేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. నిలదొక్కుకోవడానికి సాయం అడిగితే స్పందించని కేంద్ర ప్రభుత్వం వీఆర్ఎస్‌కు మాత్రం రూ.1,445 కోట్లు ఇవ్వడానికి ముందుకు రావడంపై కార్మిక వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో ఇలా ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు ప్రధాని పీవీ నరసింహరావు రూ.1,200 కోట్లు, ఆ తరువాత వాజపేయి మరో రూ.1,400 కోట్లు సాయం చేశారు. ఆనాటి అప్పులను రద్దు చేసి వాటాను మూలధనంగా మార్చారు. దీనివల్ల స్టీల్ ప్లాంటు మళ్లీ లాభాల బాటలోకి వచ్చి సొంత నిధులతో రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యం సాధించింది.

వీఆర్ఎస్ తీసుకునేలా..

విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి ఎలాగోలా బయటపడితే చాలనే అభిప్రాయం ఉద్యోగుల్లో బలంగా వినిపిస్తోంది. గత కొద్ది నెలలుగా జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేకపోతున్నారు. ఈ నెల 50 శాతం జీతం సోమవారం ఇచ్చారు. భవిష్యత్తులో ఇంకెలాంటి పరిస్థితులు ఉంటాయో తెలియవని హెచ్చరిస్తున్నారు. ఇక్కడ ఉద్యోగులకు 15 ఏళ్ల నుంచి పే రివిజన్ లేదు. తక్కువ జీతాలకే పనిచేస్తున్నారు. పదోన్నతులు లేవు. 30-40 ఏళ్ల వయసున్న ఉద్యోగులు ఇక్కడుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని భావించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత రెండేళ్లలో 500 మంది రాజీనామా చేసి ఇతర సంస్థలకు వెళ్లిపోయారు. పదవీ విరమణకు చేరువైన వారు మాత్రం యాజమాన్యం జీతాలు ఇవ్వలేకపోతున్నది కాబట్టి.. కేంద్రం ఇచ్చే వీఆర్ఎస్ ప్యాకేజీ తీసుకొని వెళ్లిపోవడమే మంచిదని ఆలోచిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

త్వరలోనే సూపర్ పవర్‌గా భారత్

- మంచి పాలకుల వల్లే ఇది సాధ్యం: వెంకయ్య
- స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత్ త్వరలోనే సూపర్ పవర్ దేశంగా అవతరిస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ శక్తిమంతంగా ఎదుగుతోందని.. దేశం ప్రపంచాన్ని శాసించేశక్తిగా ఎదగాలంటే ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తెలుగు కొత్త సంవత్సరం వేళ కొత్త సంకల్పాలు తీసుకుందామని ఉద్బోధించారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మంగళవారం జరిగిన శ్రీ క్రోధి నామ ఉగాది వేడుకలకు వెంకయ్య హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ రాధాకృష్ణన్‌కు ట్రస్ట్ అందిస్తున్న సేవలు, ఇతర విశేషాలను వివరించారు. అంతకు ముందు జ్యోతిని వెలిగించి ఉగాది వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. 2014లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పదో స్థానంలో ఉన్న భారత్.. ఇప్పుడు ఐదో స్థానానికి ఎగబాకిందని వివరించారు. మంచి పాలకుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. 2027 నాటికి మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడం తథ్యం అని అన్నారు. నాయకులు రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడారు. తెలుగు వినసొంపైన భాష అని, తెలుగు భాష, సంగీతం రెండూ కలిసిపోయేలా ఉంటాయని అన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో స్కాంలు బయటపడతాయి

- కొందరికి శిక్షలు పడతాయి.. ఎన్నికల నాటికి రాహుల్‌కు యోగం
- గాంధీభవన్ పంచాంగ పఠనంలో వేద పండితుడు శ్రీనివాస్‌మూర్తి

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజకీయ ఉన్నతి పరంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తిరుగులేని యోగం ఉందని, తదుపరి విశ్వావసు నామ ఉగాది వరకు ఆయన్ను ఎవరూ ఏమీ చేయలేరని వేదపండితుడు శ్రీనివాస్‌మూర్తి ఉద్ఘాటించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి తాను ఏది చేస్తే అది కరెక్టు అని భావించి.. శ్రమించి పని చేసినందువల్లే కాంగ్రెస్ పార్టీ సర్కారును ఏర్పాటు చేసిందని.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయనకు పూర్తిగా సహకరిస్తేనే సత్ఫలితాలు ఉంటాయని చెప్పారు. క్రోధి నామ సంవత్సరంలో కోపాలు, ఆవేశాలకు గురవ్వకుండా రేవంత్ నాయకత్వంలో సమష్టిగా పని చేయాలంటూ పార్టీ నేతలకు సూచించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి లోక్‌సభ ఎన్నికల నాటికి యోగం కలుగుతుందని, కాంగ్రెస్ పార్టీ కొన్ని చోట్ల అనూహ్యమైన విజయాలు సాధిస్తుందని చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన ఉగాది వేడుకలో ఆయన పంచాంగ పఠనం చేశారు. అనంతరం మాట్లాడారు. ఈ సంవత్సరం దేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని, చాలా మంది రాజకీయ నాయకులు కనుమరుగవుతారని పేర్కొన్నారు. నేతల ఆకస్మిక మరణాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో మార్పులు అనివార్యమవుతాయని చెప్పారు. ఈ ఏడాది నేర ప్రవృత్తి పెరుగుతుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో గత ప్రభుత్వంలోని స్కాములు, భూ కబ్జాలు బయటపడతాయని, కొందరు రాజకీయ నేతలు శిక్షలు అనుభవిస్తారని పేర్కొన్నారు. బ్యాంకింగ్, కమ్యూనికేషన్, పబ్లిక్ సెక్టార్, డీమ్డ్ వర్సిటీ వ్యవస్థల్లో అవకతవకలు బయట పడతాయని చెప్పారు.

నేను బాధితురాలిని

ఢిల్లీ మద్యం కేసుతో సంబంధం లేదు

- తిహాడ్ జైలు నుంచి ఎమ్మెల్సీ కవిత లేఖ
- కవితకు మరో 14 రోజులు రిమాండ్ పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఈ కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ కేసులో తాను బాధితురాలినని, దర్యాప్తు సంస్థలు ఉద్దేశపూర్వకంగానే తనపై నిందలు మోపుతున్నాయని ఆరోపించారు. ఆధారాలు ధ్వంసం చేశానని, సాక్షులను బెదిరిస్తున్నానని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. విచారణ పేరుతో తనను ఎంతగానో వేధించారని, తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించారన్నారు. ఈ మేరకు కవిత 4 పేజీల లేఖను విడుదల చేశారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత కస్టడీ ముగియడంతో మంగళవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఆమెను హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో కవిత మాట్లాడాలనుకుంటున్నారని, అవకాశం ఇవ్వాలని ఆమె తరఫు న్యాయవాది కోరగా.. అందుకు జడ్జి నిరాకరించారు. కవిత జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులపాటు పొడిగించారు. కాగా, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో కవిత లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో, "ఢిల్లీ మద్యం కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను తప్పు చేశానని చెప్పడానికి ఎటువంటి ఆధారాల్లేవు. ఈ కేసులో నేను బాధితురాలిని మాత్రమే. దర్యాప్తు సంస్థలు చెబుతున్నట్టు ఈ విషయంలో నాకు ఎలాంటి ఆర్థిక లబ్ధి చేకూరలేదు. నా మొబైల్ నంబర్‌ను మీడియాలో ప్రసారం చేసి నా ప్రైవసీని దెబ్బతీశారు. రెండున్నరేళ్లుగా విచారణ పేరుతో మానసికంగా వేధిస్తున్నారు" అని కవిత పేర్కొన్నారు. కవిత జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు రౌస్ ఎవెన్యూ కోర్టు పొడిగించింది. తిహాడ్ జైలులో ఉన్న కవితను ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం కలవనున్నట్టు సమాచారం.

ఫోన్ ట్యాపింగ్ కేసులో.. 10 మందికి పైగా బీఆర్ఎస్ నేతలు!

- విచారణలో రాధాకిషన్‌రావు వెల్లడి!!

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఇంతకాలం పోలీసు అధికారుల చుట్టూ తిరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు.. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఎస్డీ) రాధాకిషన్‌రావు విచారణతో కీలక మలుపు తిరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) చీఫ్ ప్రభాకర్‌రావు కీలక పాత్రధారిగా సాగిన ఈ వ్యవహారంలో సూత్రధారుల డొంక కదిలింది. బీఆర్ఎస్‌కు చెందిన 10 మందికి పైగా నేతలు ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు రాధాకిషన్‌రావు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. బుధవారంతో రాధాకిషన్ కస్టడీ ముగియనుంది. ఈ కేసులో రాధాకిషన్‌రావు వాంగ్మూలం అత్యంత కీలకం కావడంతో.. తొలిరోజు కస్టడీలోకి తీసుకోవడానికి ముందే దర్యాప్తు అధికారులు న్యాయనిపుణుల సలహాలను తీసుకున్నారు. కోర్టులో కేసు ఎక్కడా వీగిపోకుండా బలమైన ఆధారాలను సేకరించేందుకు.. 200 ప్రశ్నలను సిద్ధం చేసుకున్నారు. రాజకీయ కోణానికి సంబంధించిన సమాధానాలను రాబట్టుకున్నారు. గత ప్రభుత్వ పెద్దల్లో.. 10 మందికి పైగా నాయకులు ఈ వ్యవహారంలో ఉన్నట్లు రాధాకిషన్ వెల్లడించారని తెలుస్తోంది. ఓ దశలో రాధాకిషన్‌రావు నోరు మెదపకపోవడంతో.. దర్యాప్తు అధికారులు తమదైన శైలిలో విచారించినట్లు సమాచారం. దాంతో.. తాను 2017లో కీలకమైన టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పోస్టింగ్ పొందడం దగ్గరి నుంచి.. 2020 ఆగస్టులో రిటైరైనా.. కొనసాగడం.. మరో మూడేళ్ల పాటు తన టర్మ్‌ను పెంచడం వెనక గత ప్రభుత్వంలో ఎవరు సహకరించింది చెప్పినట్లు తెలుస్తోంది. అందుకు ప్రతిగా తాను వారికి ఎలా సహకరించింది వివరించినట్లు సమాచారం. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఉన్న మార్గాలపై దృష్టి సారించినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 10 ఏప్రిల్ 2024

SCHOLARSHIP ALERT

Ujjivan Small Finance Bank Transgender Scholarship

Description: Ujjivan Small Finance Bank Limited invites applications from transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities.
Eligibility: Open to transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities. Students must have scored at least 50% marks in the previous academic year. Annual family income of the applicants must not exceed INR 10,00,000.
Prizes & Rewards: Scholarship up to INR 40,000
Last Date to Apply: 30-04-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/USFB1

University of Kent India Women in Leadership Scholarship 2024

Description: University of Kent India Women in Leadership Scholarship 2024 is an opportunity offered by the Uni versity of Kent to female applicants who have received a conditional offer to pursue a postgraduate course at the university.
Eligibility: Open for female students from and domiciled in India. Applicants must have received a conditional or unconditional offer for a full-time taught master's degree programme by the deadline.
Prizes & Rewards: 50% of the tuition fees for one year of study
Last Date to Apply: 24-05-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/LPUK1

Sitaram Jindal Foundation Scholarship Scheme 2024



Description: Sitaram Jindal Foundation Scholarship Scheme 2024 is an initiative by the Sitaram Jindal Foundation (NGO), for students from Class 11 to the post-graduate level. It aims to provide financial assistance to under-privileged students pursuing various degree/diploma courses.
Eligibility: Open to students currently enrolled in Class 11, 12, ITI, diploma, undergraduate, or postgraduate degree programs. Applicants must have met the minimum percentage requirement in their previous qualifying exam.
Prizes & Rewards: Up to 3,200 per month
Last Date to Apply: Round The Year
Application mode: ***By post to:*** The Trustee, Sitaram Jindal Foundation, Jindal Nagar, Tumkur Road, Bengaluru - 560073
Short Url: www.b4s.in/aj/SJS2

buddy4study.com

నిట్ దుర్గాపూర్‌లో ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ



దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్(ఎంఎస్‌డబ్ల్యు), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి కోర్సులో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంఎస్‌డబ్ల్యూ: ఇది రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. మొత్తం 15 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.
రాత పరీక్ష: ఇందులో సోషల్ సైన్స్, ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. గ్రూప్ డిస్కషన్‌కి 30, పర్సనల్ ఇంటర్వ్యూకి 20 మార్కులు ఉంటాయి.
ఎంబీఏ: కోర్సు వ్యవధి రెండేళ్లు. మొత్తం 44 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 17, ఓబీసీలకు 11, ఎస్టీలకు 3, ఎస్సీలకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 3 సీట్లు ప్రత్యేకించారు. అకడమిక్ ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం చాలు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/సీమ్యాట్ 2024/ఎక్స్‌ఏటీ 2024/మ్యాట్ 2023 డిసెంబరు/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి.
ఎంపిక: పదోతరగతి మార్కులకు 15 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 15 శాతం, రైటింగ్ ఎబిలిటీ అసెస్‌మెంట్‌కు 20 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 35 శాతం, అనుభవానికి 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 7
- **రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 11
- **రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 17, 18
- **అడ్మిషన్స్:** జూలై 3
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 27
- **తరగతులు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** nitdgp.ac.in

ఐఐఎస్సీలో ఎంఈ, ఎంటెక్

రిమైండర్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)- మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎం ఇంజనీరింగ్), జాయింట్ ఎంటెక్ విత్ తైవానీస్ యూనివర్సిటీస్, ఎంటెక్ (సీఎఫ్‌టీఐ మోడ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రకారం గేట్ వ్యాలిడ్ స్కోర్/అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఆగస్టు నుంచి అకడమిక్ సెషన్స్ ప్రారంభమౌతాయి.

ఎంటెక్ సీఎఫ్‌టీఐ మోడ్

స్పెషలైజేషన్‌లు: కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ డిజైన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ అటానమస్ సిస్టమ్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్
అర్హత: సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ స్కోర్ అవసరం లేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలైజేషన్‌కు రిటెన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. మిగిలిన అన్ని స్పెషలైజేషన్‌లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్ సెమీకండక్టర్ టెక్నాలజీ. ఈ ప్రోగ్రామ్‌ని సంస్థకు చెందిన సెంటర్ ఫర్ నానోసైన్స్ అండ్ ఇంజనీరింగ్ నూతనంగా ప్రారంభించింది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్(ఈసీ/ఈఈ/ఐఎన్/ఎంఈ/ఎంటీ/ఎక్స్‌ఈ-సీ) వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు గేట్(ఈసీ/ఐఎన్/పీహెచ్) వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అర్హులే. వీరికి గేట్ స్కోర్ అవసరం లేదు.

జాయింట్ ఎంటెక్ విత్ తైవానీస్ యూనివర్సిటీస్

- ఈ నూతన ప్రోగ్రామ్‌ని ప్రస్తుత అకడమిక్ ఇయర్ నుంచి సెంటర్ ఫర్ నానోసైన్స్ అండ్ ఇంజనీరింగ్, తైవానీస్ యూనివర్సిటీస్ ఉమ్మడిగా నిర్వహిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో ప్రధానంగా ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి.

పార్టిసిపేటింగ్ తైవానీస్ యూనివర్సిటీలు: నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ తైవాన్, నేషనల్ చియో తుంగ్ యాంగ్ మింగ్ యూనివర్సిటీ, నేషనల్ సింగ్ హువా యూనివర్సిటీ, నేషనల్ సన్ యాట్ సెన్ యూనివర్సిటీ
అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తి చేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి 8 సీజీపీఏతో డిగ్రీ ఉత్తీర్ణులు కూడా అర్హులే.
ఎంపిక: గేట్ వ్యాలిడ్ స్కోర్/అకడమిక్ మెరిట్‌కు 70 శాతం, రిటెన్ టెస్ట్ స్కోర్/ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 29
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూన్ 10 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** www.iisc.ac.in

ఇంటర్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం

ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామ్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష తరవాత అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సిహెచ్ఎస్ఎల్)-2024 కోసం ఎస్ఎస్‌సి ప్రకటనను విడుదల చేసింది. ఈ సారి సిహెచ్ఎస్ఎల్ ద్వారా 3,712 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటికి సంబంధించిన వివరాలను చూద్దాం..

పరీక్ష పేరు: కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్-2024

భర్తీ చేసే పోస్టులు

1. లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
2. డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
3. డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్జూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ, కల్చర్ మినిస్ట్రీలో డేటా ఎంట్రీ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌తో మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

జీతభత్యాలు

- ఎల్‌డీసీ, జేఎస్ఏ పోస్టులకు రూ.19,900 - రూ.63,200
- డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.25,500 - రూ.81,100
- డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్-ఎకు రూ.29,200 - రూ.92,300

ఎంపిక విధానం: అభ్యర్థులను మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ మూడు దశలను టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌గా వ్యవహరిస్తారు.
టైర్-1 ఆబ్జెక్టివ్ టెస్ట్: టైర్-1 పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. వ్యవధి 60 నిమిషాలు. ఈ పరీక్షకు కేటాయించిన మొత్తం మార్కులు 200. ప్రశ్నపత్రం ఇంగ్లీష్/హిందీ భాషల్లో ఉంటుంది. నెగిటివ్ మార్కులు కూడా ఉంటాయి. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి 1/2 మార్కు కోత విధిస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లీష్ లాంగ్వేజ్ (బేసిక్ నాలెడ్జ్)	25	50
జనరల్ ఇంటెలిజెన్స్	25	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (బేసిక్ అర్థమెటిక్ స్కిల్)	25	50
జనరల్ అవేర్‌నెస్	25	50



టైర్-1 సిలబస్: జనరల్ ఇంటెలిజెన్స్ విభాగంలో ప్రశ్నలన్నీ వెర్బల్, నాన్ వెర్బల్ తరహాలో ఉంటాయి. సిమాంటిక్ అనాలజీ, సింబాలిక్ ఆపరేషన్స్ సింబాలిక్ నంబర్ అనాలజీ, ట్రెండ్స్, ఫిగరల్ అనాలజీ, స్పేస్ ఓరియెంటేషన్, సిమాంటిక్ క్లాసిఫికేషన్, వెన్ డయాగ్రమ్స్, సింబాలిక్/ నంబర్ క్లాసిఫికేషన్, డ్రాయింగ్ ఇన్ఫెరెన్సెస్, ఫిగరల్ క్లాసిఫికేషన్, పంచ్‌డ్ హోల్/ పాట్రన్ ఫోల్డింగ్, అన్ ఫోల్డింగ్, సిమాంటిక్ సిరీస్, ఫిగరల్ పాట్రన్, ఫోల్డింగ్ & కంప్లీషన్, నంబర్ సిరీస్, ఎంబెడెడ్ ఫిగర్స్, ఫిగరల్ సిరీస్, క్రిటికల్ థింకింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, వర్డ్ బిల్డింగ్, సోషల్ ఇంటెలిజెన్స్, కోడింగ్ & డీ కోడింగ్, ఇతర న్యూమరికల్ ఆపరేషన్స్‌కు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

- ఇంగ్లీష్ లాంగ్వేజ్ విభాగంలో స్పాట్ ద ఎర్రర్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, సినానిమ్స్, హోమోనిమ్స్, ఆంటోనిమ్స్, స్పెల్లింగ్స్ డిటెక్టింగ్ మిస్ స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్& ఫ్రేజెస్, ఒన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్ / పాసివ్ వాయిసెస్ ఆఫ్ వర్బ్స్, డైరెక్ట్ / ఇన్‌డైరెక్ట్ నెరేషన్, షఫిలింగ్ ఆఫ్ సెంటెన్స్ పార్ట్స్ / సెంటెన్సెస్ ఇన్ పాసేజ్, కాంప్రహెన్షన్ పాసేజ్ తదితర అంశాలు ఉంటాయి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ పార్టులో అర్థమెటిక్‌కు సంబంధించిన నెంబర్ సిస్టం, ఫండమెంటల్ అర్థమెటిక్ ఆపరేషన్స్, ఆల్జీబ్రా, జామెట్రీ, మెన్సురేషన్, ట్రిగొనామెట్రీ, స్టాటిస్టికల్ ఛార్ట్స్ వంటి అధ్యాయాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- జనరల్ అవేర్‌నెస్ విభాగంలో అభ్యర్థికి ఉన్న సామాజిక అవగాహనను తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు. కరెంట్ అఫైర్స్ మీద ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. భారతదేశం సహా పొరుగు దేశాలకు సంబంధించిన చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ, ఎకనామిక్స్, జనరల్ పాలసీ, సైంటిఫిక్ రీసెర్చ్ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

టైర్-2 : టైర్-1లో నిర్దేశించిన అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ఈ దశకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో రెండు మాడ్యూల్స్ ఉంటాయి. సెక్షన్-1లో మేథమెటికల్ ఎబిలిటీస్(మాడ్యూల్- 1), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(మాడ్యూల్-2); సెక్షన్-2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(మాడ్యూల్-1), జనరల్ అవేర్‌నెస్(మాడ్యూల్-2); సెక్షన్-3లో కంప్యూటర్ నాలెడ్జ్ టెస్ట్(మాడ్యూల్-1), స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్(మాడ్యూల్-2) ఉంటాయి. సెక్షన్-3లోని మాడ్యూల్-2 మినహా మిగతా ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ చాయిల్ ప్రశ్నలే ఉంటాయి. ఈ పరీక్షకు మొత్తం 405 మార్కులు(సెక్షన్-1కి 180, సెక్షన్-2కి 180, సెక్షన్-3కి 45) కేటాయించారు. సెక్షన్-1, సెక్షన్-2, సెక్షన్-3లోని మాడ్యూల్-1 ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి ఒక మార్కు కట్ చేస్తారు. టైర్-2 పరీక్షలో అన్ని సెక్షన్లలో తప్పనిసరిగా నిర్దేశిత అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.
స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్: టైర్-2లో నిర్దేశించిన అర్హత సాధించిన అభ్యర్థు లు మాత్రమే ఈ దశకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇది అర్హత పరీక్ష మాత్రమే (మెరిట్ లిస్ట్ ప్రిపరేషన్‌లో దీన్ని పరిగణనలోకి తీసుకోరు).ఇందులో పోస్టును అనుసరించి స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

- డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్‌లో 60 నిమిషాల్లో 8 వేల పదాల(కీ డిప్రెషన్స్)ను కంప్యూటర్‌లో ఎంటర్ చేసే వేగం ఉండాలి. అయితే ఇంగ్లీష్‌లో ఇచ్చిన ప్యాసేజ్‌ను తప్పులు లేకుండా 15 నిమిషాల్లో 2000-2200 పదాలను టైప్ చేసే సామర్థ్యం ఆధారంగా ఈ విభాగంలో అర్హతను నిర్ణయిస్తారు.
- డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు నిర్వహించే స్పీడ్ టెస్ట్‌లో గంటకు 15 వేల పదాల (కీ డిప్రెషన్స్)ను కంప్యూటర్‌లో ఎంటర్ చేసే వేగం ఉండాలి. అయితే ఇంగ్లీష్‌లో ఇచ్చిన ప్యాసేజ్‌ను తప్పులు లేకుండా 15 నిమిషాల్లో 3700 - 4000 పదాలను టైప్ చేసే సామర్థ్యం ఆధారంగా ఈ విభాగంలో అర్హతను నిర్ణయిస్తారు.
- టైర్ 1, టైర్ 2 టెస్ట్‌లు క్వాలిఫై అయిన ఎల్‌డిసి/జెఎస్ఏ అభ్యర్థులకు టైపింగ్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఈ పరీక్షకు ఏ మాధ్యమంలో (ఇంగ్లీష్/హిందీ) హాజరవుతారనే విషయాన్ని దరఖాస్తు లోనే పేర్కొనాల్సి ఉంటుంది. టైపింగ్ టెస్ట్‌ను కూడా కంప్యూటర్ మీదనే నిర్వహిస్తారు. అభ్యర్థులకు వారు ఎంచుకున్న మాధ్యమాన్ని అనుసరించి నిమిషానికి 35 ఇంగ్లీష్ పదాలు లేదా 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి. అంటే గంటకు 10500 ఇంగ్లీష్ కీ డిప్రెషన్స్ లేదా 9000 హిందీ డిప్రెషన్స్. ఈ వేగాన్ని 10 నిమిషాల ఆధారంగా లెక్కించి అర్హతను నిర్ణయిస్తారు.

దరఖాస్తు ఫీజు: రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ఫీజు చెల్లించనవసరం లేదు.
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, రాజమహేంద్రవరం, వరంగల్, కాకినాడ, కరీంనగర్, కర్నూలు, నెల్లూరు, విజయనగరం, చీరాల.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** మే 8
- **దరఖాస్తు సవరణ తేదీలు:** మే 10 నుంచి 11 వరకు
- **టైర్-1(కంప్యూటర్ ఆధారిత పరీక్ష) నిర్వహణ తేదీలు:** జూన్- జూలైలో నిర్వహిస్తారు
- **టైర్-2(కంప్యూటర్ ఆధారిత పరీక్ష) నిర్వహణ తేదీలు:** వివరాలు తరవాత ప్రకటిస్తారు.
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in/

లిటిల్స్



మీకు తెలుసా?

- ఎలుకల ఉండి జుట్టు ఎక్కువగా ఉండే ఈ జంతువును 'హెడ్జ్‌హాగ్' అంటారు.
- ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లలో పదిహేడు రకాల హెడ్జ్‌హాగ్స్ ఉంటాయి. రైల్వే ట్రాకుల దగ్గర, పార్కుల్లో, గృహాల దగ్గర ఈ జీవులు ఉంటాయి.
- ఎండుటాకులను తీసుకుని గూడు కట్టుకుంటాయి. వీటికి వేడి అంటే ఇష్టం ఉండదు. దీంతో సూర్యాస్తమం నుంచే ఇవి చురుగ్గా బయటకు వస్తాయి.
- ఇవి పండ్లు, చిన్న కప్పలు, పక్షులు గుడ్లు తింటాయి.
- వీటి కంటిచూపు చాలా తక్కువ. అయితే ముక్కు వాసనతోనే శత్రువులను పసిగట్టగలవు.




- వేగంగా కదలగలవు. చెట్లెక్కగలవు. సులువుగా నీటిలో ఈదుతాయి.
- ఇరవై ఐదు సెం.మీ పొడవు ఉండే ఈ జీవి 1.2 కేజీల బరువు ఉంటుంది.
- ఈ జీవులు రెండు లేదా మూడేళ్ల కంటే బతకవు.
- వీటి శరీరంమీద జుట్టు విచిత్రంగా ఉంటుంది. ఈ స్పైన్స్ కనీసం ఐదు వేల నుంచి ఏడు వేల వరకూ ఉంటాయి. ఇదో బాల్‌లా ముడుచుకుపోతుంది.
- ఒకేసారి నాలుగు నుంచి ఆరు పిల్లలను కంటాయివి.
- 125 మిలియన్ల కిందట ఈ హెడ్జ్‌హాగ్ ఆనవాళ్లు ఈ భూమ్మీద ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు.
- వాటంతట అవే ఉండలా, బంతిలా చుట్టుకుని పోయి రక్షించుకోగలవు.
- ఈ జీవిని పాము కాటేసినా నష్టం ఉండదు. విషం వీటికి ఎక్కదు.

సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి





డైలీ సుడోకు - 277

		2		9	5		8	4
						3		7
								5
8		4	5					
2			7		9			3
					1	6		8
9								
7		5						
1	8		6	4		5		

సుడోకు - 276 సమాధానం

2	1	6	3	9	4	8	7	5
5	9	7	8	1	6	2	3	4
8	4	3	7	2	5	6	9	1
1	8	2	6	5	9	3	4	7
7	6	9	1	4	3	5	2	8
4	3	5	2	8	7	1	6	9
6	5	1	4	7	2	9	8	3
9	2	4	5	3	8	7	1	6
3	7	8	9	6	1	4	5	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.